సాహిత్యం గత వారం రోజుల్లో వెలువడిన
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 173 పేజీలు: 12 వెల: 6.50

దేశంలో ముగిసిన ప్రజాస్వామ్యం: ప్రియాంక గాంధీ 9లో

ప్రధాని మోడీతో పవార్, సుప్రియ భేటీ

# దద్దరిల్లిన పార్లమెంటు


బుధవారం పార్లమెంటులో మాట్లాడుతున్న మంత్రి రిజిజు


మాట్లాడుతున్న ప్రతిపక్షనేత ఖర్గే

## 'నీట్'పై చర్చకు ఒప్పుకొన్న కేంద్రం

### మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే చర్చలన్న ఖర్గే

### విపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయ సభల్లో రభస.. నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జులై 22:** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, అలాగే సోమవారం నిర్వహించిన బసంసద్ చలో నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో బుధవారం కూడా పార్లమెంట్ ఉభయ సభలు తీవ్ర తీవ్రస్థాయి నిరసనల హోరులో కొనసాగాయి. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై సుదీర్ఘ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మరోసారి స్పష్టం చేసినప్పటికీ, నిరసనలు కొనసాగడంతో లోక్‌సభ, రాజ్యసభ రోజంతా వాయిదా పడ్డాయి. లోక్‌సభలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ అంశంపై >>2



# ఇదేం పాలన!

● గత పదేళ్లలో 152 పేపర్లు లీక్ ● ఒక్కరినైనా శిక్షించలేక పోయారు.. ● విద్యార్థులు న్యాయంగా పోరాడుతుంటే అణిచేస్తారా? ● ధర్మేంద్రను తొలగించండి ● మీడియాతో రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, జులై 22:** గత పదేళ్లలో 152 పేపర్లు లీక్ అయ్యాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే ఒక్కరికికూడా శిక్ష పడలేదని ఆయన విమర్శించారు. దేశంలోని విద్యా వ్యవస్థను లోపభూయిష్టంగా తీర్చిదిద్దారంటూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. నీట్ లీక్‌పై సిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రమవుతున్న తరుణంలో బుధవారం ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడారు. విద్యార్థులు న్యాయమైన కారణంతోనే నిరసన తెలుపుతున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, >>2

## చర్చలకు కేంద్ర మంత్రులే రావాలి

### 'కాక్రోచ్' నేతల డిమాండ్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్రంతో చర్చలకు మేము సిద్ధమేనని సిజెపి మరోసారి స్పష్టం చేసింది. అయితే చర్చల కోసం తాము ఎవరి ఇంటికి వెళ్లబోమని తెలిపింది. ఈ మేరకు ఇవాళ కాక్రోచ్ జనతా పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ రెండో విడత చర్చల కోసం బుధవారం ఉదయం పోలీసులు మళ్లీ మమ్మల్ని సంప్రదించారని >>2


బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస్‌వర్మ, ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, అప్పలనాయుడు

# భోగాపురానికి రండి

### ఆగస్టు 1న ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించడానికి ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

### తాజా రాజకీయ పరిస్థితిపై ఉభయుల మధ్య సుదీర్ఘ చర్చ

### జాతీయ మత్స్యబోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని వినతి

**విజయవాడ, జులై 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోడీతో సుమారు అరగంటకు పైగా సమావేశమయ్యారు. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజుఅంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానిని సిఎం ఆహ్వానించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రానికి చెందిన పలు అంశాలను, సమస్యలను సిఎం చంద్రబాబు ప్రధాని మోడీ దృష్టికి తీసుకుని వెళ్లారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర దశదిశను మారుస్తుందని సిఎం చంద్రబాబు ప్రధాని మోడీకి వివ >>2

కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ 2లో



## నీతి ఆయోగ్ కొత్త సిఇఒ అనురాగ్ జైన్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ కొత్త సిఇఒగా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1989బ్యాచ్ ఐఎఎస్ అధికారి అనురాగ్ జైన్‌ను నియమించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గ నియామకాలకమిటీ ఆమోదం తెలిపినట్లు సిబ్బంది, శిక్షణ శాఖ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. డిఒపిటి విడుదల చేసిన ఉత్తర్వులప్రకారం.. అనురాగ్ జైన్ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచే ఆయన నియామకం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఆయనకు మంజూరైన సేవా పొడిగింపు పూర్తయ్యే వరకు, అనంతరం మొత్తం రెండేళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏది ముందుగా వస్తే అంత వరకు ఆయన నీతి ఆయోగ్ సిఇఒగా కొనసాగనున్నారు. అలాగే ఆయన నియామకం తనకు ముందు ఈ పదవిలో ఉన్న సిఇఒకు వర్తించిన అదే నిబంధనలు, షరతుల ప్రకారమే >>2

## తూ.గోలో 4కు చేరిన కొవిడ్ కేసులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జులై 22,ప్రభాతవార్త:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య నాలుగుకి చేరింది. తాజాగా కొవిడ్ సోకిన ఇరువురు మహిళలకి రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఇందులో ఒకరు అప్పుడే డెలివరీ పోసుకున్న పసిబాలింత.అయితే తల్లికి పోజిటివ్ అయినా పసికందుకి మాత్రం నెగిటివ్. వారం కిందట జిహెచ్‌లోని మాతా శిశు విభాగంలో ఆమె పురుడు పోసుకున్నారు. ఆమెకు జ్వరం జలుబు తగ్గకపోవడంతో కొవిడ్ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో ఆమెను ప్రత్యేక వార్డులోఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా మరొకరు 54 యేళ్ల మహిళ.నాలుగు రోజుల నుంచి దగ్గు తగ్గిపోవడంతో జిజిహెచ్ ఓపికి వచ్చారు. వైద్యులు ఆర్టిపిసిఆర్ చేయగా పాజిటివ్ అని తెలిసింది. 8 మందికి ఆర్టీపిసిఆర్ పరీక్ష చేయగా ఇద్దరు వ్యక్తులకు పాజిటివ్‌గా తేలినట్లు నిర్ధారణ అయింది.

కొవిడ్ కేసులు పెరుగుతుండడంతో జిజిహెచ్‌లో ప్రత్యేక వార్డులను కేటాయించారు. మాస్కులు ధరించాలని జన సమూహాల్లోకి వెళ్లవద్దని నిత్యం చేతులు శుభ్రం చేసుకోవడంతో పాటు శానిటైజర్ వాడాలని భౌతిక దూరం పాటించాలని వైద్యులు సూచించారు.కాగా రాజమండ్రిలో మొదటి కరోనా 21 ఏళ్ల యువకుడిక పాజిటివ్. రాజమండ్రి జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందించారు. చికిత్స అనంతరం ఆరోగ్యం కుదుటపడంతో ఆ యువకుడు డిస్ చార్చి అయ్యారు.

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

### వేతన సవరణ కమిషన్, ఐఆర్, పెండింగ్ డిఎలు తదితర డిమాండ్లపై సుదీర్ఘ చర్చలు

### 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఐదుగంటలు పైగా చర్చించిన మంత్రుల బృందం


బుధవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల భేటీలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్,మంత్రులు అనగాని, సత్యకుమార్

**అమరావతి, జులై 22, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలను సాధ్యమైనంత వరకూ పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నం చేస్తుందని రాష్ట్ర ఆర్థిక,వాణిజ్య,శాసన సభ వ్యవహారాలశాఖామంత్రి పయ్యావుల కేశవ్ ఉద్యోగ సంఘాలకు స్పష్టం చేశారు. బుధవారం ఏపి సచివాలయంలో 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఆయన నేతృత్వంలోని మంత్రుల బృందం సమావేశమై సుమారు 5గం.ల పాటు ఉద్యోగుల సమస్యలను తెలుసుకుంది. సమావేశ అనంతరం ఆర్థిక మంత్రి మాట్లాడుతూ 21 ఉద్యోగ సంఘాల నుండి అన్ని సమస్యలను తెలుసుకున్నామని వాటన్నిటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత వరకూ ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా వేతన సవరణ కమీషన్‌ను ఏర్పాటు, ఐఆర్ ప్రకటన,పెండింగ్ డిఎలు,ఇతర పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించాలనే డిమాండ్లు అన్ని ఉద్యోగ సంఘాల నుండి వచ్చాయని వాటన్నిటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సానుకూలంగా పరిష్కారం అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ఉద్యోగులు వేరు ప్రజా ప్రతినిధులు వేరు కాదని ఇరువురు కలిసి పని చేస్తేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిపథంలో ముందుకువెళుతుందని అన్నారు. ఉద్యోగులపై చేసే ఖర్చును ప్రభుత్వం భారంగా పరిగణించడం లేదని పెట్టుబడిగానే భావించడం జరుగుతోందని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల ధృక్పదంతోనే కంట్రిబ్యూటరీ ఫెన్సన్ స్కీమ్ నుండి ఓల్డ్ ఫెన్సన్ స్కీమ్‌కు మార్చిందని అన్నారు.అదే విధంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా 60 నుండి 62 సంవత్సరాలకు పదవీ విరమణ వయస్సును పెంచిందని చెప్పారు. గత ప్రభుత్వంనుండి వారసత్వంగా పెద్ద ఎత్తునవచ్చిన అప్పులభారంనుండి రాష్ట్రాన్ని ఏవిధంగా బయటకు తేవాలనే దానిపై ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారని ఇందుకు కేంద్ర ప్రభుత్వంకూడా తగిన సహాయం అంది స్తోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.దేశంలోకి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి వచ్చాయంటేనే ఈప్రభుత్వ వచ్చాక రాష్ట్రం ఆర్థికంగా ఏవిధంగా ముందుకు వెళుతుందో అర్థం అవుతోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈసమావేశంలో ప్రభుత్వ >>2



## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్టు

### కుమారుడు ఆరవ్‌వర్మ కేసు

**శ్రీకాకుళం, జులై 22 ప్రభాతవార్త :** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ జిఎంఇ కాలనీలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పలరాజు కుమారుడు సీదిరి ఆరవ్ వర్మ ఇటీవల కాశీబుగ్గలో టూవీలర్‌తో గొర్రెల కాపరిని ఢీకొట్టి ఆయన మృతికి కారణమైన కేసులో రిమాండ్‌లో ఉన్నారు. తన కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించిన అభియోగాలపై అప్పలరాజుపై కేసు నమోదుచేశారు. మాజీ మంత్రి సీదిరి కుమారుడు హిట్ అండ్ రన్ కేసులో అప్పలరాజు ఎ3గా ఉన్నారు. సీదిరి ఆరవ్ వర్మ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన సోంపేట కోర్టు తిరస్కరించింది. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఇంటిని పోలీసులు చుట్టుముట్టి అరెస్ట్ చేశారు.

# నీటి ఎద్దడి రానివ్వొద్దు

### అమరజీవి జలధార మెగా మంచినీటి పథకాల అమలు

### వేగంపుంజుకొన్న పల్నాడు-ప్రకాశం జల్‌జీవన్ మిషన్: డి.సిఎం పవన్



**విజయవాడ,జులై 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ఈసారి రాష్ట్రవ్యాప్తంగా అధిక ప్రాంతాలు మంచినీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖలను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర నీటిఎద్దడి తీవ్రంగాఉండే పల్నాడు-ప్రకాశం లాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పథకంలో భాగంగా పల్నాడు-ప్రకాశం ప్రాంతాల్లో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనులు నిర్ణీత గడువులోపు పూర్తి కావాలని ఆదేశించారు.

బుధవారం పల్నాడు-ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పురోగతిని ఆర్.డబ్ల్యూ.ఎస్. >>2


బుధవారం మంగళగిరిలో లబ్దిదారులకు పట్టాలు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి నారా లోకేష్

## 3 వేల మందికి శాశ్వత ఇళ్ల పట్టాలు

### మంగళగిరి, తాడేపల్లి మండలాల లబ్ధిదారులకు పంపిణి చేసిన మంత్రి లోకేష్

### నియోజకవర్గంలో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**విజయవాడ. జులై22, ప్రభాతవార్తప్రతినిధి:** మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లుమన లోకేష్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు >>2


బుధవారం విజయవాడలో పరస్పరం దాడులు చేసుకుంటున్న బిజెపి, కాంగ్రెస్ శ్రేణులు

# కాంగ్రెస్, బిజెపి బాహాబాహీ

### ఢిల్లీ ఘటనలకు ప్రతిస్పందనగా విజయవాడలో ఆందోళనలు జరిపిన రెండు పార్టీల నేతలు

### కర్రలతో కొట్టుకొన్న రెండు వర్గాలు

### ఆంధ్రరత్న భవన్ ముట్టడికి యత్నం

**విజయవాడ, జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారిక నివాసం లోక్ కల్యాణ్ మార్గ్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనల ప్రభావం ఎపిలోనూ ప్రతిధ్వనించింది. దీనికి నిరసనగా విజయవాడలో బిజెపి నాయకులు భారీఎత్తున రోడ్లపైకివచ్చి ధర్నా నిర్వహించారు. వారిని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో తీవ్రస్థాయిలో ఘర్షణ చెలరేగింది. నడిరోడ్డు మీద బాహాబాహికి దిగారు. కర్రలతో కొట్టుకునేంత వరకూ వెళ్లింది. కాంగ్రెస్ పార్టీ తీరును నిరసిస్తూ విజయవాడలో బిజెపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ తీశారు. ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ హింసాత్మక వాతావరణానికి కారణమైందంటూ ఆరోపించారు. >>2



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను బహూకరిస్తున్న సిఎం చంద్రబాబు

# దద్దరిల్లిన పార్లమెంటు

>> ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చర్చ ఏ నిబంధన కింద, ఎప్పుడు, ఎంతసేపు నిర్వహించాలన్నది అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సంప్రదించిన అనంతరం స్పీకర్ నిర్ణయిస్తారని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను దేశ ప్రజలకు వివరించాల్సి న అవసరం ఉందని, అందుకే సమగ్ర చర్చకు సిద్ధమని రిజిజు పేర్కొన్నారు. యువతకు సంబంధించిన కీలక అంశాలను పార్లమెంట్‌లోనే చర్చించాలే తప్ప వీధుల్లో ఆందోళనలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని ఆయన ప్రతిపక్షంపై విమర్శలు గుప్పించారు. అంతకుముందు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ ఉదయం స్పీకర్ ఓంబిర్లాను ఆయన ఛాంబర్‌లో కలిసి చర్చలు జరిపారు. ఇక కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ, నీట్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి సమయంలో సభలోని ఇతర కార్యక్రమాలన్నింటినీ పక్కనపెట్టి ఈ అత్యవసర అంశానికే ప్రాధాన్యం ఇవ్వాలని వేణుగోపాల్ పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని స్పష్టంగా తెలిపిందని, ప్రతిపక్షం సభా కార్యక్రమాలను అడ్డుకోవడం కంటే చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాలని సూచించారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత ప్రయోజనాలు దెబ్బతింటే ప్రతిపక్షం ప్రజల మధ్యకు వెళ్లి నిరసనలు చేపట్టడం సహజమేనన్నారు. నిరసనల్లో ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తంచేసారు. ఆడబిడ్డలు దుస్తులు చించేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేసారు. ఇదేనా మనం ఆడబిడ్డలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. హౌస్‌లో బిజెపి, కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతుండగా తనను మాట్లాడనివ్వలేదని అఖిలేశ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగితే, ప్రతిపక్షాలు కూడా వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టక తప్పదని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపీలు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ హక్కులను అడుగుతున్నారని ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. ఇదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించడంతో లోక్‌సభను రోజంతా వాయిదా వేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో పాటు జంతర్ మంతర్ తదితర ప్రాంతాల్లో నిరసనకారులపై పోలీసులు తీసుకున్న చర్యలకు నిరసనగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు నల్ల దుస్తులు ధరించి సభకు హాజరయ్యారు. రాజ్యసభలో కూడా కిరెన్ రిజిజు ప్రభుత్వం వైఖరిని పునరుద్ఘాటించారు. నీట్ పేపర్ లీక్‌తో పాటు అన్ని ముఖ్యమైన అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ఏ నిబంధన కింద చర్చ నిర్వహించాలన్నది సభాపతి నిర్ణయిస్తారని తెలిపారు. సభ ప్రారంభమైన నాటి నుంచే ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని చెబుతోందని, అయితే ప్రతిపక్షం వరుసగా సభను అడ్డుకోవడం వల్ల పేపర్ లీక్ తర్వాత ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించే అవకాశం లేకుండా పోతోందని రిజిజు ఆరోపించారు. సభా నాయకుడు జెపి నడ్డా కూడా ప్రతిపక్ష తీరును తీవ్రంగా విమర్శించారు. ఇండియా కూటమి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ పార్లమెంట్ గౌరవాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. నీట్ పేపర్ లీక్ సహా అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మరోసారి స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, ఈ అంశంపై రూల్ 267 కింద చర్చ జరగాలని, అంతకుముందే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తమ ఏకైక డిమాండ్ ధర్మేంద్రప్రధాన్ రాజీనామా అని చెపుతూ మంత్రి రాజీనామా తర్వాతనే చర్చకు స్పందిస్తామని స్పష్టంచేసారు. ఉప సభాపతి హరివంశ్ స్పందిస్తూ, గత నాలుగుదశాబ్దాల్లో అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే రూల్ 267ను ఉపయోగించారని గుర్తుచేశారు. అయినా ప్రతిపక్ష సభ్యుల నిరసనలు కొనసాగడంతో రాజ్యసభను కూడా రోజంతా వాయిదా వేశారు.

## చర్చలకు కేంద్ర మంత్రులే రావాలి

>> చెప్పారు. కేంద్ర మంత్రి జెపి నడ్డా మీతో మాట్లాడాలనుకుంటున్నారని చెప్పి ఆయన నివాసానికి రమ్మని ఆహ్వానించినట్లు తెలిపారు. కానీ ఈ ఆహ్వానాన్ని తాము స్పష్టంగా తిరస్కరించినట్లు సౌరవ్ దాస్ వెల్లడించారు. మేము ఎవరి ఇంటికి, ఆఫీస్‌కు వెళ్లేదే లేదని కేంద్ర మంత్రులు, ప్రభుత్వం మాతో చర్చలు జరపాలంటే ఇకపై జంతర్ మంతర్ వద్దకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇక్కడ జనతా దర్బార్ జరుగుతోందని ప్రజల ముందుకు వచ్చి చర్చలు జరపాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సౌరవ్ దాస్ తాము చదువుకున్న వ్యక్తులమేనని తాము పట్టుదలకు పోయే వ్యక్తులం కాదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు చర్చల కోసం జంతర్ మంతర్ వద్దకు వస్తే తమ భద్రతపై ఏదైనా ఆందోళన ఉంటే జంతర్ మంతర్ సమీపంలోని ఏదైనా తటస్థవేదికగా సమావేశమయ్యేందుకు మేము సిద్ధమేనన్నారు. ఈ విషయంలో కేంద్రం సమాధానం కోసం వేచి చూస్తున్నామని వెల్లడించారు. అలాగే మా డిమాండ్లను ఆమోదించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉండాలని అర్థం లేని చర్చల కోసం మమ్మల్ని పిలవడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మా సమయం చాలా విలువైనది. వేలాది మంది ప్రజలు ఇప్పటికీ ఈ నిరసనలో పాల్గొంటున్నారు, వారిని సమన్వయం చేసుకోవాల్సి న బాధ్యత కూడా మాపై ఉందని తెలిపారు. .ప్రభుత్వం నిజంగా మాతో చర్చలు జరిపే ఉద్దేశంతో ఉందో లేదో ముందుగా స్పష్టం చేయాలని సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు.

## నీతి ఆయోగ్ కొత్త సిఇఓ అనురాగ్ జైన్

>> ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. పరిపాలనా సేవలో విస్తృతమైన అనుభవం ఉన్న అనురాగ్ జైన్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. జైన్ పదవీ విరమణ ఆగస్టు 31, 2025న జరగాల్సి ఉంది. అయితే ఆయన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఒక సంవత్సరం పొడిగింపును మంజూరు చేసింది. ఈ పొడిగింపుతో ఆయన పదవీకాలం ఆగస్టు 31, 2026 వరకు కొనసాగుతుంది. నీతి ఆయోగ్ సిఇఓగా ఆయన నియామకాన్ని దేశ విధాన రూపకల్పన ప్రక్రియలో ఒక ముఖ్యమైన పరిపాలనా మార్పుగా పరిగణిస్తున్నారు.

# భోగాపురానికి రండి

>> రించారు. గతంలో వెనుకబడిన ఈ ప్రాంతం అనుహ్యంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎపిలో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సిఎం కోరారు. అమరావతిలోని నెక్కల్లు గ్రామంలో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఎఫ్‌డిబి ప్రాంతీయ కార్యాలయం, శిక్షణ కేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం అక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని సిఎం కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా క్రమబద్ధీకరించాలని కోరారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని సిఎం కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్‌లో ఉపయోగించే చేప పొడిని 5శాతం ప్రోత్సాహకాలతో ఎగుమతికి అనుమతిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కారణంగా దేశీయ ఫీడ్ తయారీ దారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా ఎగుమతులను నియంత్రించాలన్నారు. దేశీయ రొయ్యల ఫీడ్ తయారీ దారుల అవసరాలు తీరిన తర్వాతే ఎగుమతులకు అనుమతించాలని కోరారు. జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి కూడా అనుమతి ఇవ్వాలన్నారు. ఎపి నుంచి ఎఫ్‌సివి పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించేందుకు దోహదపడుతోందని సిఎం వెల్లడించారు. దేశంలోని పొగాకు ఉత్పత్తిలో ఎఫ్‌సివి పొగాకు 70 శాతం మేర ఎగుమతి అవుతోందని సిఎం వెల్లడించారు. జింబాబ్వే, టాంజానియా లాంటి దేశాల్లోని ఎగుమతి దారులకు ఆయా దేశాలు రాయితీలు, సుంకాల మినహాయింపు ఇస్తున్నాయని తెలిపారు. భారతీయ పొగాకు ఎగుమతిదారులకు ఎలాంటి మద్దతు లేకపోవటంతో తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆగస్టు 2021లో రోడ్‌టెప్ పథకం కింద టీ, కాఫీ, మసాలా దినుసులు లాంటి వ్యవసాయ వస్తువులను చేర్చినప్పటికీ... ప్రాసెస్ చేయని పొగాకును (హెచ్ఎస్ కోడ్ 2401) మాత్రం ఈ జాబితాలో చేర్చలేదన్నారు. సమాన వడ్డీ పథకం, నిర్యాత్ ప్రోత్సాహన్ లాంటి పథకాల కింద ఎఫ్‌సివి పొగాకుకు సబ్సిడీ లేకపోవటంతో ఎగుమతిదారులకు భారం పడుతోందని సిఎం వివరించారు. తక్షణమే ప్రాసెస్ చేయని పొగాకు (హెచ్ఎస్ కోడ్ 24012401 10, 2401 20,2401 30) రకాలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో పాటు,ఇతరప్రయోజనాలు వర్తింపజేయాలని సిఎం కోరారు. ప్రధాని మోడీకి తన పాటుగా వచ్చిన ఎంపీలను సిఎం చంద్రబాబు పరిచయం చేసారు.పోలవరం ప్రాజెక్ట్,అమరావతి నిర్మాణం వేగంగా జరిగేందుకు కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందివ్వాలని కోరారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఉన్న లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ అంటూ కలిశెట్టి అప్పలనాయుడిని ప్రధానికి సిఎం పరిచయం చేయగా అప్పలనాయుడు నాకు తెలుసు. అయన రోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారని ప్రధాని బదులిచ్చారు. ఈ సమావేశంలో సిఎంతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్, శ్రీనివాసవర్మ, ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, అప్పలనాయుడు ప్రధానిని కలిశారు.

# నీటి ఎద్దడి రానివ్వొద్దు

>> అధికారులు వివరించారు. రెండు మెగా ప్రాజెక్టుల అంచనా వ్యయం దాదాపు రూ. 2,500 కోట్లు కాగా, అందులో రూ. 1,290 కోట్ల అంచనా వ్యయంతో ప్రకాశం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో, 593 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించిన ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి ఇంటేక్ వెల్ నిర్మాణం పనులు 40 శాతానికి పైగా పూర్తయ్యాయి.

119 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్ పనులు, సంపులు, గ్రౌండ్ లెవల్ బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు పురోగన్నాయి. ప్రకాశం వాటర్ గ్రిడ్ పథకం కింద ఇప్పటి వరకు 53 కిలోమీటర్ల మేర పైపు లైన్ల నిర్మాణం పూర్తి చేసినట్టు వివరించారు.రూ. 1,200 కోట్లతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని 235 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించగా, ఇప్పటికే 152 కిలోమీటర్ల మేర పైపు లైన్ నెట్వర్క్ పూర్తయ్యింది. ఇన్ టేక్ వెల్స్, రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పనులు కూడా పురోగతిలో ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే రూ. 95 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేసినట్టు తాగునీటి సరఫరా విభాగం అధికారులు వివరించారు.

అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'తాగు నీటి సమస్యతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులుపడుతున్న పల్నాడు, ప్రకాశం ప్రాంతాల ప్రజలకు ఈ ప్రాజెక్టులు జీవనాధారంగా మారనున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన అమరజీవి జలధార మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు చాలా కీలకమైనవి. వీటి నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిర్ణీత గడువులోపు ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి, లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ మంచి నీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలి. గ్రామాల మధ్య పైపు లైన్ల నిర్మాణం, అటవీ అనుమతులు లాంటి సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయండి. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణ కార్యకలాపాలను సాధ్యమైనంత వేగంగా ముందుకు తీసుకువెళ్లాలి. భుజం శస్త్ర చికిత్స నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత పనుల పురోగతిని పరిశీలించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలు చేపడతాను. స్వయంగా పనుల నాణ్యతను పరిశీలిస్తా. జల్ జీవన్ మిషన్ పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దు. పల్నాడు, ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు పూర్తయితే ఈ రెండు ప్రాంతాల పరిధిలోని సుమారు 10 నియోజకవర్గాల పరిధిలో 16 లక్షల మందికి పైగా ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత ఏర్పడుతుంద"న్నారు.

## ఇదేం పాలన!

>> అసమర్థుడని రాహుల్ గాంధీ ఆరోపించారు. మన అతిపెద్ద ఆస్తి అయిన భారతదేశ విద్యా వ్యవస్థను విద్యాశాఖ మంత్రి నాశనం చేస్తున్నారని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇది న్యాయమైన డిమాండ్. ప్రధాన్ ఒక అవినీతిపరుడు, అసమర్థుడు. ఈ గందరగోళం మొత్తానికి ప్రతీక. ఆయనను తప్పక తొలగించాలని అన్నారు. మరోవైపు గత 10 ఏళ్లలో కనీసం 152 పేపర్ లీక్‌లు జరిగాయని, వాటిపై ఎటువంటి జవాబుదారీతనం లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ లీక్‌లు కోట్లాది మంది విద్యార్థులపై ప్రభావం చూపాయి. గత పదేళ్లలో పేపర్ లీక్ కేసుల్లో ఎవరికీ శిక్ష పడలేదు. విద్యార్థులు దీనిని ప్రశ్నిస్తున్నారు అని అన్నారు. అయితే పేదలు, మధ్యతరగతి ప్రజలకు విద్యా వ్యవస్థ అందుబాటులో లేకుండా పోయిందని రాహుల్ అన్నారు. నీట్ కోచింగ్ కోసం దేశవ్యాప్తంగా అభ్యర్థులు ఏటా రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దేశ వార్షిక విద్యా బడ్జెట్ అయిన రూ. 1.4 లక్షల కోట్లతో ఇది దాదాపు సమానమని గుర్తు చేశారు.

### వారం - వర్జ్యం

23-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
నవమి ఉ.7.04, విశాఖ రా.1.43
వర్జ్యం : లేదు
దు.ఉ.10.04-ఉ.10.56,
2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

### వారఫలం

**మేషం:** ఇంటాబయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** ఉన్నతాధికారులతో మాట్లాడే టప్పుడు జాగ్రత్తలు పాటించడం వలన లాభపడతారు. వాహన సౌలభ్యం కలదు.

**మిథునం:** వంతాలు వివాదాలు అధికమవుతాయి. ఓర్పు కలిగి ఉండటం చెప్పదగిన సూచన. బంధువుల కలయిక.

**కర్కాటకం:** రెండు మూడు విధాలుగా ధనలాభం పొందుతారు. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**సింహం:** తప్పుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నారు. పెండింగ్ లోని కోర్టు వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి.

**కన్య :** బంధువులకు సంబంధించిన వ్యవహారాలు పర్యవేక్షించవలసి వస్తుంది. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

**తుల:** మీరు ఏర్పరచుకున్న సౌకర్యాలను కలుషితం చేసే యత్నాలు జరుగుతాయి. జాగ్రత వహించండి. ఆరోగ్యం జాగ్రత్త.

**వృశ్చికం:** జీవిత భాగస్వామి తో మాట్లాడే టప్పుడు సంయమనం పాటించండి. వ్యాపారానుకూలత బాగుంటుంది.


**ధనుస్సు:** ఎంత ప్రయత్నించినా పనులు అనుకున్న విధంగా పూర్తికావు. ఆర్థిక సర్దుబాటులు ఎంతో నేర్పుగా చేస్తారు.

**మకరం:** నూతన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆస్తి వివాదాలు చికాకుకలిగిస్తాయి.

**కుంభం:** అనుకోకుండా కొన్ని అవకాశాలు లభిస్తాయి. అనాథ బాలలకు డబ్బు రూపేణా మీ వంతు సహాయాన్ని అందిస్తారు.

**మీనం:** అధిక శ్రమను పంచుకొనడానికి నమ్మకస్తులైన వారిని ఎన్నుకొని బాధ్యతలను అప్పగిస్తారు. శుభవార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం మనిలాలో ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి పెన్నీవాంగ్‌తో భారత్ విదేశాంగ మంత్రి జైశంకర్

## కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబునాయుడు అయ్యారు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు చర్చించారు. సముద్రంలో వృథాగా పోయే నీటిని వాడుకోవడం ఉత్తమమని సిఎం సూచించారు. శ్రీశైలం నుంచి అనుసంధానిస్తే గ్రావిటీ ద్వారా కావేరికి నీరు చేరి ఖర్చు తగ్గుతుందన్నారు. అది కుదరకపోతే బనకచర్ల నుంచి ప్రాజెక్టు చేపట్టాలని కోరగా, అధికారులు సానుకూలత తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఈ అనుసంధాన భారం తగ్గుతుందని సిఎం వివరించారు. అలాగే పోలవరం ఎడమ కాలువను శ్రీకాకుళం వరకు పొడిగించాలని ఆయన కోరారు. అయితే మహానది వంశధారతో ఆ ప్రాంతానికి ప్రయోజనం ఉంటుందని అధికారులు చెప్పారు. ఈ నదుల అనుసంధానంపై మిగతా రాష్ట్రాలను ఒప్పించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. దీనిపై రెండు మూడు వారాల్లోనే భాగస్వామ్య రాష్ట్రాల సిఎంలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేస్తామని మంత్రి పాటిల్ హామీఇచ్చారు. అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు అన్నారు. జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రాల ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని, సముద్రంలోకి నీరు వృథాగా పోయే కంటే ఉపయోగించుకుంటే మంచిదని సిఎం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అన్ని రాష్ట్రాలతో భేటీ ప్రతిపాదనను కేంద్రమంత్రి సి.ఆర్.పాటిల్ అంగీకరించారు.

## కాంగ్రెస్, బిజెపి బాహాబాహీ

>> రాహుల్ గాంధీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. పార్టీ భవనంలోకి దూసుకెళ్లడానికి ఎగబడ్డారు. పోలీసులు అడ్డుకున్నా లెక్క చేయలేదు.ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు కూడా పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చాయి. పార్టీ కార్యాలయం ముట్టడిని అడ్డుకోవడానికి ప్రయత్నించాయి. కాంగ్రెస్ నాయకులు ప్రతిఘటించడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది కాస్తా పరస్పర తోపులాటకు దారితీసింది. ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరినొకరు నెట్టుకుంటూ భౌతిక దాడులకు దిగారు. పార్టీ జెండాలను పట్టుకున్న కర్రలతో పరస్పరం కొట్టుకున్నారు.పరిస్థితి చేజారిపోతుండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న విజయవాడ నగర పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. ఘర్షణ పడుతున్న ఇరు పార్టీల నాయకులను, కార్యకర్తలను విడదీసేందుకు పోలీసులు లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది. గొడవ మరింత పెరగకుండా నిరసనకారులను బలవంతంగా చెదరగొట్టారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. విజయవాడలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని నగర పోలీసు అధికారులు ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్, బిజెపి కార్యాలయాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

>> ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన అంశాలను వీలైనంత వరకూ చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.వివిధ ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అన్ని అంశాలను పరిశీలించి ప్రభుత్వ స్థాయిలో వీలైనంత మేరకు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్,రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు పాల్గొనగా, రాష్ట్ర ఆహార పౌర సరఫరాలు,వినియోగ దారుల వ్యవహారాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ వర్చువల్‌గా పాల్గొన్నారు.ఇంకా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు శశి భూషణ్ కుమార్,యంటి.కృష్ణబాబు,ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్,కార్యదర్శులు వాడ్రేవు వినయ్ చంద్,వీరపాండ్యన్ తదితర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా ఉద్యోగ సంఘాల తరపున ఎపి ఎన్జిజిఒ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రామకృష్ణ,ఎపి రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు,ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.సూర్యనారాయణ,ఎస్టియు ఎపి అధ్యక్షులు సాయి శ్రీనివాస్,ఎపి యుటిఎఫ్ ఎన్. వెంకటేశ్వర్లు,ఎపి పిఆర్టియు ఎం.కృష్ణయ్య,ఎపిటిఎఫ్ జి.హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

### అమరావతి రైల్వే లైన్:
## భూములిచ్చే రైతులకు రాజధాని సమీపంలో ప్లాట్లు
### - మంత్రి నారాయణ

**విజయవాడ, జులై22, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రైల్వేలైన్‌కు భూములిచ్చే రైతులకు రాజధాని సమీపంలో ప్లాట్లు కేటాయిస్తామని మంత్రి నారాయణ అన్నారు. రైల్వే లైన్, అవుటర్ రింగ్ రోడ్, కొండవీటి వాగు విస్తరణకు భూములు సమీకరించేందుకు గుంటూరు జిల్లా తాడికొండలో గ్రామసభ నిర్వహించారు. 3 ప్రాజెక్టులకు కలిపి తాడికొండ గ్రామ పరిధిలో 4,000 ఎకరాలకుపైగా సమీకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై రైతుల అభిప్రాయాలు, అభ్యంతరాలను మంత్రి నారాయణ తెలుసుకున్నారు. రాజధాని అమరావతి విషయంలో జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై రైతులు సందేహాలు లేవనెత్తారు. భూసమీకరణతో పాటు భూసేకరణకు కూడా అవకాశం కల్పిస్తే తమ ఇష్టం వచ్చిన విధానాన్ని ఎంచుకుంటామని కొందరు రైతులు తెలిపారు. ఇద్దరు రైతులు గ్రామసభలోనే భూసమీకరణకు తమ అంగీకారాన్ని తెలియజేస్తూ పత్రాలు అందజేశారు. అమరావతి రైల్వేలైన్‌కు భూములిచ్చే రైతులకు రాజధాని సమీపంలో ప్లాట్లు కేటాయిస్తామని మంత్రి నారాయణ అన్నారు. రైతుల అభ్యంతరాలన్నింటినీ నోట్ చేసుకున్నామని మంత్రి నారాయణ ఈ సభలో స్పష్టం చేశారు.

## అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు కేసు తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

**విజయవాడ, జులై22, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో ప్రతిపాదిత సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. ఈ రహదారి నిర్మాణంపై గతంలో విధించిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పూర్తయింది. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం, తుది తీర్పు వెలువడే వరకు వివాదాస్పద భూమి విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది.ఈ పిటిషన్‌పై జస్టిస్ రవీంద్రనాథ్ తిలకరి, జస్టిస్ చింతలపూడి పురుషోత్తం కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలువినిపిస్తూ.. కోర్టు విధించిన మధ్యంతర ఉత్తర్వుల వల్ల కీలకమైన రహదారి నిర్మాణపనులు నిలిచిపోయాయని, దీనివల్ల ప్రాజెక్టు ఆలస్యమవుతోందని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్టే ఉత్తర్వులను తొలగించాలని ఆయన కోరారు.

## దేశ వ్యతిరేక శక్తులకు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్
### బిజెపి రాష్ట్ర చీఫ్ మాధవ్

**విజయవాడ, జులై 22, ప్రభాతవార్తప్రతినిధి:** నీట్ పరీక్ష అంశంపై ప్రారంభమైన ఢిల్లీ నిరసనలు దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించే స్థాయికి చేరుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఆరోపించారు. దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తోందని విమర్శించారు. విజయవాడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఢిల్లీలో సోనమ్ వాంగ్చుక్ చేపట్టిన నిరసనల్లో అర్బన్ నక్సల్స్, దేశ విద్రోహ శక్తులు చొరబడ్డాయని మాధవ్ ఆరోపించారు. ఆర్టికల్-370 రద్దును వ్యతిరేకించడం, పార్లమెంట్ దాడి కేసు నిందితుడు అఫ్జల్ గురు ఉరితీతను ప్రశ్నించడం, దేశాన్ని ముక్కలు చేస్తామంటూ నినాదాలు చేసే శక్తులకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలవడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై దాడి యత్నం దేశంపైనే జరిగిన దాడిగా భావిస్తున్నామని మాధవ్ పేర్కొన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యాలయాల ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిందన్నారు. విజయవాడలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు గుడ్లతో, కర్రలతో దాడి చేయడం వారి హింసాత్మక రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో 150కు పైగా పేపర్ లీకులు జరిగిన విషయాన్ని కాంగ్రెస్ మరచిపోయిందని విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగులోకి రాగానే బాధ్యులపై మోదీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని అరెస్టులు చేసిందన్నారు.

# 3 వేల మందికి శాశ్వత ఇళ్ల పట్టాలు

>> శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**భారీ మెజారిటీతోనే భారీ అభివృద్ధి**

ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని లోకేష్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది"అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు.

**మోడల్ నియోజకవర్గమే లక్ష్యం**

మంగళగిరిని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు లోకేష్ తెలిపారు. నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్రం నుంచి ఛాలెంజ్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, మూసేసిన అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం, పైప్‌లైన్ గ్యాస్ వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిడమర్రు స్కూలులో సీటు కోసం ఒక తల్లి తనతో వాదించడం ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**మలివిడతలో 2,634మందికి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి లోకేష్..**

'మన ఇల్లు - మన లోకేష్' కార్యక్రమంలో భాగంగా వరుసగా రెండోరోజు కూడా మంత్రి లోకేష్ 6 గంటలపాటు నిలబడి పట్టాలు పంపిణీ చేశారు. రెండో రోజున ఉదయం 9.30గంటలనుంచి మధ్యాహ్నం 3.30గంటలవరకు 6గంటలపాటు సికె కన్వెన్షన్ వేదికపైనుంచి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. తొలిరోజున 1331మందికి, రెండోరోజున 1303మందికి మొత్తంగా 2,634 మందికి నూతన పట్టాలు అందజేసారు.మలివిడతలో మంత్రి లోకేష్ అందజేసిన పట్టాల మార్కెట్ విలువ సుమారు రూ.1000 కోట్లుగా ఉంది. రెండోరోజు కూడా ఓపికగా నిలబడి పట్టాలు అందించిన లోకేష్... పలువురు దివ్యాంగ లబ్ధిదారులకు వేదిక కిందకు దిగి వెళ్లి పట్టాలను అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి లబ్ధిదారు, వారి కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగారు. తొలివిడత గత ఏడాది ఏప్రిల్ నెలలో 3,003 మందికి పట్టాలు అందజేశారు. 2029లోగా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూముల్లో దీర్ఘకాలంగా నివాసముంటున్న ప్రతి లబ్ధిదారుడికి పట్టాలు అందజేస్తానని గత ఎన్నికల సమయంలో యువనేత లోకేష్ హామీ ఇచ్చారు. ఇరిగేషన్, రెవిన్యూ, అటవీ, దేవాదాయ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, రైల్వే తదితర శాఖలకు చెందిన భూముల్లో పేదలు దాదాపు మూడు దశాబ్దాలకు పైబడి ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నారు. నాడు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు వివిధ శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ పలుమార్లు సంప్రదింపులు జరిపి, శాఖలవారీగా స్థలాల సమస్యను పరిష్కరించారు. కేంద్రప్రభుత్వంతో ముడిపడివున్న మరికొన్ని భూముల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. వాటిపై కూడా కేంద్ర పెద్దలతో మంత్రి లోకేష్ సంప్రదింపులు జరుపుతున్నారు.

## పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు, పోస్టింగ్స్

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు, పోస్టింగ్స్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను అనుసరించి అనకాపల్లి జిల్లా అడ్డరోడ్డు ఆర్డీఓగా కె.వి.రామలక్ష్మి, ధర్మవరం ఆర్డీవోగా రామభూపాల్ రెడ్డి, అమలాపురం ఆర్డీవోగా డి.ధర్మరాజు, పీలేరు ఆర్డీవోగా కె.విజయలక్ష్మి, మడకశిర ఆర్డీవోగా నాగప్రసన్న లక్ష్మి, అనంతపురం ఆర్డీఓగా ప్రేమ్‌నాథ్ కుమార్ నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే సంబంధిత స్థానాల్లో విధుల్లో చేరాలని సిఎస్ సాయిప్రసాద్ సూచించారు.

## విదేశాల్లో ఉద్యోగాల పేరుతో భారీ మోసం


### ఫ్లయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ నిర్వాహకులు సౌజన్య, శ్రీనివాస్ దంపతుల అరెస్ట్

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగులను నమ్మించి మోహం చాటేసిన ఫ్లయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ నిర్వాహకులు సౌజన్య, శ్రీనివాస్ దంపతులు విజయవాడ పోలీసులకు పట్టుబడ్డారు. దాదాపు 750 మంది నిరుద్యోగుల నుంచి రూ.11.46 కోట్లు వసూలు చేసినట్లు దంపతులపై ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో నిందిత దంపతులను విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐరోపా దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు సౌజన్య, శ్రీనివాస్ దంపతులు వలవేసారు. డబ్బులు తీసుకుని ఉద్యోగాలు చూపించకుండా మోసం చేసి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. వారిపై బాధితుల ఫిర్యాదు మేరకు మాచవరం, సైబర్ క్రైమ్, సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. కొంతకాలంగా పరారీలో ఉన్న సౌజన్య, శ్రీనివాస్ దంపతులు ఎట్టకేలకు అత్యంత చాచక్యంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన సొమ్మును స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడి పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. కంకిపాడు ప్రాంతంలో దంపతుల పేర్లతో పలు స్థలాల కొనుగోలు చేసారు. స్థలాల లావాదేవీల విలువ సుమారు రూ.1.42 కోట్లుగా గుర్తించిన పోలీసులు. మరిన్ని ఆస్తుల వివరాల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోలీసుల ఆరా తీస్తున్నారు. సంస్థ కార్యాలయంలో సోదాలు చేసారు. ల్యాప్‌టాప్‌లు, ఇతర పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీలో దంపతులిద్దరూ నిర్వాహకులుగా ఉన్నట్లు ఆధారాలు లభించాయి. నిందితుల ఆర్థిక లావాదేవీలు, విదేశీ ఉద్యోగాల నెట్‌వర్క్‌పై పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.

# భూ రికార్డుల శాశ్వత భద్రతకు బ్లాక్‌చెయిన్

- నేడు సిఎం చంద్రబాబు చేతుల మీదుగా 'మీ భూమి- బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- 7 జిల్లాల పరిధిలోని 7 మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు
- భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్'గా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' ప్రాజెక్ట్
- భూ మోసాలకు చెక్.. వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే ఖీమీభూమి-బ్లాక్ చెయిన్‌ఖీ వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. వి.ది ఆంధ్రప్రదేశ్, వి.ది బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్‌ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది.




ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్‌తో సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్‌డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీ మ్రపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీసర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్



## తగ్గిన బొప్పాయి ధరలు... భగ్గుమన్న రైతులు

- కోతకు వెళ్లే లారీలను ఆపి రోడ్డుపై గడ్డి కాలుస్తూ నిరసన

**రైల్వేకోడూరు రూరల్, జులై 22 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలంలో బుధవారం బొప్పాయి ధరలు తగ్గడంతో ఒకసారిగా బొప్పాయి రైతులు రోడ్లు పైకి వచ్చి వరిగడ్డి కాలుస్తూ నిరసనను వ్యక్తం చేశారు. బుధవారం తెల్లవారుజామునే కోతకు వెళ్లే లారీలను ఆపి వరిగడ్డి తెచ్చి ప్రధాన రహదారిపై వేసి బొప్పాయి రైతులు ధరలను తగ్గిస్తే ఇదే నిరసనను కొనసాగిస్తామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా బొప్పాయి ద్వారా కిలోకు రూ.18 లుండగా ఒక్కసారిగా దళారుల చేతుల్లో 14కు తగ్గిపోవడంతో ఉక్కిరిబిక్కిరి అయిన బొప్పాయి రైతులు పూర్తిగా పలుచోట్ల నిరసనలను వ్యక్తం చేశారు. అదేవిధంగా ధరలు తగ్గింపును వ్యతిరేకిస్తూ ప్యాకింగ్ కేంద్రాల వద్ద ఆందోళన ఉద్రిక్తం చేస్తామని రైతులు పేర్కొన్నారు. బొప్పాయి రైతులు తమ పొలాల్లో ఉన్న బొప్పాయి కోత (కట్టింగ్) చేపట్టవద్దని నిర్ణయించడంతో పలు గ్రామీణ ప్రాంతాల్లో బొప్పాయి లోడింగ్ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో లోడు చేయవలసిన లారీలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ఒకసారిగా కోడూరు పట్టణంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సమాచారం తెలుసుకున్న రైల్వే కోడూరు సిఐ చంద్రశేఖర్, ఎస్ఐలు లక్ష్మీ ప్రసాద్ రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి సంబంధిత వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వేగవంతంగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ రైల్వేకోడూరు మండలంలో రైతులతో చర్చలు జరిపి, ఆందోళన విరమింపజేశారు.

# వైమానిక ప్రస్థానంలో సరికొత్త శకం!

- అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధమైన భోగాపురం ఎయిర్‌పోర్ట్



**విజయనగరం, జులై 22 ప్రభాతవార్త:** భారతీయ విమానయాన రంగంలో మరో అద్భుతమైన చరిత్రను ఆవిష్కరించేందుకు రంగం సిద్ధమైంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుస్తూ, భోగాపురం వద్ద అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న ఖీఅల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంఖీ ఆగస్టు 1న జాతికి అంకితం కానుంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. ఈ విమానాశ్రయం కేవలం ఒక రవాణా కేంద్రం మాత్రమే కాదు ఇది ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక వృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి, ఉపాధి అవకాశాల సృష్టికి ఒక తిరుగులేని వారధిగా నిలవనుంది.

**అత్యుత్తమ మౌలిక వసతులు-ప్రత్యేకతలు:** ప్రముఖ విమానాశ్రయ సంస్థ జీఎంఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంది. భారీ విమానాలు సైతం సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా 3,800 మీటర్ల పొడవు గల ఖికోడ్ 4ఈఖీ రన్‌వేను ఏర్పాటు చేశారు. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణీకులకు సేవలందించే సామర్థ్యంతో ప్రారంభమవుతుండగా, భవిష్యత్తులో దశలవారీగా దీనిని 4 కోట్ల మందికి పైగా విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రత్యేక కార్గో సదుపాయాలు ఉండటం వల్ల స్థానిక ఎగుమతులకు ఎంతో ఊతం లభిస్తుంది.

**చట్టబద్ధమైన అనుమతులు పూర్తి:** ప్రారంభోత్సవం అనంతరమే కాకుండా, తక్షణమే వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా ఈ విమానాశ్రయం అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులను సాధించింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆమోదాలు, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్, కస్టమ్స్ నోటిఫికేషన్‌లు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుండి క్లియరెన్స్‌లు జారీ అయ్యాయి.

**ప్రాంతీయ అనుసంధానం ఆర్థిక విప్లవం:** భోగాపురం విమానాశ్రయం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో బాటు దక్షిణ ఒడిశా మరియు ఛత్తీస్‌గఢ్‌లోని సరిహద్దు జిల్లాల ప్రజలకు ప్రధాన విమానయాన మార్గంగా మారుతుంది.

**రహదారుల అనుసంధానం:** ప్రయాణీకులు సులభంగా విమానాశ్రయానికి చేరుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నం నుంచి ఇప్పటికే 7 అప్రోచ్ రోడ్లతో కూడిన అధునాతన హైవే కనెక్టివిటీని అందుబాటులోకి తెచ్చాయి. ఇతర జిల్లాలనుంచి కూడా అనుసంధానానికి ప్రణాళికలను రూపొందించారు.

ఇన్నాళ్ళూ వెనుకబడ్డ జిల్లాగా ముద్ర పడ్డ విజయనగరం జిల్లా ఆ ముద్రను తుడిచేసుకుని, రాష్ట్రానికి వెన్నుముక జిల్లాగా మారేందుకు భోగాపురం విమానాశ్రయం సరికొత్త బాటను వేస్తుందనడంలో సందేహం లేదు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అమెరికన్ బృందం

## శాంతిపురంలో అటల్ ల్యాబ్‌ను సందర్శించిన అమెరికన్ విద్యార్థులు

**శాంతిపురం(చిత్తూరు), జులై 22 ప్రభాతవార్త:** స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయంలో ఉన్న అటల్ ల్యాబ్‌ను అమెరికాలోని లిహై యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. ఈసందర్భంగా వారు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకత, ఆవిష్కరణ నైపుణ్యాలు పరిశీలించారు. ఇక్కడ అమలవుతున్న అభ్యసన విధానాలు, ల్యాబ్‌లో జరుగుతున్న కార్యకలాపాల గురించి తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, సైన్స్ ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి, అక్షత, సంపత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గన్నవరం విమానాశ్రయంలో ప్రయాణికుడి బ్యాగులో బుల్లెట్

**గన్నవరం(కృష్ణా), జులై 22 ప్రభాతవార్త:** న్యూడిల్లీ వెళ్ళేందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికుడి బ్యాగులో డబుల్ బా ్యరెల్ గన్ బుల్లెట్ కనిపించటంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయి ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని గన్నవరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం న్యూడిల్లీ వెళ్ళేందుకు నలుగురు ప్రయాణికులు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయ భద్రతా సిబ్బంది ప్రయాణికుల లగేజీని స్కానర్‌లో తనిఖీ చేయగా వీరిలో ఒ ప్రయాణికుడి బ్యాగులో బుల్లెట్ కనిపించింది. దీంతో భద్రతా సిబ్బంది ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం గన్నవరం పోలీసులకు అప్పగించారు. గన్నవరం సిఐ శివప్రసాద్ ప్రయాణికుడిని విచారించి అతని వివరాలు రాబట్టారు. బుల్లెట్‌తో వచ్చిన ప్రయాణికుడు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఆనందకుమార్‌గా నిర్ధారించారు. ఆనందకుమార్ సోదరుడు అశీష్ యాదవ్‌కు, అమరావతిలోని విట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్వ్యూ నిమిత్తం వీరు అమరావతి వచ్చారు. అశీష్‌కు గురువారం ఉత్తరప్రదేశ్‌లో మరో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉండగా వెళ్ళేందుకు వీరు విమానాశ్రయానికి వచ్చినట్లు తెలిపారు. కాగా ఆనందకుమార్ పెదనాన్న నందూజీసింగ్ యాదవ్ మిలటరీలో పనిచేసి రిటైర్ అయిన అనంతరం ఎస్‌బిఐలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. పెదనాన్న వద్ద బ్యాగు తీసుకురాగా అందులో బుల్లెట్ ఉందని, బ్యాగ్‌ను పూర్తిగా పరిశీలించకుండా దుస్తులు పెట్టుకుని రావటంతో ఇలా జరిగిందని ఆనంద్‌కుమార్ పోలీసులకు వివరించారు.

**భోగాపురం, జులై 22 ప్రభాతవార్త:** ఆగస్టు 1న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభానికి ప్రధాని మోదీ విచ్చేస్తున్న నేపథ్యంలో, పర్యటనా ఏర్పాట్లు ముమ్మరమయాయి.

# దానయ్య కుటుంబానికి అండగా ప్రభుత్వం

- ఆర్థిక సాయమందించిన మంత్రి పార్థసారథి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 22 ప్రభాతవార్త:** ఇటీవల రహదారి ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన దుబ్బ దానయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, కూటమి నాయకులు అన్నివిధాలా అండగా ఉంటారని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన జరిగిన మోటారు బైక్ ప్రమాదంలో దుబ్బ దానయ్య మృతి చెందిన నేపథ్యంలో బుధవారం పలాసలోని మృతుడి నివాసానికి వెళ్లిన మంత్రి, ఇచ్చాపురం, పలాస శాసన సభ్యులు బాధితులను స్వయంగా పరామర్శించి తీవ్ర సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారిలో ధైర్యం నింపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే పార్టీ స్పందించి ఆర్థిక పరిహారాన్ని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఆర్థిక సాయానికి అదనంగా, బాధిత కుటుంబాన్ని వ్యక్తిగతంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో తమ తండ్రి, మాజీ పార్లమెంట్ సభ్యులైన కొలుసు పెదరెడ్డయ్య యాదవ్ ఛారిటబుల్ ట్రస్ట్ నుండి రూ.2 లక్షలు, యాదవ సంఘం నుండి రూ.3 లక్షలు ఈ 5 లక్షలు పార్టీ తరపున ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులతో మాట్లాడుతూ 'నేను కూడా ఒక గొర్రెల కాపరి కుటుంబం నుంచే వచ్చి, భగవంతుని, సమాజపు ఆశీస్సులతో ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. సోదరి గౌతు శిరీష వ్యక్తపరిచిన ఆవేదనను, బాధను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఒక సెంట్ భూమి కూడా లేకుండా, కూలీతో బతుకుతున్న ఒక నిరుపేద కుటుంబంలో ప్రమాదం వల్ల జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. ఇక్కడికి వచ్చి, నిరుపేద కుటుంబం గురించి కనీస ప్రస్తావన చేయకుండా, ప్రమాదం చేసి మరణానికి కారణమైన 18 సంవత్సరాలు నిండిన మేజర్ యువకుడి గురించి మాట్లాడారంటే, ఆ పార్టీ



డిఎన్ఏ ఎటువంటిదో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి అని ఘాటుగా విమర్శించారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కానీ ఒక తండ్రిగా తన కొడుకుని తప్పించేందుకు వేరే వ్యక్తిని తెచ్చి నిలబెట్టడం చట్టానికి ఆమోదయోగ్యమా అని మంత్రి ప్రశ్నించారు. అటువంటి వ్యక్తులు రేపు అధికార స్థానాల్లోకి వస్తే పరిస్థితులు ఎంత ఘోరంగా ఉంటాయో ప్రజలు ఆలోచించాలని కోరారు. 'సెంట్ భూమి లేని గొర్రెల కాపరి కుటుంబానికి తప్పు జరిగింది, ఆదుకోవాలి' అని కనీసం ఒక్క మాటైనా అనకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ సహాయ చర్యలను వివరిస్తూ 'ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ కుటుంబాన్ని వదిలేయదని, వారికి ఇల్లు, భూమి లేకపోవడంతో, ఎమ్మెల్యే శిరీష స్థలం కేటాయించగానే గృహ నిర్మాణ శాఖ ద్వారా వెంటనే పక్కా ఇల్లు నిర్మిస్తామన్నారు. పిల్లల చదువుల పూర్తి బాధ్యతను మేమందరం చూసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బలహీన వర్గాల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

అనంతరం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ దానయ్య చనిపోయింది ఒక కటిక నిరుపేద అని తెలిసి ప్రతి ఒక్కరూ సాయం చేసేందుకు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. ఒక ప్రాణం తీసి, రోడ్డుపై అనాథ శవంలా పడేసి వెళ్లిపోయారన్నారు. ఇద్దరు కొడుకులను పోగొట్టుకున్న ముసలి తల్లి, భర్తను కోల్పోయి అనాథగా మారిన భార్య, తండ్రి పేరే తెలియని చిన్న పిల్లల బాధలు వారికి కనిపించడం లేదా? సరిగా ప్రింటింగ్ కూడా రాని కొన్ని పేపర్లు, యూట్యూబ్ ఛానళ్లు నిజాన్ని కప్పిపుచ్చి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు చెప్పారు. ఒక యూట్యూబ్ ఛానళ్లలో కూడా విలువలు లేకుండా కథనాలు రాయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ, జన సైనికులు, యాదవ సంఘాలు స్వచ్ఛందంగా వచ్చి ఈ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నాయని, స్వయంగా వచ్చి తన సొంత నిధుల నుంచి బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించిన మంత్రి పార్థసారథికి నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో ఇచ్చాపురం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ, యాదవ సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

pnb Housing Finance Limited — Ghar Ki Baat

అనుబంధం-IV-A - స్థిరాస్తి/లు యొక్క ఇ-వేలం బహిరంగ విక్రయ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు నిబంధనతో చదువుకునే దాని క్రింద స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు ఇ-వేలం-విక్రయ ప్రకటన

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష్ భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

బ్రాంచ్ చిరునామా: 1వ అంతస్తు, డోర్ నెం. 5-87-92, లక్ష్మీపురం మెయిన్ రోడ్, గుంటూరు - 522007, ఆంధ్రప్రదేశ్

[illegible]

NHL/GNTR/0419/683072, B CH ... రూ. 47,52,736.03 ... 28.08.2026 ... 13.08.2026 ... 29.08.2026 ...

[illegible]

మొబైల్: 9948562888/9392320800/8790120868/7428193765, ఇ-మెయిల్: auction@pnbhousing.com, PNBHFL యొక్క అధీకృత వ్యక్తి లేదా www.pnbhousing.com సంప్రదించగలరు.

ప్రదేశము : గుంటూరు, తేది: 22.07.2026 — సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN:L36911RJ1996PLC011381)

అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారుపేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 22630000035545, యేజర్ల జోయల్ బాబు (రుణగ్రహీత) యేజర్ల కమలమ్మ (సహ-రుణగ్రహీత) | 23-డిసెంబరు-25 రూ.9,14,889/-, తొమ్మిది లక్షల పద్నాలుగు వేల ఎనిమిది వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే 22-డిసెంబరు-25 నాటికి | 18-జూలై-26 |
| (Loan A/C No.) 24660001005512, కట్టవరపు సలోమి (రుణగ్రహీత) కట్ట వరపు చిన్న (సహ-రుణగ్రహీత) | 07-నవంబరు-25 రూ.6,12,365/-, ఆరు లక్షల పన్నెండు వేల మూడు వందల అరవై ఐదు రూపాయలు మాత్రమే 06-నవంబరు-25 నాటికి | 18-జూలై-26 |
| (Loan A/C No.) 24630000045953, [illegible] | 01-జూలై-25 రూ.7,65,776/-, [illegible] 30-జూన్-25 నాటికి | 18-జూలై-26 |
| (Loan A/C No.) 23660000595208, [illegible] | 25-నవంబరు-25 రూ.5,81,956/-, [illegible] 24-నవంబరు-25 నాటికి | 18-జూలై-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ (మొదటి ఖాతా): స్థిరాస్తి వివరాలు: బాపట్ల జిల్లా - బాపట్ల రెవెన్యూ డివిజన్ - మార్టూరు సబ్-డివిజన్ - జె.పంగులూరు మండలం - ముప్పవరం గ్రామ పంచాయతీ - ముప్పవరం గ్రామం - సర్వే నం. 3-అసెస్‌మెంట్ నం. 598 - డోర్ నం. 5-63 - RCC ఇల్లు మరియు స్థలం. సరిహద్దులు: 115 చదరపు గజాలు లేదా 96.14 చదరపు మీటర్ల విస్తీర్ణం గల స్థలం, దీనిలో అన్ని ఫిక్చర్లు మరియు అనుబంధ హక్కులతో కూడిన 510 చదరపు అడుగుల RCC భవనం ఉంది. [illegible]

తనఖా పెట్టిన ఆస్తి వివరణ (రెండవ ఖాతా): స్థిరాస్తి వివరాలు: బాపట్ల జిల్లా - బాపట్ల రిజిస్ట్రేషన్ డివిజన్ - అద్దంకి సబ్‌డివిజన్ - జె. పంగులూరు మండలం - తూర్పు కొప్పెరపాడు గ్రామ పంచాయతీ - తూర్పు కొప్పెరపాడు గ్రామకంఠం, ఎల్.పి. నం. 617 - సర్వే నం. 256, 258/1 - విస్తీర్ణం 3.2250 ఎకరాలు. ఈ విస్తీర్ణంలో, 121 చదరపు గజాలు లేదా 101.15 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించబడిన 400 చదరపు అడుగుల RCC గ్రౌండ్ ఫ్లోర్ ఇల్లు మరియు [illegible]

[illegible]

తేది: 22/07/2026, ప్రదేశం : బాపట్ల, ఆంధ్రప్రదేశ్ — సం/- అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

23-7pg4_23-7pg4.qxd 22/Jul/26 10:50 PM Page 1



వార్త

అంతులేని కోరికలుండడమే పెద్ద దోషం. ఇతరుల గురించి చెడుగా చెప్పడమే పెద్ద పాపం. సత్యంగా ప్రవర్తించడమే నిజమైన తపస్సు.

న- గురజాడ

# దేనికోసమీ పంతం?

పార్లమెంట్ వర్షాకాలపు సమావేశాల తరుణంలో కేంద్ర ప్రభుత్వానికి ఒక తలనొప్పి కాదు, పలు నిరసనలు ముప్పేట దాడి చేస్తున్నాయి. 'నీట్' ప్రశ్నపత్రాల లీక్‌కు బాధ్యత వహించాల్సిన వారెవరూ ధైర్యంగా నైతిక బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా లేరు. కొత్తగా వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఇదే అంశాన్ని చేపట్టి జంతర్ మంతర్‌లో అగ్గి పుట్టిస్తోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అన్న ఒకే ఒక డిమాండ్‌తో 'కాక్రోచ్' పార్టీ గల నెల మొదటి వారంలో ఢిల్లీలో నిరసనలు చేపట్టింది. ఆనాటి నుంచి ఈనాటివరకు 'నీట్' బాధిత విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, కేంద్ర ప్రభుత్వ నిర్వాకాన్ని వ్యతిరేకించేవారు, పేపర్ లీక్‌పై విరుచుకు పడినా హస్తినలో ఏలినవారు, 'కాక్రోచ్'లదేముందిలే అని ఆ అంశాన్ని ఎటూ తేల్చకుండా నాన్చారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆయా శాఖల వ్యవహారాలు చూసే మంత్రులు తమ శాఖ పరిధిలోకి వచ్చే అంశాల విషయంలో విమర్శలు వెల్లువెత్తినప్పుడు, అవకతవకలు బయట పడినప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ ఎంతో హుందాగా రాజీనామాలు చేసేవారు. ఇప్పుడలాంటిదేమీ లేదు సరి కదా! వర్షాకాల పార్లమెంటు సమావేశాల ప్రారంభం నాడు ఢిల్లీలో విపక్షాల నేతృత్వంలో కాక్రోచ్ జనతాపార్టీ కార్యకర్తల ఆందోళన చేపట్టేవరకు పట్టించుకోలేదు. కొత్తవిద్యార్థి ఉద్యమం ఊపందుకుంటున్నా ప్రభుత్వ పెద్దలకు చీమ కుట్టినట్లనిపించడం లేదు. నీట్ పేపర్ లీక్ మహాపాపమని ప్రధాని నరేంద్రమోడీ కూడా అంటున్నారు. కానీ ఆ శాఖ మంత్రి మీద ఈగవాలనివ్వడం లేదు. 'కాక్రోచ్' ఉద్యమానికి మద్దతు బాగా పెరుగుతోంది. వర్షాకాలపు పార్లమెంటు సమావేశాల సందర్భంగా 'కాక్రోచ్' ఉద్యమకారులు పార్లమెంటు ఎదుట ధర్నా నిర్వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం పట్టుబట్టారు. కానీ విద్యార్థుల ఉద్యమం సిజెపి ర్యాలీపై లాఠీచార్జి, కొందరు విద్యార్థులకు గాయాలు తగలడంతో ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఈ వ్యవహారం రాజధానిని కుదిపేసింది. కాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో మిత్రపక్షాలు వెంటరాగా గురువారం సాయంత్రం లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసాన్ని ముట్టడించారు. దాంతో కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్న డిమాండ్ కాస్తా ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలనే డిమాండ్‌గా మారిపోయింది. ఈ ఆకస్మిక పరిణామానికి హస్తినలో రాజకీయ పక్షాల వారు ఆశ్చర్యం చెందారు. ఇదే సందర్భంలో కాక్రోచ్‌జనతా పార్టీ, కాంగ్రెస్ తదితర మిత్రపక్షాల లక్ష్యాలు మారిపోవడం చర్చించదగినది. సిజెపి తమను రాజకీయ రొచ్చులోకి లాగొద్దని రాజకీయ పక్షాలను కోరుతోంది. సిజెపి విద్యార్థుల నిరసనకు మద్దతుగా 24రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఇంకా వైద్యసేవల్లోనే ఉన్నారు. అయినా సిజెపి తన పట్టు వీడడం లేదు. అలాగే ప్రధాని కూడా 'నీట్'విషయంలో అలా జరిగి ఉండ కూడదని అంటూనే బాధ్యుల్ని నిర్ణయించడంలో కప్పదాటు వైఖరి అవలంబిస్తున్నారనే అపప్రధ పొందారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ఉన్నట్లయితే సిజెపి ఆగ్రహం మొదట్లోనే చల్లారిపోయి ఉండేది. వారు జంతర్ మంతర్ వరకు వచ్చే అవకాశమే ఉండేది కాదు. ఈ ఉద్యమంలో కాంగ్రెస్ మిత్రపక్షాలు నిర్వహించే ఉద్యమం మరింత ముందుకు పోకుండా అక్కడే నిలబడి పోయి ఉండేది. కానీ పార్లమెంట్‌లో రచ్చరచ్చవుతోంది. లోక్‌సభ రాజ్యసభలో మూడో రోజు బుధవారం కూడాకాంగ్రెస్ తదితర విపక్షాల సభ్యులంతా నల్లదుస్తులు ధరించి వచ్చారు. ఇంత క్రితం మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతోబిజెపి మంత్రి జితేంద్ర సింగ్ భేటీ అయ్యారు. విషయాన్ని సంయమనంతో పరిశీలించాలని అనుకున్నారో ఏమో! కర్ర విరగకుండా, పాము చావకుండా సమస్యను ఒకొలిక్కి తీసుకు రావాలన్న ప్రయత్నం జరిగింది. మరోపక్క కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు సిజెపి అంగీకరించింది. ఈ చర్చల్లో ఎవరున్నా 'నీట్' గురించి ఏదైనా అడగండి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తప్ప అనే ధోరణిలో ఉంటే సిజెపి ఉద్యమాన్ని ఆపలేరు. విద్యార్థులు,నిరుద్యోగులేఅత్యధిక మంది ఉన్న సిజెపి నిరసనలను ఆపకపోతే ఆ ఉద్యమం కేంద్ర ప్రభుత్వపాలనపై ప్రభావం చూపిస్తుంది. గతంలో ఉన్న అంశాలకు తోడు తాజాగా విద్యార్థులపైపోలీసుల లాఠీచార్జి కొత్తగా వచ్చి చేరింది. ఎన్నో దేశాల్లో 'జెన్‌జి' ఉద్యమాలు పెరిగిపోతున్న పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోతే మరింత ఇరకాటంలో చిక్కుకుంటుంది. రాహుల్, జితేంద్ర సింగ్‌ల మధ్య భేటీలో'నీట్' పరీక్షల వైఫల్యాలపై సభలో చర్చించేందుకు అంగీకారం కుదిరినా కాంగ్రెస్ ఆ మాటకు కట్టుబడి ఉండలేదని బిజెపి ఆరోపిస్తోంది. ఇంతకూ ఎవరి పంతాలు వారివన్నట్లు ఉన్న ఈ వ్యవహారంలో సమస్యల ముడి వీడితేనే తప్ప పరిష్కారం దొరకదు. ప్రశ్నపత్రాల లీకేజీలు నివారించడంజాతీయ బాధ్యత అని చెబుతున్న ప్రధాని నిరసనలు చేపడుతున్న యువత డిమాండ్‌లపట్ల సానుకూల స్పందన వ్యక్తం చేయలేకపోయారు. పైగా పిల్ల ల్ని రెచ్చగొట్టవద్దని యువతను సరైన మార్గంలో నడిపించే అంశంలో సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలంటూ కాంగ్రెస్,తదితర పక్షాలకు హితవు చెప్పారు. అంతేతప్ప సిజెపి సమస్యను పరిష్కరించే బాధ్యత,అవకాశం తనకే ఉందన్న విషయాన్నిపక్కన పెట్టినట్లుంది. రాహుల్ గాంధీ అరెస్టు కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు నింపింది. దేశవ్యాప్తంగా బిజెపి, కాంగ్రెస్ శ్రేణుల మధ్య దాడులు మొదలయ్యాయి.'నీట్' పేపర్‌లీక్‌జీ అంశంపై విద్యార్థిల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి నుంచి బయటవేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వం చేతిలోనేఉంది. తక్షణమే ఈ సమస్య పరిష్కార దిశగా అడుగులు వేయాలి.



చేయక తప్పని పనిలో కూడా జాప్యం చేస్తే కాలం ఆపనిని నిస్సారంగా మార్చి వేస్తుంది.

జి.ముర్రే



దేవుడు మనకు రెండు చెవులు, రెండు కళ్లు, ఒక నాలుక ఇచ్చింది ఎక్కువ చూడమని, వినమని, తక్కువగా మాట్లాడమని.

జి. ఇలియెట్

# వర్సిటీల చుట్టూ వివాదాలెందుకు?

**ప్రజా సంస్థలకు సంబంధించిన నిర్ణయాలు తక్షణ అవసరాల దృష్టితో మాత్రమే కాకుండా, దీర్ఘకాల సామాజిక ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాలి. నాంపల్లి ప్రాంగ ణాన్ని దాని విద్యా, పరిశోధనా, సాంస్కృతిక స్వరూపంతో పరి రక్షించడం. బాచుపల్లిని భవిష్యత్ విస్తరణకు, ప్రపంచ స్థాయి తెలుగు సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేయడం, పురావస్తు సంపదకు అత్యాధునిక సంరక్షణ, ప్రదర్శన వేదికలను కల్పించడం, అంకిత భావంతో కృషి చేస్తే ఈ మూడు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమే. నిజానికి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విషయం లో తెలంగాణ ప్రభుత్వం ముందున్నది సమస్య కాదు. భవిష్యత్ తరాలను నిర్మించడానికి సమస్య రూపంలో ఎదురైన, సంస్కృతి, భాష, విద్యారంగాల పరిరక్షణకోసం ప్రణాళిక బద్ధంగా విధానపరమైన నిర్ణయం తీసుకుని మంచి పేరు తెచ్చుకునే చక్కటి అవకాశం.**



మల్లాది వేంకట గోపాలకృష్ణ

సమాజం తన భవిష్యత్తును నిర్మించుకోవడానికి రహదారులు, పరిశ్రమలేకాదు సాంకేతికత కూడా అవసరమే. అదే సమాజం తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలంటే జ్ఞానాన్ని, సంస్కృతిని, చరిత్రను తరతరాలకు అందించే బలమైన విద్యాసంస్థలు కూడా చాలా అవసరం. అందుకే ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు కేవలం విద్యను బోధించే కేంద్రాలే కాదు అవి సమాజపు మేధో సంపదను, సాంస్కృతిక స్మృతిని, పరిశోధనా సంప్రదాయాలను సంరక్షించే సంస్థలుగా భావిస్తారు. సుర వరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఒక సాధారణ విశ్వవిద్యాలయం కాదు. తెలుగు భాష, సాహిత్యం, సంగీ తం, నృత్యం, జానపద సంప్రదాయాలు, శాసనాలు, ప్రాచీ న గ్రంథాలు, భాషా పరిశోధన వంటి అనేక అంశాలను, రంగాలను ఒకే విద్యా వేదికపై సమన్వయం చేసిన అరు దైన సంస్థ. అందువల్ల నాంపల్లి ప్రాంగణంపై జరుగుతున్న చర్చను కేవలం 'స్థల వినియోగం' అనే కోణంలో చూడడం సరిపోదు. ఇది ఒక సాంస్కృతిక నిర్ణయం. అంతకంటే ముఖ్యంగా, భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను నిర్వ చించే నిర్ణయం. భాషలు కేవలం జన బాహుళ్యంలో ప్రచా రంలో ఉండడం వల్ల మాత్రమే జీవించవు. వాటిని పరిశో ధించే విశ్వవిద్యాలయాలు, ప్రచురించే ప్రచురణా కేంద్రాలు, భద్రపరిచే గ్రంథాలయాలు, అభ్యసించే విద్యార్థులు, బోధించే అధ్యాపకులు, ప్రోత్సహించే ప్రభుత్వాలు అన్నీ కలిసి విస్తృత స్థాయిలో కృషి చేసినప్పుడే ఒక భాష సజీవంగా ఉంటుంది. తెలుగు విశ్వవిద్యాలయం అలాంటి బాధ్యతను భుజంపై వేసుకుని సజావుగా, సక్రమంగా నిర్వహిస్తున్న సంస్థ. తెలుగు భాషకు సంబంధించిన జ్ఞానాన్ని సృష్టిస్తారు. సాహిత్యాన్ని విశ్లేషిస్తారు. కళలను సంరక్షిస్తారు. అంతరించిపోతున్న జానపద సంప్రదాయాలను నమోదు చేస్తారు. పరిశోధకులను తీర్చిదిద్దుతారు. భవిష్యత్ తరాలకు ఒక సాంస్కృతిక నిరంతరత్వాన్ని అందిస్తారు. అందుకే ఇటువంటి విశ్వవిద్యాలయాల గురించి తీసుకునే ప్రతి నిర్ణ యం తక్షణ అవసరాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని కాకుండా, కనీసం మరో నూరు సంవత్స రాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాలి. కొన్ని ప్రదేశాలు కేవలం భౌగోళికపరమైన గుర్తింపులు కావు. అవి కొన్ని ఆలోచనలకు ప్రతీకలు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణం కూడా అలాంటి ప్రదేశమే. 1975లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగు భాషకు ఒక శాశ్వత విద్యా, సాంస్కృతిక కేంద్రం అవసరమనే ఆలోచనకు బీజం వేశాయి. ఆ ఆలోచనకు రూపం దాల్చినప్రాంగణమే నాంపల్లి. తెలుగు భాష, సాహిత్యం,కళలు, సంస్కృతికి ఒక విశిష్ట విశ్వవిద్యాలయం ఉండాలన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు దూరదృష్టికి ఇది ప్రతిరూపం. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు తమ చరిత్రను కేవలం పుస్తకాలలోనే కాదు, తమ ప్రాంగణాల్లో కూడా సంరక్షించుకుంటాయి. ఎందుకంటే సంస్థాగత నిరం తరత్వం కూడా విద్యా నాణ్యతలో ఒక భాగమే. నాంపల్లి ప్రాంగణం విషయంలో కూడా ఇదే దృక్పథం చాలా అవస రం. ఉన్నత విద్యాసంస్థలను బలోపేతం చేయడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఈ రెండు లక్ష్యాలు పరస్పర విరుద్ధాలు కావు. ఆ రెండింటినీ సమన్వయం చేసే మార్గాన్ని అన్వేషిం చడం కూడా అదే దూరదృష్టిని ప్రదర్శించే అవకాశం ఉంది. ప్రజా జీవితంలో ప్రతి సమస్యకు రెండు రకాల పరిష్కారా లు ఉంటాయి. ఒకటి తక్షణ అవసరాన్ని తీర్చేది. మరొకటి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునేది.



మంచి పాలన రెండో మార్గాన్ని ఎంచుకుంటుంది. నాంపల్లి ప్రాంగణానికి సంబంధించిన అంశంలో కూడా అలాంటి దూరదృష్టి అవసరం. ఒకవైపు చారిత్రక పురావస్తువులు మరోవైపు తెలుగు భాషా, సాంస్కృతిక అధ్యయనానికి అంకితమైన విశ్వవిద్యాలయం. ఈ రెండూ తెలంగాణ గర్వించదగ్గ సంపదలే. ఒకదానిని కాపాడాలంటే మరొకటి బలహీనపడాల్సి న అవసరం లేదు. ప్రజాసంస్థల నిర్వహణలో ఇదే ప్రాథమిక సూత్రం. పురావస్తువులు చరిత్రను భద్రపరుస్తాయి. విశ్వవిద్యాలయాలు ఆ చరిత్రకు అర్థం చెప్పే పరిశోధకులను తయారు చేస్తాయి. మ్యూజియంలు వారసత్వాన్ని ప్రదర్శిస్తాయి. విశ్వవిద్యాలయాలు ఆ వారసత్వాన్ని అధ్యయనం చేస్తాయి, కొత్త తరాలకు పరిచయం చేస్తాయి. అందువల్ల ఈ రెండింటి మధ్య సంఘర్షణ కాదు, సమన్వయం ఉండాలి. నిత్యం వేలాదిమంది విద్యార్థులు సమున్నతమైన విద్యను ఆర్జించే విద్యాలయాన్ని పురాతన వస్తువులను భద్రపరచే జీవం లేని సౌధంగా మార్చాలనుకోవడం పూర్తిగా పొరపాటు నిర్ణయమే అవుతుంది. అటువంటి నిర్ణయానికి తగిన మూల్యాన్ని ఏ ప్రభుత్వమైనా దీర్ఘకాలంలో చెల్లించుకుని తీరక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. బాచుపల్లి ప్రాంగణం గురించి ఇప్పటివరకు ప్రధానంగా విశ్వవిద్యాలయ విస్తరణ కోణంలోనే చర్చ జరిగింది. కానీ తెలంగాణ ప్రభుత్వం మనసు పెట్టి చూస్తే దాన్ని తెలంగాణ సాంస్కృతిక భవిష్యత్తుకు ఒక విశాలమైన అవకాశంగా తోస్తుంది. తెలంగాణ ప్రభుత్వం తలచుకుంటే బాచుపల్లిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక సమగ్ర తెలుగు సాంస్కృతిక ప్రాంగణాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఆధునిక మ్యూజియం, డిజిటల్ హెరిటేజ్ ఆర్కైవ్, పురావస్తు పరిరక్షణ కేంద్రం, జానపద కళల గ్రామం, కళాకారుల శిక్షణా కేంద్రాలు, పరిశోధనా ప్రయోగశాలలు, విద్యార్థులు, పరిశోధకుల కోసం ఆధునిక అధ్యయన వేదికలు మొదలైన వాటన్నింటినీ ప్రభుత్వం పూనుకుని బాచుపల్లి ప్రాంగణంలో ఓ చక్కటి ప్రణాళికతో అభివృద్ధి చేస్తే, అది కేవలం తెలంగాణకే కాదు, దేశవ్యాప్తంగా ఒక ఆదర్శ సాంస్కృతిక నమూనాగా నిలిచే అవకాశం ఉంది. అలా చేస్తే నాంపల్లి తన చారిత్రక, విద్యా పాత్రను కొనసాగిస్తుంది. బాచుపల్లి భవిష్యత్ విస్తరణకు కేంద్రంగా ఎదుగుతుంది. రెండు ప్రాంగణాలూ పరస్పరం ఒకదానిని మరొకటి బలపరుస్తాయి. నాంపల్లి ప్రాంగణానికి సంబంధించిన నిర్ణయం ఈ తరం అవసరాలకే పరిమితం కాదు. ఇది రాబోయే దశాబ్దాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సి న నిర్ణయం. తెలుగు భాషపై పరిశోధన మరింత విస్తరిస్తుంది. డిజిటల్‌ఆర్కైవింగ్కు కొత్త అవకాశాలు వస్తాయి. జానపద విజ్ఞానాన్ని భద్రపరచాల్సి న అవసరం పెరుగుతుంది. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు అధ్యయనాలపై ఆసక్తి మరింత పెరగవచ్చు. ఈ అవసరాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే, ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన ఒక చారిత్రక విద్యా ప్రాంగణాన్ని మరింత బలోపేతం చేయడమే దీర్ఘకాల ప్రజా ప్రయోజనానికి అనుకూలమైన నిర్ణయం. ఒక భాషకు, ఒక సంస్కృతికి, ఒక సమాజానికి నిరంతరత్వాన్ని అందించగల సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంపై జరిగే చర్చను ఒక స్థల వివాదంగా కుదించలేం. అది తెలంగాణ తన భాషా సాంస్కృతిక సంస్థల వల్ల ఎంత బాధ్యతతో వ్యవహరిస్తుందనే విషయానికి ఒక ప్రమాణంగా మిగిలిపోతుంది. నేటి నిర్ణయం ఏదైనా కళారూపాలను సంరక్షించే కళాకారులపై ప్రభావం చూపుతుంది. భాషా అధ్యయనాన్ని ఎంచుకునే భావితరాలపై ప్రభావం చూపుతుంది. అందుకే ప్రజా సంస్థలకు సంబంధించిన నిర్ణయాలు తక్షణ అవసరాల దృష్టితో మాత్రమే కాకుండా, దీర్ఘకాల సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకోవాలి. నాంపల్లి ప్రాంగణాన్ని దాని విద్యా, పరిశోధనా, సాంస్కృతిక స్వరూపంతో పరిరక్షించడం. బాచుపల్లిని భవిష్యత్ విస్తరణకు, ప్రపంచ స్థాయి తెలుగు సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేయడం, పురావస్తు సంపదకు అత్యాధునిక సంరక్షణ, ప్రదర్శన వేదికలను కల్పించడం, అంకిత భావంతో కృషి చేస్తే ఈ మూడు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమే. నిజానికి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విషయం లో తెలంగాణ ప్రభుత్వం ముందున్నది సమస్య కాదు. భవిష్యత్ తరాలను

# తగ్గుతున్న జననాలతో మారుతున్న జనాభా చిత్రం

సి.హెచ్. ప్రతాప్

భారత్ జనాభా నిర్మాణంలో నిశ్శబ్దంగా ఒక కీలక మార్పు చోటు చేసుకుంటోంది. ఒకవైపు మొత్తం సంతానోత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ – టీఎఫ్ఆర్) తగ్గుతుండగా, మరోవైపు వృద్ధుల జనాభా క్రమంగా పెరుగుతోంది. ఈ రెండు పరిణామాలు భవిష్యత్ ఆర్థికవ్యవస్థ, ఆరోగ్యరంగం, సామాజిక భద్రతపై గణనీయ ప్రభావం చూపనున్నాయి. జనాభా పెరుగుదల మాత్రమే కాదు, జనాభా నాణ్యత, వయో నిర్మాణం కూడా అభివృద్ధికి కీలకమనే విషయాన్ని విధాన నిర్ణేతలు గుర్తించాల్సి న సమయం ఆసన్నమైంది. ఒక మహిళ తన జీవితకాలంలో సగటున ఎంతమంది పిల్లలకు జన్మనిస్తుందో తెలిపే సూచికనే మొత్తం సంతానోత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ – టీఎఫ్ఆర్) అంటారు. సాధారణంగా 2.1ను ప్రత్యామ్నాయ జననాల రేటు (రిప్లేస్‌మెంట్ లెవెల్ ఫెర్టిలిటీ)గా పరిగణిస్తారు. ఈ స్థాయిలో జననాలు కొనసాగితే జనాభా దీర్ఘకాలంలో స్థిరంగా ఉంటుంది. అంతకంటే తక్కువగా ఉంటే భవిష్యత్‌లో యువజనాభా తగ్గేఅవకాశం ఉంటుంది. ఇటీవలి గణాంకాల ప్రకారం, భారత్‌లో 2019-21 నుంచి 2023-24 వరకు మొత్తం సంతానోత్పత్తి రేటు 2.0 వద్దే స్థిరంగా కొనసాగింది. ఇది ప్రత్యామ్నాయ స్థాయి కంటే తక్కువ. దాదాపు ప్రతి రాష్ట్రంలో టీఎఫ్ఆర్ తగ్గడం లేదా స్థిరంగా ఉండడం గమనార్హం. అయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో మాత్రం స్వల్ప పెరుగుదల నమోదైంది. మరోవైపు బీహార్‌లో దేశంలోనే అత్యధిక టీఎఫ్ఆర్ 2.7గా ఉన్నప్పటికీ, గతంలో నమోదైన 3.0తో పోలిస్తే తగ్గుముఖం పట్టడం విశేషం. సంతానోత్పత్తి రేటు తగ్గడం అంటే కుటుంబ నియంత్రణ విజయవంతమైందనిమాత్రమే అర్థం కాదు. విద్యావకాశాల పెరుగుదల, మహిళలఉపాధి, పట్టణీకరణ, వివాహాల ఆలస్యం, జీవన వ్యయంపెరగడం వంటి అనేక సామాజిక ఆర్థిక అంశాలు దీనికి కారణమవుతున్నాయి. అయితే దీర్ఘకాలంలో యువ జనాభా తగ్గిపోవడం వల్ల శ్రామిక శక్తి క్షీణించే ప్రమాదం కూడా ఉంది. అదే సమయంలో భారత్‌లో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలు,తూర్పు ఆసియా దేశాలు అధిక ఆదాయ స్థాయికి చేరుకున్న తర్వా త వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్‌మాత్రం దిగువమధ్య ఆదాయ దేశంగానే కొనసాగుతూనే వృద్ధాప్య సమాజం వైపు అడుగులు వేస్తోంది. ఇది దేశానికి కొత్తసవా లుగా మారనుంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వృద్ధులకు అవసరమైన బహుళ వ్యాధులచికిత్సకు పూర్తిస్థాయిలో సిద్ధంగా లేవు. గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు, కీళ్ల వ్యాధులు, మతిమరుపు వంటిసమస్యలు ఒకేసారి ఎదుర్కొనే వృద్ధులకు ప్రత్యేక జెరియాట్రిక్ కేర్ అవసరం. అధికశాతం వృద్ధులు ఇప్పటికీ స్వల్పమొత్తంలోని ప్రభుత్వ పింఛన్లపైనే ఆధారపడుతున్నారు. ఇదివారి ఆర్థిక భద్రతకు సరిపోదు. ఈ పరిస్థితులను దృష్టిలోఉంచుకుని ప్రభుత్వం సమగ్ర జనాభా విధానం రూపొందించాలి. ప్రతిజిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేయడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వృద్ధులకుఅనుకూల సేవలు విస్తరించడం, లాంగ్‌టర్మ్ కేర్ వ్యవస్థను అభివృద్ధి చేయడం అవసరం. సామాజిక భద్రతా పింఛన్లను పెంచడంతోపాటు, హెల్త్ ఇన్సూరెన్స్ పరిధిని విస్తరించాలి. యువతకు నైపుణ్యాభివృద్ధి, మహిళల ఉపాధి, కుటుంబాలకు శిశు సంరక్షణ సౌకర్యాలు కల్పించడం ద్వారా సమతుల్య జనాభా నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. జనాభా మార్పులను కేవలం గణాంకాలుగా కాకుండా భవిష్యత్

# ఇక కొత్త సంస్కరణలతో 'ఒసిఐ' కార్డులు!



యేచన్ చంద్ర శేఖర్

భారతదేశం 2005ఆగస్టులోపౌరసత్వ చట్టం 1955 సవరణ ద్వారా ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఒసిఐ) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమాన్ని 2006 జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన ప్రవాస భారతీయ దివస్ సదస్సులో లాంఛనంగా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయుల నుండి 'ద్వంద్వ పౌరసత్వం'కోసం వస్తున్న నిరంతర డిమాండ్లను నెరవేర్చడానికి ఈ కార్డును ప్రవేశపెట్టారు. భారత రాజ్యాంగం ద్వంద్వ పౌరసత్వాన్ని ఖచ్చితంగా నిషేధించినందున, ఒక వారధిగా ఒసిఐని సృష్టించారు. ఇది భారతీయ సంతతికి చెందిన విదేశీయులకు (పిఐఒ పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్) భారతదేశంలో నిరవధికంగా నివసించేందుకు, ఉపాధి పొందేందుకు హక్కును, జీవితకాల వీసాను అందిస్తుంది. కానీ అసలు భారతీయ పౌరసత్వం లేదా ఓటింగ్ హక్కులను మంజూరు చేయదు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 53లక్షల మంది నమోదిత ఒసిఐ కార్డుదారులున్నారు. వీరిలో అత్యధికులు భారతీయులు అధికంగా నివసించే అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా కెనడాలలో ఉన్నారు. దరఖాస్తుదారు గతంలో భారత పౌరసత్వం కలిగి ఉన్నా, 1950 జనవరి 26 నాటికి భారతదేశ పౌరుడు లేదా పౌరురాలిగా మారడానికి అర్హత కలిగి ఉన్నా, లేదా అటువంటి అర్హత కలిగిన వ్యక్తి సంతానం, మనవలు లేదా మునిమనవలు అయి ఉన్నా, సాధారణంగా అటువంటి వ్యక్తులు ఒసిఐ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే, పాకిస్థాన్,బంగ్లాదేశ్ పౌరులు మాత్రం దీనికి అర్హులు కారు. ఒసిఐ కార్డుదారులకుప్రామాణిక వీసా అవసరం లేకుండా భారతదేశంలో పర్యటించడానికి నివసించడానికి బహుళప్రవేశ, జీవితకాల ప్రాప్యతను అందిస్తుంది. భారతదేశంలో ఎంత కాలం బస చేసినా ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వద్ద నమోదు చేసుకోవలసిన అవసరం నుండి వీసాదారునికి మినహాయింపు లభిస్తుంది. దేశీయ విమాన ఛార్జీలుజాతీయ స్మారక చిహ్నాలలో సమాన ప్రవేశ రుసుములతో సహా, ప్రవాస భారతీయుల (ఎన్నారైల)తో సమానమైన ఆర్థిక, ద్రవ్య,విద్యా ప్రయోజనాలను ఒసిఐ కార్డుదారులకు అందిస్తుంది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫేమా)ప్రకారం, ఒసిఐ కార్డుదారులు భారతదేశంలో వ్యవసాయ భూములు,తోటభూములు లేదా ఫామ్‌హౌస్‌లను చట్టబద్ధంగా కొనుగోలు చేయలేరు. అయితే, వీరు ఈ ఆస్తులను వారసత్వం ద్వారా లేదా భారతదేశంలో నివసిస్తున్న బంధువు నుండి బహుమతిగా పొందవచ్చు. అయితే, వాటిని మరొక ఒసిఐ కార్డుదారుకు గానీ లేదా విదేశీ జాతీయునికి గానీ అమ్మకూడదు. భారతదేశం ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించదు కనుక ఒసిఐ కార్డు ద్వంద్వ పౌరసత్వ




అనుమతి పత్రం కాదు. ఒసిఐ కార్డుదారులు విదేశీ జాతీయులుగానే పరిగణించబడుతారు కనుక వారు భారతదేశ సందర్శనకు విధిగా తమ విదేశీ పాస్‌పోర్ట్‌ను ఉపయోగించాలి. భారత పౌరులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించే ఓటు హక్కు వీరికి ఉండదు. అంతేకాదు, వీరు ఎలాంటి ప్రభుత్వ పదవులు లేదా రాజ్యాంగ పదవులను (ఉదా., రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి లేదా న్యాయమూర్తి) చేపట్టలేరు. మిషనరీ, జర్నలిస్టిక్ లేదా పర్వతారోహణ కార్యకలాపాలు చేపట్టడానికి లేదా నోటిఫైడ్ పరిమిత/రక్షిత ప్రాంతాలను సందర్శించడానికి వీరు తప్పనిసరిగా అధికారిక ముందస్తు అనుమతి పొందాలి. ఈ కార్డు, అర్హులైన విదేశీ పౌరులు తమ ఒసిఐ వివరాలను తమ మొబైల్ ఫోన్లలో సురక్షితంగా నిల్వ చేసుకోవడానికి, ఇమ్మిగ్రేషన్ చెక్‌పాయింట్ల వద్ద తమ పాస్‌పోర్ట్‌తో పాటు వాటిని సమర్పించడానికి అనుమ తిస్తుంది. ఈ వ్యవస్థ, కొత్త దరఖాస్తుదారులు ఇప్పటికే ఓసీఐ కార్డు పొందిన వారు ఇద్దరూ తమ డిజిటల్ కార్డు లను ఆన్‌లైన్ ఓసీఐ సర్వీసెస్ పోర్టల్,ఇండియన్ వీసామొబైల్ యాప్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవడానికి డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఇఒసిఐ పొందిన తర్వాత కూడా ఇప్పటికే ఉన్న భౌతిక ఓసీఐ కార్డులు చెల్లు బాటులో ఉంటాయి. అయితే, ఇఒసిఐ కార్డు పొందినప్ప టికీ, విదేశీ విమానయాన సంస్థల సిబ్బందికి ఈ నూతన ప్రక్రియ పట్ల పూర్తి అవగాహన ఏర్పడే వరకు భారతదేశ పర్యటన సందర్భంగా ప్రతిసారి కూడా ఫిజికల్ బుక్‌లెట్‌ను తమతో ఉంచుకోవాలి. 20ఏళ్లు పైబడిన కార్డుదారులు ఒసిఐ పోర్టల్‌లో తమ కొత్త పాస్‌పోర్ట్ వివరాలను మాత్రమే నమోదు చేయవలసి ఉంటుంది. భౌతిక ఒసిఐ కార్డు జారీ సమయంతో పోలిస్తే ఇఒసిఐ కార్డు జారీసమయానికి చాలా తక్కువ సమయం పడుతుంది. సాధారణంగా భౌతిక ఓసిఐ కార్డు జారీకి 6 నుండి 8 వారాలు పట్టేదానితో పోలిస్తే, ఇఒసిఐ కార్డు 15 పనిదినాలలోనే వేగవంతంగా జారీ చేయ బడుతుంది. ఇఒసిఐకి భౌతిక కార్డుతోపోలిస్తే, తక్కువ పత్రా లు అవసరమవుతాయి. అంతేకాదు, మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకునే వెసులుబాటు ఉండడంతో దీనిని ఎప్పుడైనా, ఎక్కడైనా అవసరమైనప్పుడు సంబంధిత అధికారులకు చూపించేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. భౌతిక ఓసిఐ కార్డును ఏ విధంగా పాడవకుండా సురక్షితంగా భద్రపర్చుకోవలసి ఉంటుంది. కానీ ఇఒసిఐ కార్డుతో ఇక అటువంటి బెంగ ఉండదు. ఆన్‌లైన్‌లో ఉండడంతో అది పూర్తిగా సురక్షితం. ఇఒసిఐ కార్డుతో భారతీయ విమానాశ్రయాలలో ఇమ్మి గ్రేషన్ ధృవీకరణ వేగవంతంగా పూర్తవుతుంది. భారత దేశ పౌరసత్వ (సవరణ) నిబంధనలు, 2026, ఒసిఐ దరఖాస్తు ప్రక్రియను డిజిటలైజ్ చేయడం ద్వారా దరఖాస్తులనుడూప్లి కేట్‌లో (రెండుప్రతులు) సమర్పించాలనే మునుపటి నిబంధ నను తొలగించింది. ఎవరైనా ఒసిఐకార్డు కలిగిన వ్యక్తి స్వచ్ఛందంగా తమ కార్డును రద్దు చేసుకోవాలనుకుంటే ప్రత్యేక ఒసిఐ పోర్టల్‌లో ఫారం ట్రిపుల్ ఎక్స్‌ని పూరించడం ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా రద్దు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న భౌతిక ఒసిఐ కార్డులన్నీ చెల్లుబాటులోనే ఉంటాయి. కాబట్టి, తమ కార్డును ఇఒసిఐగా మార్చుకోవా ల్సి న అవసరంలేదు.

# ప్రజావాక్కు



### జ్యోతిష్కులకు సవాల్..

జాతకాలు జ్యోతిష్యం చెప్తామనేవారిని నమ్మవద్దు. మోసం, అబద్ధం, బూటకం. జ్యోతిష్యం చెప్పడం మా తాత ముత్తాతలనుండి వారసత్వంగా వస్తుంది. మేము కొండ జాతివారము, మీజీవితాలను మారుస్తాము, మీ వివాహ సమస్యలు, ఆర్థిక సమస్యలు, కోర్టుసమస్యలు ఇట్టే తీరుస్తాము, దిష్టి నర దిష్టి లేకుండా చేస్తాము, దుష్టగ్రహ శక్తులనుండి రక్షిస్తాం, ఈ నంబరుకు ఫోన్ చేయండి, ముందుగా ఇంత డబ్బులు పంపండి, పని జరగక పోతే మీ డబ్బు వాపసు అంటూ టీవీలలో తెగ ప్రకటనలు వస్తున్నాయి. వీటిని అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉన్నది. కానీ అవి ఆ పని చెయ్యటం లేదు. పైగా అరికట్టవలసిన వారేదొంగబాబాల చుట్టూ తిరుగుతున్నా రు. మూఢ నమ్మకాలను పెంచీ పోషిస్తున్నారు. జ్యోతిష్యం అబద్ధం. మోసం,దగా, ప్రపంచంలో జ్యోతిష్యం నిజ మని ఇంతవరకు ఋజువు కాలేదు. జ్యోతిష్యం నిజమని నిరూపిస్తే కోట్ల రూపాయలు బహుమతిగా ఇస్తామని హేతువాదులు ప్రపంచమంతా సవాళ్లు చేస్తున్నారు. ఒక జ్యోతిష్కుడి వలన 2001లో నేపాల్ రాజ కుటుంబం మొత్తం హత్యగావింపబడ్డారు.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఎక్కడవేసిన గొంగళి అక్కడే..

కొన్ని గ్రామాల్లో పాలకవర్గం కొలువుదీరి ఏడు నెలలైనా ఎక్కడిగొంగడి అక్కడే వేసినట్లే ఉంది గ్రామాల్లో పరిస్థితి. ఎన్నికలప్పుడు పెద్ద పెద్ద హామీలిచ్చిన లీడర్లు అమలు చేయకుండా అటకెక్కించారు. వీళ్ల మీదా వాళ్ళు వాళ్ళ మీద వీళ్ళు మాయమాటలు చెప్పి అభివృద్ధి చేయకుండా అధోగతి పాలు చేస్తున్నారు. వీళ్లను ఎక్కడిక్కడ లెక్క లెక్కఅడిగి నిలదీస్తేనే అభివృద్ధి జరుగుతుంది. లేదంటే వీళ్ళునాటకాలు ఆడుతూనే ఉంటారు పదవీకాలం అంత.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపిలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజల ఫిర్యాదులు వివిధ శాఖలకుసంబంధించి ప్రత్యక్షంగా జిల్లా మేజిస్ట్రేట్ ,కలెక్టర్ వారు స్వీకరణ చేస్తూ వారికి రసీదు ఇవ్వడం ఎంతో తృప్తికరం. వారు సమస్య స్థితిని వ్యక్తంచేయడం కూడా కొంత ఉపశమనం ఉంటుంది. ఐతే ఫిర్యాదుల సంఖ్యాశాఖలవారీ ప్రకటనతోపాటు, దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి హెచ్చు ప్రాధాన్యత ఉంటుంది.

### పని లేని పథకం

వీబీజీరామ్‌జీలో ఎక్కువ పని దినాలు తప్ప కూలీలకు పని లేదు అని, కాంట్రాక్టర్స్ లూటీ ఉంటుందని ఒక విమర్శ ఉంది. దానికి ప్రభుత్వం చెప్పే సమాధానం ఏమిటి అంటే స్థిరమైన ఆస్తుల సృష్టి చేయడమే లక్ష్యం అని ప్రభుత్వం చెపుతుంది. ప్రభుత్వం పెంచిన 125 రోజుల లక్ష్యం చేరుకో గ లమా అనేది కొంత మంది అభివృద్ధి ఆధారిత ఆర్థిక వేత్తల మాట. వాళ్లవాదన నిజమే. ఎందుకుఅంటే సగటు కూలీలకు పని దినాలు కల్పించడంలో చాలా రాష్ట్రాలు 40 నుండి 50 మధ్యనే కొట్టుమిట్టడుతూ ఉన్నాయి. పైపెచ్చు తెలంగాణ లాంటి రాష్ట్రాలలో వనమాహోత్సవం పేరుతో చెట్లను పెంచే బృహత్తర కార్యక్రమాలుపెడుతున్న నేపథ్యంలో గ్రామపంచాయితీలు తమ లక్ష్యాలు చేరుకోవడంలో మునుగా లాంటివి ఇతోధికంగా పనిచేస్తాయి. 60శాతం కూలికి 40శాతం గ్రామ పంచాయితీకి ఆదాయం సమకూరుతుంది. అంటే మునుగా పెట్టె రైతు ఏడాది పొడుగునా తానుమాత్రమే లబ్ధి పొందడం కాదు గ్రామపంచాయితీకి లబ్ధి చేకూరుస్తున్నాడు అన్నమాట.

- భారత అవినాష్, జనగామ

### అలవాట్లు మార్చుకోవాలి

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండే అని తాత ముత్తాతలను గుర్తుచేసుకొంటున్నారు. కానీమారిన జీవన శైలిని మార్చుకొనేందుకు ఇష్టపడట్లేదు. మనం తినేఆహారం, తాగే పానీయాలు, శారీరక శ్రమ తగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం,ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. ఇలాంటి వ్యసనాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

- టి. మురళీ మోహన్, హైద్రాబాద్

### సాంకేతిక లోపం

మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ఓపెన్ కావడం లేదు. తరుచూ సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయి. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజావివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈలోపం కారణంగా అనేకమంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

23MN 5 PG-GNT_23MN 5 PG-GNT.qxd 22-07-2026 PM 11:54 Page 1



## కబ్జా కోరల నుంచి కోటి విలువైన

# ప్రభుత్వ భూమికి రక్షణ

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: రాజుపాలెం పరిధిలో కోటి రూపాయల పైగా విలువ చేసే ప్రభుత్వ స్థలం, కొండవాగు భూమిని రియల్ వ్యాపారం కబ్జాకు గురవుతొండటూ వెలువడిన వార్త కథనానికి అధికార యంత్రాంగాన్ని కదిలించింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వెంటనే స్పందించి కబ్జాకు గురికాకుండా చూడాలంటూ సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లుగా తెలిసింది. దీంతో మంగళవారం రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని భూమిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని, వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ఆక్రమణలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కన్నా, అధికారులు స్పష్టం చేస్తున్నట్లుగా సమాచారం.. అవసరమైతే సంబంధిత రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ భూమి హద్దులను నిర్ధారించి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టనున్నట్లుగా తెలుస్తుంది. స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు వార్తా కథనానికి వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా కు, అలాగే రంగంలోకి దిగిన రెవెన్యూ, పోలీసు అధికారులకు పలువురు అభినందనలు తెలిపారు. వెండర్ సిబ్బంది వార్త ప్రాతినిధ్యుడు పొత్తూరి వెంకటేశ్వర్లు (బుజ్జి) పై దాడి చేసినప్పటికీ ప్రభుత్వ భూములను కాపాడే విషయంలో పోషించిన పాత్రను కూడా పలువురు ప్రశంసిస్తున్నారు.

**వార్త ప్రభావం**

**స్పందించిన ఎమ్మెల్యే కన్నా**
**-రంగంలోకి దిగిన రెవెన్యూ, పోలీసు అధికారులు**

## ఎస్‌వీఎన్ కాలనీ ఎస్సీ హాస్టల్ సమస్యపై జాయింట్ కలెక్టర్‌ను కలిసిన దళిత సంఘాల నేతలు

గుంటూరు విద్య జూలై 22 ప్రభాతవార్త : గుంటూరు నగరం ఎస్వీఎన్ కాలనీ ఎస్సీ హాస్టల్లో మెనూని హాస్టల్ వార్డెన్ అమలు చేయట్లేదని ,శానిటేషన్ సక్రమంగా లేదని, హాస్టల్ తమకు సరిపోవటం లేదని, ప్రభుత్వం నుండి విద్యార్థుల కోసం వచ్చిన దుస్తులు గాని ఇవ్వటం లేదని సోమవారం గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేసినప్పటికీ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కనీసం హాస్టల్ ని సందర్శించలేదని, విన్నవిస్తూ బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్



ని దళిత సంఘాలతో విద్యార్థి బృందం కలిసి ఫిర్యాదు చేశారు. దీనితో స్పందించిన జాయింట్ కలెక్టర్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఉన్న లక్ష్మీబాయిని తక్షణమే హాస్టల్ ను సందర్శించి సమస్యలన్నిటిని పరిష్కరించవలసిందిగా సాయంత్రానికి తనకు నివేదిక పంపవలసిందిగా ఆదేశించి వారిని షిఫ్ట్ చేయండి అంటూ ఫోన్ ద్వారా ఉత్తర్వులు జారీ చేశారని దళిత సంఘాల నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజా సుందర్ బాబు తో పాటు దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం భీమసేన సేవా దళ్, చార్వాక యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నం డేవిడ్ విల్సన్, భీం సెన సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల సురేష్, అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు వడ్డేమకుల సురేష్, విద్యార్థి సంఘ నాయకులు హాస్టల్ విద్యార్థి నాయకులు ఎం నాగరాజు, కే శ్రీనివాస్ లు సతీష తదితరులు పాల్గొన్నారు.

## సుమేధలో ఘనంగా విద్యార్థి నాయకత్వ కార్యక్రమం

గుంటూరు విద్య జూలై 22 ప్రభాతవార్త: స్థానిక ఎస్వీఎన్ కాలనీలోని సుమేధ హై స్కూల్ లో విద్యార్థి నాయకత్వ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఏ . వీర రాఘవ



స్కూల్ లీడర్ ఎలక్షన్స్ లో విజయం సాధించినటువంటి విద్యార్థులను అభినందించి వారితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాంబాబు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీనియారిటీపై ప్రొఫెసర్లలో తడబాటు..!

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై22, ప్రభాతవార్త: ఏఎన్‌యులో ప్రొఫెసర్‌ల సీనియారిపై అంతర్యుద్ధం జరుగుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా సైన్స్, ఆర్ట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ హోదా కోసం సీనియారిటీ అంశం కీలకంగా మారడంతో ప్రస్తుతం వర్సిటీలో సీనియారిటీ అనేది హాట్ టాపిక్ అయ్యింది. సిఎఎస్ సీనియారిటీ, డైరెక్టర్ సీనియారిటీ మధ్య వ్యత్యాసాలు ఉండటంతో సీనియర్‌గా ఉన్న వారు



అందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈనెలలో ఆచార్య కె. వీరయ్య సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పదవినుంచి రిలీవ్ కానున్నారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఉన్న వైస్ ప్రిన్సిపాల్‌కు అవకాశం వస్తుందా ...! లేక మరొకరిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తారా అనేది తెలియాల్సి ఉంది. అలాగే అక్టోబరులో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ హోదా కూడా ఖాళీకానుంది. ఇందులో ప్రస్తుతం వైస్ ప్రిన్సిపాల్‌గా ఆచార్య ఎల్.ఉదయకుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఈయనను కాదని మరొకరిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తారని ప్రచారం జరుగుతుంది. సీనియారిటీపై వర్సిటీ అధికారులు తీసుకునే నిర్ణయాలు న్యాయస్థానాలకు నడిపించేలా ఉంటాయనే ఆందోళన పలువురు ప్రొఫెసర్‌లలో కనిపిస్తుంది. దీనిపై అధికారులతో ప్రొఫెసర్‌ల ప్రతినిధులుగా అధ్యాపక సంఘం చర్చలు జరిపి సీనియారిపై స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జులై 22,ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి, కూటమి సుపరిపాలన శాశ్వతంగా కొనసాగాలంటే ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి,అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని గుంటూరు టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావులు పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ



అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మరణించిన 19వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు బత్తుల రమణమ్మకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మోనం పాటించారు.ఈ సందర్భంగా జూలై 27 నుంచి ప్రారంభం కానున్న "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు" కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలుగుదేశం పార్టీ బలోపేతం, కార్యకర్తల బాధ్యతలు, కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం పై విస్తృతంగా మాట్లాడారు. ప్రతి డివిజన్ కమిటీ, ప్రతి బూత్ ఇన్‌చార్జి, ప్రతి నాయకుడు ప్రజల ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సాధించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రతి ఇంటికి కరపత్రాలు అందించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ..... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన శాశ్వతంగా కొనసాగాలంటే ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన అన్నారు.ఈ సమావేశంలో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు నిమ్మల శేషయ్యలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# గుంటూరు వార్త

## 25న ముద్రగడ సంతాప సభ

### ఘన నివాళి అర్పిస్తాం రాష్ట్ర కాపు జేఏసి నేతలు

గుంటూరు, జూలై 22, ప్రభాతవార్త ప్రతినిధి: కాపు ఉద్యమ నేత మాజీ మంత్రి వర్యులు ముద్రగడ పద్మనాభం గారి సంతాప సభ ఈ నెల 25 వ తేదీ శనివారం ఉదయం 10 గంటల గుంటూరులో ఏర్పాటు చేయడం జరిగింది. గుంటూరు పట్టణంలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు



చేశామని రాష్ట్ర కాపు రితిది నాయకులు తెలియజేశారు.పార్టీలకతీతంగా జరిగే కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రజా సేవకుడిగా నిజాయతీగా అవినీతి మచ్చలేని రాజకీయ జీవితం గడిపారని పోరాటాల ద్వారా ప్రజా హక్కులు సాధించారని, ఎన్నో ఉద్యమాలు చేశారని రిత్ష్హి నాయకులు దాసరి రాము,చందు జనార్ధన్,మాధారాధా,పాకనాటి రమాదేవి,మిరియాల శ్రీనివాసరావు,మలిశెట్టి సుబ్బారావు మీడియా సమావేశం లో చెప్పారు. ఈ కార్యక్రమంలో అమ్మ శ్రీనివాస్ నాయుడు, లక్ష్మణరావు,రాగం సదా, ఎర్రగోపు నాగేశ్వర రావు,బొక్కిసం శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రార్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న సింహాచలం

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై22, ప్రభాతవార్త: ఏఎన్‌యు తాత్కాలిక రిజిస్ట్రార్‌గా ఆచార్య జి.సింహాచలం రెండేళ్ళ పదవీకాలాన్ని బుధవారం పూర్తిచేసుకున్నారు. 2024 జూలై 22న



ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు రెక్టార్‌గా రత్నషీలామణి, సిడిఇ డైరెక్టర్‌గా ఆచార్య వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్‌గా ఆచార్య రామచంద్రన్, పిజి పరీక్షలకు ఆచార్య సుబ్బారావు, రీసెర్చ్‌సెల్‌కు డాక్టర్ సుధాకర్ ఇలా కొంతమంది అధికారులు పదవులు చేపట్టారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి తనపాలనలో ప్రత్యేకతను సాధించుకున్నారని వర్సిటీలో ప్రచారం జరిగింది. పదవీకాలంలో ఆర్థిక క్రమశిక్షణ పేరుతో దస్త్రాలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేశారు. రూ.100 కూడా బేరీజు వేసిమరీ దస్త్రాలను పరిశీలించారు. వేతనాలు పెంపు విషయంలో చాలా కఠినంగా వ్యవహరించారు. వరదల వల్ల వర్సిటీ లైబ్రరీ ముంపుకుగురైనప్పుడు అందరిని అప్రమత్తం చేశారు. హాస్టల్స్‌లో క్వాలిటీ ఫుడ్ ఇవ్వాలని పదేపదే ఆదేశించారు. వర్సిటీ అధికారులు ఈ రెండేళ్ళలో దాదాపు నిరుద్యోగులు, బలహీనవర్గాలకు చెందిన సుమారు 150మంది క్యాజువల్ వర్కర్, టెక్నికల్ అసిస్టెంట్‌లను ఉద్యోగాల నుంచి తొలగించడం గమనార్హం. అయితే ప్రతీ నెల ఉద్యోగులకు వేతనాలు ఎప్పుడు ఎంత శాతం జమ అవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. రెండేళ్ళలో అధికారులపై ప్రభుత్వానికి అందిన పిర్యాదులు, వర్గాల వారీగా పదవులు కాపాడుకునే కొత్త నినాదం, ఏ సమస్య వచ్చినా ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగటం అలవాటుగా మారినట్లు సమాచారం. రెండేళ్ళు దాటిన వారికి ఉద్వాసన ఉంటుందా..! లేక మరికొంతకాలం కొనసాగిస్తారా అనేది కొద్ది రోజుల్లో తెలియనుంది. రిజిస్ట్రార్ సింహాచలం డిసెంబరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అప్పటివరకు ఈయననే కొనసాగిస్తారా లేక కీలకమైన మూడు పదవుల్లో లేని ఎస్‌సి కేటగిరికి అవకాశం కల్పిస్తారా..! అనేది తెలియాల్సి ఉంది. రిజిస్ట్రార్ పదవి కోసం రెండు విభాగాలకు హెచ్‌ఓడిగా ఉన్న ఒక అధికారి మంత్రుల పేషీలచుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. అయితే తమ అభ్యర్థిని ఎంపికచేశామని అతిత్వరలోనే ప్రకటిస్తామని ఆయనకు సమాదానం వచ్చిందని వర్సిటీలో ప్రచారం జరిగింది.

## 27 నుంచి తూర్పు టీడీపీ ఇంటింటి ప్రచారం

గుంటూరు, జులై 22,ప్రభాతవార్త :కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అన్ని వర్గాలకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈ నెల 27వ తేదీ నుంచి ఇంటింటికీ సంక్షేమ విజయాలు పేరిట ప్రజల ముంగిటకు తీసుకెళ్లబోతున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత లీడర్ నుంచి కేడర్ వరకు ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ




చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే నసీర్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమానికి నూతన అధ్యాయం లిఖించారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే కాకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను అమలు చేశామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా ప్రజల గుమ్మం



ముంగిటకే చేర్చామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా పథకాలు అందజేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం2 పథకం, స్త్రీశక్తి పథకం, సూపర్ సిక్స్ అమలు వంటి పథకాలు సమర్థవంతంగా అమలు చేశామన్నారు. తాజాగా తల్లివందనంతో ప్రతి విద్యార్థికీ నిధులు అందించామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు చేరవ చేశామని తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేస్తే కూటమి ప్రభుత్వంలో అమరావతిని ప్రపంచ రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఒక్క చాన్స్ పేరిట రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. కూటమి సంక్షేమ విజయాలు పేరిట ప్రతి ఇంటికీ టీడీపీ కేడర్ నుంచి లీడర్ వరకు వెళతారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరిస్తూనే సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. మై టీడీపీ యాప్ లో ఫొటోలు నమోదు చేస్తారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, వీటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

## హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని ఓ వసతి గృహంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. వారం రోజుల కిందట శుభకార్యానికి సొంతూరుకు వెళ్లిన విద్యార్థిని తిరిగి వసతి గృహానికి వచ్చేందుకు మారాం చేసింది.తాను చదువు మానుకుంటానని చెప్పడంతో తల్లి కోప్పడి దగ్గరుండి వసతి గృహంలో చేర్చి వెళ్లింది. కలత చెందిన విద్యార్థిని సోమవారం రాత్రి ఎలుకల పేస్టు తినడంతో వసతి గృహ బాధ్యులు గుర్తించి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో చేర్చారు.

## దశాబ్దాల సేవలకు సత్కారం

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై22, ప్రభాతవార్త: దశాబ్దాలపాటు వర్సిటీకి సేవలందించిన ఏఎన్‌యు విశ్రాంత అధ్యాపకులు, ఉద్యోగులను స్వర్ణోత్సవాల్లో భాగంగా బుధవారం సన్మానించారు. డైక్‌మన్ ఆడిటోరియంలో భావోద్వేగభరిత వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మాజీ వీసి ఆచార్య కె.వియ్యన్నరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తల్లిలాంటి వర్సిటీ మనకు ఎన్నో అవకాశాలు, ఎంతో గుర్తింపు, గౌరవాన్ని ఇచ్చిందన్నారు. ఆరుణం తీర్చుకునేందుకు మనవంతు సహకారం అందిద్దామని పిలుపునిచ్చారు. నేటితరం ఉద్యోగులు వర్సిటీ ప్రతిష్టను



ఇనుమడింపచేయాలని కోరారు. గౌరవ అతిధిగా పాల్గొన్న ఉన్నతవిద్యా మండలి వైస్‌చైర్మన్ ఆచార్య కె.రత్నషీలామణి వర్సిటీ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వీసి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ 1976-2026 ఈ 50ఏళ్ళ కాలంలో వర్సిటీ పురోభివృద్ధిలో విశ్రాంత అధ్యాపకులు, ఉద్యోగులు కీలకభాగస్వామ్యం అందించారని కొనియాడారు. వారి సేవలు చిరస్మరణీయం అన్నారు. ఒకే వేధికపై మాజీ ఉద్యోగులందరిని సత్కరించడం మరువలేని జ్ఞాపకంగా పేర్కొన్నారు. మీరంతా వర్సిటీని సొంత కుటుంబంలా భావించి సేవలందించారని కొనియాడారు. వారిస్ఫూర్తితో నేటితరం ఉద్యోగులు కృషిచేయాలని సూచించారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీ పట్ల ప్రతీ ఒక్కరికి నైతిక బాధ్యత ఉందన్నారు. విద్యావికాసమే దేశ సమైక్యతకు మూలం అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఈ స్వర్ణోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన అన్ని ఉద్యోగ సంఘాలు, పూర్వ ఉద్యోగులు అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య తేజోమూర్తి, నూటా అధ్యక్ష్య, కార్యదర్శులు ఆచార్య బ్రహ్మాజీరావు, ఆచార్య త్రిమూర్తిరావు, వికాస అధ్యక్షుడు నీలపు ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.విజయ్‌ప్రకాష్, కార్యదర్శి జె.శ్రీనివాసరావు, పెన్షనర్‌ల సంఘం అధ్యక్ష్య, కార్యదర్శులు విష్ణువర్ధన్, శివప్రసాదరావు, ఉపాధ్యక్షులు యం.శాంతిశ్రీ, ఏసిఇ రెడ్డి ప్రకాశరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆగస్ట్ 15 నుండి సింగిల్ యూజ్ ప్లాసిక్ వినియోగం, విక్రయంపై సంపూర్ణ నిషేధం

### నగర కమిషనర్ కె.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జులై 22 (ప్రభాత వార్త ) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆగస్ట్ 15 నుండి సింగిల్ యూజ్ ప్లాసిక్ వినియోగం, విక్రయంపై సంపూర్ణ నిషేధం అమలులో ఉంటుందని, ప్రజారోగ్య రక్షణ దృష్ట్యా నగర ప్రజలు, వ్యాపార సంస్థలు నిషేధంకు సహకరించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ కోరారు. బుధవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఈఆటోల మ్యాపింగ్, ఎఫ్ఆర్ఎస్ ద్వారా కార్మికుల హాజరు తదితర అంశాలపై నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కల్గిన



ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, నాన్ ఓవెన్ ప్లాస్టిక్ బ్యాగ్స్ (చదరపు మీటర్ కి 60 గ్రాముల కన్నా తక్కువ బరువు) ఉత్పత్తి, స్టోర్ చేయడం, వినియోగం, విక్రయాన్నికేంద్ర పర్యావరణ శాఖ నిషేధించిందన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని సంపూర్ణంగా నిషేధించడం జరిగిందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వలన పలు రకాల క్యానర్స్, అనారోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని, ప్రజారోగ్య, పర్యావరణ రక్షణ దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆగస్ట్ 15 నుండి నిషేధంకు సహకరించాలని కోరారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణకు కేటాయించబడిన ఈ ఆటోలకు జిపిఎస్ ద్వారా ట్రాకింగ్, మ్యాపింగ్ చేయాలన్నారు. డివిజన్ల వారీగా కార్మికుల హాజరు తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ ద్వారానే చేయాలని, ప్రతి రోజు సాయంత్రం ఎఫ్ఆర్ఎస్ రిపోర్ట్ తమకు అందించాలని, డిప్యూటీ కమిషనర్లు కూడా ప్లాస్టిక్ నిషేదం, పారిశుధ్య పనుల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, డిప్యూటీ కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, బయాలజిస్ట్ శేషయ్య, డిఈఈ సతీష్ కుమార్, ఎస్ఎస్ లు ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, సాంబయ్య, రాజేష్, ఐజాక్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ అనిల్ పాల్గొన్నారు.


**కెనరా బ్యాంక్ Canara Bank**

**ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు**
విజయపురి 5వ లేను ఎదురుగా, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:
1) శ్రీ మాలెంపాటి మధు సూధనరావు, తండ్రి: కోటేశ్వరరావు, డి నెం.13-9-55/22, వైష్ణవి టవర్స్, పొలిమెర రోడ్, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523155. (ఋణగ్రహీత)
2) శ్రీమతి మాలెంపాటి సంధ్యా రాణి, భర్త: మధుసూధనరావు, డి నెం.13-9-55/22, వైష్ణవి టవర్స్, పొలిమెర రోడ్, చీరాల, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523155. (హామీదారు)
డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, చీరాల-II బ్రాంచ్ నుండి శ్రీ మాలెంపాటి మధు సూధనరావు, తండ్రి: కోటేశ్వరరావు వారు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & అకౌంట్ నెం. | లోన్ మొత్తం & లోన్ తేది | తేది.30.06.2026 నాటికి బకాయి వడ్డీతో కలిపి | వడ్డీ రేటు |
|---|---|---|---|
| OSL - RESTRUCTURED A/c No.36607710000281 | రూ.4,80,000/- తేది: 04.03.2005 | రూ. 2,86,835.65/- | 11.70% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది.29.06.2026 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **చెల్లించవలసిన బకాయి రూ.2,86,835.65/- (అక్షరాల రెండు లక్షల ఎనభై ఆరు వేల ఎనిమిది వందల ముప్పై ఐదు రూపాయల అరవై ఐదు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపించడం జరిగింది.

**తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి**

**షెడ్యూల్ (స్థలం):** ప్రకాశం జిల్లా, SRO చీరాల, చీరాల మున్సిపాలిటీ వార్డు నెం.3, బ్లాక్ నెం.5, T.S. నెం.166, T.S. వార్డు నెం.3, సమీప డోర్ నెం.13-9-55, పోలిమెర రోడ్డు. **హద్దులు: తూర్పు:** అల్లూరి రాజగోపాల్ & ఇతరుల స్థలం 91-00 అ॥లు, **దక్షిణం:** జులగంటి వెంకట సుబ్బారావు & ఇతరుల స్థలం - 44.00 అ॥లు, **పడమర:** బండ్లమూడి రామశాస్త్రి గారి ప్రహారీ గోడ - 96.00 అ॥లు, **ఉత్తరం:** పోలిమెర రోడ్డు - 44.00 అ॥లు.

పైన పేర్కొన్న హద్దుల యందు మొత్తం విస్తీర్ణం 456.95 చ॥గ॥లు లేదా 374.46 చ॥మీ॥లు స్థలంలోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటా 22.85 చ॥గ॥ల స్థలం కలదు.

**షెడ్యూల్ (ఫ్లాట్):** మొత్తం విస్తీర్ణం 456.95 చ॥గ॥లు లేదా 374.46 చ॥మీ॥లు స్థలంలోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటా 22.85 చ॥గ॥ల స్థలం నందు నాలుగవ అంతస్తులోని విస్తీర్ణం 1018 చ॥అ॥లులోని ఫ్లాట్ నెం.F3 కలదు. **హద్దులు: తూర్పు:** 6.00 అ॥ల వెడల్పు గల ఉమ్మడి కారిడార్, **దక్షిణం:** జులగంటి వెంకట సుబ్బారావు, **పడమర:** బండ్లమూడి రామశాస్త్రి, **ఉత్తరం:** 4వ అంతస్తులోని ఫ్లాట్ నెం.F2.

టైటిల్ హోల్డర్ పేరు : శ్రీ మాలెంపాటి మధు సూధనరావు, తండ్రి: కోటేశ్వరరావు.

**తేది: 04.07.2026, ప్రదేశం: గుంటూరు** సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# చంద్రబాబు నాయకత్వ ఆవశ్యకతను శ్రేణులు గుర్తించాలి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: రెండేళ్ల కూటమి విజయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే. ప్రతి ఎన్నికలో విజయం సునాయాసమే అవుతుందని, మనందరి ఏకైక లక్ష్యం స్థానిక సమరంలో తిరుగులేని విజయం సాధించడమేనని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పార్టీ శ్రేణులకు సూచించారు. మిత్రధర్మంలో భాగంగా, పార్టీ ఆదేశాలకు లోబడి కొన్నిసందర్భాల్లో శ్రేణులు త్యాగాలకు సిద్ధపడక తప్పదన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన టీడీపీ క్లస్టర్, యూనిట్ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న ఆయన.. భవిష్యత్ లక్ష్యాలపై పార్టీ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. మన నాయకుడి సమర్థత, అనుభవమే రాష్ట్రానికి, మనకు మేలు చేస్తుంది.. మన నాయకుడి సమర్థత, అనుభవమే రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తోందనే వాస్తవాన్ని పార్టీ శ్రేణులు తమ మైండ్ లోకి ఎక్కించుకోవాలని, అప్పుడే అసంతృప్తి, అసమ్మతి, వ్యక్తిగత అభిప్రాయాలకు అతీతంగా ప్రజల మనసుల్ని గెలవగలమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి, ధైర్యంగా వైసీపీని ఎదుర్కొన్నవారికి ఎప్పటికైనా తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభిస్తాయన్నారు. తనకు, రాష్ట్రానికి ఎన్నిసమస్యలున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకోసం రెట్టింపు ఉత్సాహంతో కష్టపడుతున్నారని, ఆయన నాయకత్వంలో మూడుపార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేస్తే, ప్రజలు ఎప్పుడూ కూటమిపక్షానే ఉంటారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నానన్న ఆయన.. గతంలో కంటే ఎక్కువగా పార్టీ పటిష్టత, ప్రజా సంక్షేమానికి శ్రేణులతో పాటు, తాను కష్టపడుతున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. 25 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయితే.. చంద్రబాబు కష్టం ఫలిస్తుందని, ఊహకందని అభివృద్ధి, సంక్షేమం ప్రజల సొంతమవుతుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నందునే గతంలో విభజన సమస్యలైనా, ఇప్పుడు జగన్ విధ్వంస ప్రభావమైనా రాష్ట్రంపై, ప్రజలపై పడలేదని ప్రత్తిపాటి తెలిపారు. సవాళ్ళ, సంక్షోభాల్ని అధిగమించడంలో మన నాయకుడిని మించిన వారు లేరని ఆయన స్పష్టంచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి స్థానంలో ఉండటాన్ని మించిన గౌరవం, గుర్తింపు మరొకటి లేదని, దానివల్లే ప్రజలతో పాటు, మనం సంతోషంగా, ప్రశాంతంగా జీవించగలుగుతున్నామని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం.. విజయాలు సాధించడం టీడీపీకి వ్యసనంగా మారుతుందన్నారు. 27 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి ప్రచారంలో పార్టీ శ్రేణులు ప్రజలకు చేరువ కావాలని, కూటమి ప్రభుత్వం సుదీర్ఘకాలం అధికారంలో ఉండటం వల్ల కలిగే ప్రయోజనాల్ని వారికి అర్థమయ్యేలా వివరించాలని ప్రత్తిపాటి సూచించారు. బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులు, కేఎస్ఎస్ లు, గతంలో చేసిన సూపర్6 ప్రచారాన్ని మించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో కష్టపడాలన్నారు. నియోజకవర్గ అబ్జర్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు కోడె హనుమంతరావు, నల్లమోతు హరిబాబు, గంగా శ్రీనివాసరావు, మరేళ్ళ అప్పారావు, మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, కొత్త కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, గుంజి శ్రీనివాసరావు, సొరెడ్డి, అమర రమాదేవి, ఇనగంటి జగదీష్, పిల్లి కోటేశ్వరరావు, యూనిట్, బూత్ ఇంచార్జిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రత్నరాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: చిలకలూరిపేట: నాదెండ్ల మండలం, చందవరం గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాటుకూరి రత్నరాజు అకాల మరణం పట్ల ఎమ్మెల్యే ప్రతినతపాటి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అనంతరం శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు బండారు పల్లి సత్యనారాయణ,మండల పార్టీ నాయకులు ,చందవరం పార్టీ నాయకులు పాల్గొన్నారు

## నెల్లూరి కోటేశ్వరరావుకు ఘననివాళి

చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: జాతీయ రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం నెల్లూరి కోటేశ్వరరావు కన్నుమూశారు. నాదెండ్ల మండలం, ఎండుగుంపాలెం గ్రామానికి చెందిన నెల్లూరి కోటేశ్వరరావు పార్థివదేహాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## పూర్ణకృష్ణమూర్తికి 'మర్రి' నివాళి

చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం గణపవరం గ్రామ వాస్తవ్యుడు దామవర్ల పూర్ణ రాధాకృష్ణమూర్తి బుధవారం మృతిచెందారు.శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ రాధాకృష్ణమూర్తి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారి వెంట బుచ్చయ్య తుబాటి రామారావు , కలిశం శ్రీనివాస రావు, గ్యాస్ వెంకన, గాలి హనుమంతరావు తదితరులున్నారు.

## రత్నకుమారి మృతికి పలువురు సంతాపం



చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: ఎస్ఎస్ కేబుల్ నెట్వర్క్ ఛానల్ ఆపరేటర్ నూలు రత్నకాంత్ సతీమణి రత్నకుమారి బుధవారం జామున గుండెపోటుతో మృతిచెందారు. శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ , సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఎస్ఎస్ కేబుల్ నెట్వర్క్ ఎండి గేరా లింకన్ తదితరులు నివాళులర్పించారు., సాతులూరి కోటి, దార ఏలియా ,చుక్కా అశోక్,గంధి ఆంజనేయులు,షేక్ కరీముల్లా, సయ్యద్ హిదాయతుల్లా ,అట్లూరి షరీఫ్,దాసు ,నిడమానూరి హనుమంతరావు,,షేక్ మాబు షరీఫ్ ,చంద్రం , సుబ్రహ్మణ్యం , ప్రత్తిపాటి విజయ్ , నాగెర్ల శ్రీనివాస్ ,అనంతరం శ్రీనివాస్ , అఖిల్ తదితరులున్నారు.

## ఘనంగా దాశరథి జయంతి

చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: జ్యూనియర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రముఖ అభ్యుదయ కవి, సినీ గేయ కవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఆస్థాన కవి దాశరథి కృష్ణమాచార్యులు జయంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్త డా.పి.వి.సుబ్బారావు మాట్లాడుతూ అభ్యుదయ పదంలో కాంతియుత కవిత్వం రాసిన మహాకవి దాశరథి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి బొంత శంకర్ బాబు మాట్లాడుతూ అగ్నిధార, రుద్రవీణ వంటి అభ్యుదయ కవితా సంపుటాలు వెలువరించి తెలుగు సాహితీ లోకంలో స్థిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కార్యదర్శి పొనుగుబాటి బుజ్జిబాబు, సిద్ధాంత కరిముల్లా, షేక్ బాజీ, చుక్క విన్సెంట్ పాల్, చెవుల సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ అధికారి డి.వీరబాబు తదితరులున్నారు.



## ఘనంగా నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు వర్ధంతి



చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లపాటి రాము తండ్రి జెడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్, జీవనజ్యోతి, జీవన్ కోల్డ్ స్టోరేజ్ అధినేత నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం నరసరావుపేట పట్టణంలోని నందమూరి బసవతారకం నల్లపాటి వెంకటేశ్వర్లు పొలిటెక్నిక్ కాలేజీ లో జరిగింది. శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు , శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ , మాజీ శాసనసభ్యులు జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు , మాజీ శాసనసభ్యులు టిటి డి బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి తదితరులు హాజరైన చంద్రశేఖరరావుకు ఘననివాళులర్పించారు.

## 'తల్లికి వందనం' లక్ష్యసాధనలో మంత్రి లోకేశ్ విజయం సాధించారు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాటు.. ఆయా వర్గాల పిల్లల్ని నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్న తన లక్ష్యసాధనలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విజయం సాధించారు. పథకం అమలుపై పూర్తి దృష్టి పెట్టిన లోకేశ్ గతంలో, ఇప్పుడు విడుదలైన ప్రభుత్వ నిధుల మంజూరును ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా పర్యవేక్షించడంతో పాటు, అర్హతల పరిశీలనతో పాటు, అసలైన లబ్ధిదారులకు పారదర్శకంగా లబ్ధి చేకూరేలా అన్ని చర్యలు తీసుకున్నారు. అనాథ పిల్లల్ని కూడా పథకానికి అర్హులుగా గుర్తించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టడం నిజంగా అభినందించాల్సిన విషయం. ప్రతి ఒక్కరికీ సమాన విద్యా అవకాశాలు.. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యాబోధన, ప్రతి తల్లి ముఖంలో చెరగని చిరునవ్వుతో కూటమి సంక్షేమ పాలన ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. నియోజకవర్గంలో 34,109 మంది విద్యార్థులకు లబ్ధి రాష్ట్రవ్యాప్తంగా నేటినుంచి 24 వరకు తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నిధులు జమ అవుతాయి. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఈ ఏడాది 23,576 మంది తల్లుల ఖాతాల్లో రూ.44.34 కోట్లు జమ కాగా, 34,109 మంది విద్యార్థులు ప్రభుత్వ లబ్ధితో ప్రయోజకులు కానున్నారు." అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పేర్కొన్నారు.

## కావూరు,లింగంగుంట్ల గ్రామాలలో పొలం పిలుస్తోంది

చిలకలూరిపేట, జూలై 22, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని కావూరు మరియు లింగంగుంట్ల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం లో నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు ,మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ సరిత పాల్గొన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు గారు రైతులకు , కౌలు రైతు కార్డులు మరియు ఏపీ ఎయిమ్స్ 2.0 ద్వారా ఎరువుల పంపిణీ గురించి వివరిస్తూ ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, కరువు పరిస్థితుల వల్ల పంట నష్టపోయినప్పుడు రైతులు అప్పుల పాలవకుండా కాపాడేది పంటల భీమా మాత్రమే అనీ, దానికిగాను ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.వరి పంటకి ఎకరానికి 80 రూ. కందికి 40 రూ. మిరపకి 360 రూ. ప్రీమియం



చెల్లించాలన్నారు. పునర్వ్యవస్థీకరణ వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం కింద పత్తి పంటకి రూ.1900 ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ క్రాప్ లో నమోదు చేసుకున్న పంటలకు మాత్రమే భీమా కవరేజీ వర్తిస్తుందని చిలకలూరిపేట మండల పరిధిలోని రైతులందరూ తమ గ్రామంలోని వ్యవసాయ సహాయకులు ద్వారా పంట వేసిన వెంటనే ఈ క్రాప్ లో వివరాల నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డిబీ. సరిత గారు మాట్లాడుతూ కవులుకు పొలాలు సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పనిసరిగా కౌవులు కార్డును రెవెన్యూ శాఖ మరియు వ్యవసాయ శాఖ వారిని సంప్రదించి కౌలు కార్డులు తీసుకోవాలని తెలియజేశారు.అంతేకాక నవీకరించబడిన సాఫ్ట్వేర్ ద్వారా ఏపీ ఎయిమ్స్ 2.0 ఎరువుల పంపిణీ గురించి రైతులకు వివరించడం జరిగినది.ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు మరియు రైతులు,రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## సచివాలయంలో ఎమ్మెల్యే అరవిందబాబు బిజీ పర్యటన

నరసరావుపేట, జూలై 22 ప్రభాతవార్త : నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన వైద్య విభాగాల ప్రారంభోత్సవం, క్రిటికల్ కేర్ బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అమరావతి సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విభాగాల్లో ఐపీహెచ్ఎల్ ప్రయోగశాల, అపోలో సంస్థ ఆధ్వర్యంలోని డయాలసిస్ యూనిట్, ఫిజియోథెరపీ యూనిట్, ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్ లు, క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన చేపట్టాల్సి ఉందని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే అరవింద బాబు తీసుకెళ్లారు. త్వరలోనే అనుకూలమైన తేదీని ఖరారు చేసి తెలియజేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా హెల్త్ సెక్రటరీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వీర పాండ్యన్ ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో నరసరావుపేట ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన..

నరసరావుపేట, జూలై 22 ప్రభాతవార్త : బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని డిస్టిక్ చైల్డ్ ప్రొడక్షన్ యూనిట్ అధికారులు బుధవారం నిర్వహించారు. మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో విద్యార్థులకు బాల్య వివాహాలకు సంబంధించిన పలు అంశాలను తెలియజేశారు. డిస్టిక్ డిసిపియు యూనిట్ సోషల్ వర్కర్ శైలజ,సూపర్వైజర్ అన్నపూర్ణ,ఎమ్మెస్ కె, అంగన్వాడీ టీచర్లు సమావేశంలో పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం రామ్మోహన్రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను తెలియజేశారు. మైనర్లకు వివాహం జరపడం వలన వారు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవటం జరుగుతుందని, పుట్టే పిల్లల సైతం మానసిక పరిపక్వత లేకుండా ఉంటారని తెలియజేశారు. బాల్యవివాహాల సమాచారాన్ని ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ కు, జిల్లా అధికారులకు నేరుగాతెలియజేయవచ్చనివివరించారు.ప్రత్యేకంగా ఆడపిల్లల చదువు గురించి, సమాజానికి, కుటుంబానికి విద్య వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. దురాచారాలను అరికట్టాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉంటుందని తెలిపారు. చట్టాలను అతిక్రమిస్తే బాల్యవివాహాలకు సంబంధించిన తల్లిదండ్రులు, పురోహితులు, కళ్యాణ మండపం నిర్వాహకులు,ఫోటోగ్రాఫర్లు, వివాహానికి సహకరించిన ప్రతి ఒక్కరిపై చర్యలు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థినీ,విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఎస్.ఐ.ఆర్ లో భాగస్వామ్యం కావాలి:కలెక్టర్

నరసరావుపేట,జూలై 22 ప్రభాతవార్త :: కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించిందని, రాజకీయ పార్టీలు కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ కృత్రిక శుక్లా కోరారు. ఎస్.ఐ.ఆర్ పై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు ఈ నెల 24వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని చెప్పారు. జూలై 31వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని అన్నారు. జూలై 31వ తేది నుండి ఆగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్ లు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 28వ తేదీ లోగా క్లెయిమ్ లు, అభ్యంతరాలు పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. అక్టోబర్ 3వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల మార్పు, హేతుబద్ధీకరణ చేయుటకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గంలో మొత్తం 17,41,798 మందికి ఏన్యూమరేషన్ ఫారాలు అందించడం జరిగిందని, 1553377(89 శాతం) డిజిటలైజేషన్ చేయటం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి అద్దయ్య, , తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు బి విశ్వేశ్వరరావు,భారతీయ జనతా పార్టీ ప్రతినిధి సిహెచ్ ఆదినారాయణ రావు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి హి దాయత్కాన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్ఎం భాష, జనసేన ప్రతినిధి షేక్ అద్రుఫ్, ఏఐఎంఐఎం ప్రతినిధి కరిముల్లా , తదితరులు పాల్గొన్నారు.




## తొలి ఏకాదశి ఏర్పాట్లపై ఎమ్మెల్యే అరవింద బాబు సమీక్ష

నరసరావుపేట టౌన్, జూలై 22 ప్రభాత వార్త : ఈనెల 25 న తొలి ఏకాదశి పండుగ జరగనున్న సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం కోటప్పకొండలో సమీక్ష నిర్వహించారు. పండుగకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఆయన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. అనంతరం ఆలయ అధికారులతో, స్థానిక నాయకులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు. పండుగ నాటికి ఆలయ పరిసరాల్లో అవసరమైన మరమ్మతు పనులు, ఘాట్ రోడ్డు మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, బారికేడ్లు, క్యూలైన్ల ఏర్పాటు వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఆలయ ఈవో చంద్రశేఖర్, నాయకులు క్రాంతి కుమార్, అంకమ్మ చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెప్మా జూనియర్ అసిస్టెంట్ పై జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు
### ఆరోపణలు చేసిన మెప్మా ఐబి పద్మజ

నరసరావుపేట క్రైమ్, జూలై 22 ప్రభాతవార్త :: పల్నాడు జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ మరియూ అడ్మినిస్ట్రేటివ్ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రోసారావు మహిళలను దూషిస్తున్నాడని, ఇదేమని గట్టిగా అడిగితే కుక్కలాగా మొరగకు .... నీ దిక్కున్ చోట చెప్పుకో అంటూ దుర్భాషలాడుతున్నట్లు అదే కార్యాలయంలో ఐబిగా పనిచేస్తున్న పద్మజ బుధవారం ఒక వీడియోలో తీవ్ర ఆరోపణలు చేసింది. గత ఏడాది తాను పల్నాడు జిల్లా మెప్మా కార్యాలయానికి వచ్చానని ఇక్కడ ఐబిగా వచ్చిన తను చిలకలూరిపేట, సత్తెనపల్లి సిఎంఎం గాను బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలిపింది. రోసారావు కార్యాలయంలోని మహిళా అధికారులను మేకప్ వేసుకుని వస్తారు, బాక్సులు తెచ్చుకుని తింటూ ఉంటారు, వీళ్లకు పని పాట ఏమీ లేదంటూ నోటికి వచ్చినట్లు దూషిస్తూ ఉంటాడని పేర్కొంది. అతనికి నగదు ఇస్తే ఏ టైంకి ఆఫీసుకు వచ్చి బయోమెట్రిక్ పెట్టిన సైలెంట్ గా ఉంటాడని, నగదు ఇవ్వకపోతే నానా రకాలుగా సతాయిస్తున్నాడని ఆరోపించింది. తన వారం రోజులు జీతం తగ్గించాడని .... ఎందుకు తగ్గించారని అడగ్గా నీకు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. ఎవరి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ అన్నాడని తెలిపింది. కార్యాలయాల్లో పనిచేసే మహిళల పట్ల అసభ్య పదజాలలతో దూషించడం చాలా అన్యాయమని, ఇది ఎంత మాత్రం హర్షించదగినది కాదన్నారు. గతంలో గుంటూరు కార్యాలయంలో కూడా ఇతను ఇలానే ప్రవర్తిస్తే ఓ మహిళ కొట్టేందుకు చెప్పు తీసుకుని వెంటపడిందని పేర్కొంది. గతంలో ఇలానే ప్రవర్తిస్తే తాను కంప్లైంట్ ఇస్తానంటే కార్యాలయం ఉద్యోగులు అతని ఎవరితో మార్చుకోమని చెబుతామన్నారని చెప్పి నిలువరించినట్లు తెలిపింది. ఆడవాళ్ళ వస ధారణ పై విమర్శించాల్సిన అవసరం అతనికి ఏముంది అని ప్రశ్నించింది. తాను కచ్చితంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తానని తెలియజేసింది.



## భృగుబండలో నిలిచిన మంచినీటి సరఫరా బోరు బాగు చేయాలని స్థానికుల వేడుకోలు

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామం ఎస్సీ కాలనీలో బోరు చెడిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు నీటి కోసం అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సెక్రెటరీ స్పందించి, వెంటనే స్పందించి ఆ బోరును బాగు చేయించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



## అకాల మరణం.. అండగా నిలిచిన ఇన్సూరెన్స్.. రూ.19.80 లక్షల క్లైయిమ్ అందజేత.

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: జీవిత బీమా అనేది ఒక వ్యక్తికే కాదు, అతని కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించే రక్షణ కవచమని మరోసారి రుజువైంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామానికి చెందిన నూతలపాటి భాస్కరరావు అకాల మరణం అనంతరం, ఆయన తీసుకున్న టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా నామినీ నూతలపాటి త్రివేణికి రూ.19.80 లక్షల డెత్ క్లెయిమ్ అందజేశారు. అంతేకాకుండా పాలసీలో ఉన్న రైడర్ ప్రయోజనం వల్ల మిగిలిన ప్రీమియంను కుటుంబ సభ్యులు చెల్లించాల్సిన అవసరం లేకుండా కంపెనీయే భరిస్తుంది. భవిష్యత్తులో పాలసీ నిబంధనల ప్రకారం వార్షిక ఆదాయం, మెచ్యూరిటీ ప్రయోజనాలు కూడా కుటుంబానికి అందనున్నాయి. దీంతో జీవిత బీమా కుటుంబానికి ఎంతటి ఆర్థిక రక్షణ, భద్రత, భరోసా కల్పిస్తుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ధూళిపాళ్ల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సీఐ హైమారావు, ఎస్ఐ అమీర్ద్దీన్ చేతుల మీదుగా నామినీ నూతలపాటి త్రివేణికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట టాటా ఎఐఎ బ్రాంచ్ మేనేజర్ చట్లా నాగేంద్ర, పార్ట్నర్ రవిచంద్ర నాయక్, షేక్ మహబూబ్ సుభాని, బద్దుల హనుమంతరావు, కోటియా నాయక్, షేక్ బాజీ, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.




## సత్తెనపల్లి మున్సిపల్ డీఇ మాటలు అభ్యంతరకరం: మహిళల ఆవేదన

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: మున్సిపాల్టీ నీటి కుళాయి పన్ను అడిగే పద్ధతి ఇదేనా... అంటూ పట్టణంలోని బోయ కాలనీకి చెందిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈ మధు ప్రభుత్వ అధికారి అయినా మహిళలతో మాట్లాడిన తీరు బాగోలేదని మీడియాకు వివరణ ఇచ్చారు. పట్టణ సచివాలయాల్లో పని చేసే వీరాంజనేయులు, సురేష్ , డీఈ మధుసూదన్ ల మాటల పద్ధతి బాగోలేదంటూ మహిళలు వాపోయారు. వాటర్ కలెక్షన్ విషయంలో భర్త లేని తనపై డీఈ మాట తీరు అభ్యంతరకరంగా ఉందని పార్క్ దగ్గర నివాసం ఉంటున్న మరో మహిళ వాపోయింది.మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఇలాంటి వారిపై , స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.చర్యలు తీసుకొని పక్షంలో పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తొన్నారు.



## నూతన హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే 'కన్నా'



సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం నందు నూతనంగా నిర్మించిన ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కంటెపూడిలో 'పొలం పిలుస్తోంది'

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డి, కంటేపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సత్తెనపల్లి మండలంలోని రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మరియు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో ప్రత్తి, మిరప,కంది మరియు వరి పంటలపై బీమా పొందేందుకు వ్యవసాయ శాఖ నిర్దేశించిన గడువులోగా రైతులు వాటా ప్రీమియం గా చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. ప్రత్తి పంట ఎకరాకు రూ.38,000/ బీమాకు రైతులు వాటాగా రూ.1900/ జూలై 31 వ తేదీ లోపు, మిరప పంట ఎకరాకు రూ.90,000/ బీమాకు రైతులు వాటాగా రూ.360/ జూలై 31 వ తేదీ లోగా, కంది పంట ఎకరాకు రూ.20,000/ బీమాకు రైతులు వాటాగా రూ.40/ జూలై 30 వ తేదీ లోగా, వరి పంట ఎకరాకు రూ.40,000/ బీమాకు రైతులు వాటాగా రూ.80/ ఆగస్టు 15 వ తేదీ లోగా చెల్లించాల్సి ఉందన్నారు. ఈ క్రాపు నమోదు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, వేసిన పంట ధ్రువీకరణ పత్రాలను తీసుకొని రైతు సేవ కేంద్రాలు వద్ద సంప్రదించి, కామన్ సర్వీస్ సెంటర్ ల ద్వారా లేదా మీసేవ కేంద్రాలలో కానీ లేదా ఇన్సూరెన్స్ ఏజెంట్లు ద్వారా గాని పంటలకు బీమా చేయించుకోవాలని తెలియజేసినారు. కౌలు రైతుల కూడా బీమా కి అర్హులేనన్నారు.



## 'కూటమి' ప్రభుత్వం చేయనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**-నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, మండల ముఖ్యనేతల సమావేశంలో 'కన్నా' సూచన**

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇంచార్జెస్ మరియు నియోజకవర్గ, మండల ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సన్నాహక సమావేశం బుధవారం





నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. .ప్రభుత్వ ప్రచార కార్యక్రమం పై నియోజకవర్గ ముఖ్యనాయకులకు పలు సూచనలు చేశారు. ఈనెల నుండి జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కూటమి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు రానున్న కాలంలో కూటమి ప్రభుత్వం చేయనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలనానన్నరు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనమైందని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేయనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు


## 'అమెరికాతో భారత్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు పరచుకోవాలి' ...

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం పేరుతో భారత దేశ రైతులకు నష్టం చేకూర్చే విధంగా ఒప్పందాలు కుదుర్చుకోవడం దుర్మార్గపు చర్య అని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ మాదంశెట్టి వేదాద్రి ఆరోపించారు. భారతదేశంలో పండించే వ్యవసాయ పంటలు పాడి పరిశ్రమ ఆక్వా పరిశ్రమ, తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదాన్ని ఈ ఒప్పందం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం సృష్టిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాక్రోచ్ పార్టీ యువత సామాజిక ఆందోళన కొనసాగిస్తుంటే తీవ్రమైన నిర్బంధాన్ని కొనసాగించి లాఠీచార్జి చేసి భాషవాయువు ప్రయోగించి వాళ్ళని చాలా ఇబ్బంది పెట్టారని ఇది చాలా దుర్మార్గమైన చర్య అని, దీనిని కిసాన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మ్నాధశెట్టి వేదాద్రి తీవ్రంగా ఖండించారు.



## రైతులందరూ బీమాపథకాన్ని వినియోగించుకోవాలి

రాజుపాలెం, జూలై 22, ప్రభాతవార్త: రాజుపాలెం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిపారు. గ్రామ సభలో క్రోసూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మస్తానమ్మ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులందరూ పంటల బీమా పథకంను వినియోగించు కావాలని కౌలు రైతులు కౌలు రైతు కార్డులు పొంది ప్రభుత్వా పథకాలుసద్వినియోగం చేసుకోవాలి అని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పి. వెంకట నర్సయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఖరీఫ్ సీజన్ లో పంటలు సాగు చేయుచున్న ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంట నష్టాల నుండి రక్షణ పొందడానికి బీమా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.



## ఘనంగా ఉద్యోగ, కార్మిక నాయకుడు పురుషోత్తం జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, జూలై 22, ప్రభాతవార్త: సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విశ్రాంత హెల్త్ సూపర్ వైజర్, సిఐటీయు పట్టణ అధ్యక్షులు రొంపిచర్ల పురుషోత్తం జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగం కొరబండి ఆంథోని, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, న్యాయవాది దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్, ఏఐటియుసి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్, ఫెన్సనర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె బి ఆర్ జె ప్రసాద్ లు మాట్లాడారు. అనంతరం పురుషోత్తం కేకు కోసి పలువురికి పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో పలువురు పురుషోత్తం ను పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం న్యాయవాది కిరణ్ కింగ్, నాయకులు కొత్త లక్ష్మయ్య, సిద్దెల మోహన్ రావ్, పాల్ రాజ్, కొరబండి కిషోర్, షేక్.హైదర్, మస్తాన్ వలి, సుభాని తదితరులు పాల్గొన్నారు



## బిడ్డల బంగారు భవిష్యత్తుకు తల్లికి వందనం: ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల టౌన్, జూలై 22, ప్రభాతవార్త: రాష్ట్రంలో విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో నగదు జమ కావడం ఆనందదాయకమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మాచర్ల నియోజకవర్గ పరిధిలో మొత్తం 40,386 మంది విద్యార్థులకు సంబంధించి 27,732 మంది తల్లుల ఖాతాల్లో రూ.60.57 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు రెండో విడత "తల్లికి వందనం" పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం అభినందనీయమని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యత పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు.



## 24న వెల్దుర్తిలో ప్రజాదర్బార్

వెల్దుర్తి,జూలై 22, ప్రభాతవార్త: ఈ నెల 24, శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు శాసన సభ్యుల వారి కార్యాలయం బుధవారం ప్రకటనలో వెల్లడించింది. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరింది. అర్జీదారులు వ్యక్తిగత ఆధార్ కార్డు జీరాక్స్ ను అర్జీకి జత చేసి అందించాలని సూచించింది.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ. 10,000 జరిమానా

దుర్గి, జూలై 22, ప్రభాతవార్త :రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా దుర్గి పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఒకరు పట్టుబడ్డారు.దుర్గి మండలంలోని రాజానగరానికి చెందిన చల్లంచర్ల హరి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు వాహన తనిఖీల్లో చిక్కాడు. దుర్గి ఎస్.ఐ బి. గోపాల్ అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి, మాచర్ల ॥వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రీ. నాగభూషన్ ముందు హాజరుపరిచారు.విచారణ అనంతరం గౌరవ న్యాయస్థానం నిందితుడికి రూ. 10,000/ జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.ఎస్.ఐ బి. గోపాల్ విలేకరులతో మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమే కాదు, ప్రమాదాలకు ప్రధాన కారణం అని వాహనదారులు తమ కుటుంబ సభ్యుల భద్రతతో పాటు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి డ్రైవ్ చేయవద్దు. దుర్గి మండల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలి ...మండల విద్యాశాఖ అధికారి

దుర్గి, జూలై 22, ప్రభాతవార్త: పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణే ధ్యేయంగా జూలై 24 రేపు శుక్రవారం నిర్వహించనున్న తల్లిదండ్రులఉపాధ్యాయుల సమావేశాన్ని (శిగిలీ) వంద శాతం విజయవంతం చేయాలని మండల విద్యాధికారులు పిలుపునిచ్చారు. ఈ మేరకు లీనివీ బెంజమిన్, లీనివీ రమేష్.. సంయుక్తంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, పరిషత్ పాఠశాలల ..ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి శుక్రవారం నాడు జరిగే శిగిలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.వంద శాతం పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి యొక్క తల్లి లేదా తండ్రి ఈ సమావేశానికి హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముందస్తు సమాచారం:.. నేడే గురువారం విద్యార్థుల ద్వారా మరియు వాట్సాప్ గ్రూపుల ద్వారా తల్లిదండ్రులందరికీ ఖచ్చితమైన సమాచారాన్ని చేరవేయాలి. విద్యార్థుల చదువు ప్రగతి, డిజిటల్ లెర్నింగ్, హాజరు శాతం మరియు మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలపై తల్లిదండ్రులతో తెలపాల అన్నారు పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, కావున శుక్రవారం జరిగే ఈ మెగా సమావేశాన్ని ఉపాధ్యాయులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని దుర్గి మండలం ప్రధాన ఉపాధ్యాయులకు తెలిపారు



## ఎల్లో అట్టలతో తెల్లదోమల కీటకాలను నియంత్రించవచ్చు -- సొసైటీ పీఏసీఎస్ సీఈవో గుదిబండి శివనాగిరెడ్డి

కొల్లిపర,జూలై 22 ప్రభాతవార్త: పర్యావరణానికి హాని కలగకుండా పంట పొలాలలో పురుగులను నియంత్రించే ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్ పద్ధతులు పాటించాలని సొసైటీ పీఏసీఎస్ సీఈవో గుదిబండి శివనాగిరెడ్డి పేర్కొన్నారు.మండల కేంద్రం కొల్లిపరలో సమగ్ర సస్యరక్షణ కార్యక్రమంలో ఐపిఎం పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థునులు గ్రామీణ వ్యవసాయ కార్యనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు గుదిబండి నాగిరెడ్డి సాగు చేస్తున్న పందిరి కూరగాయల పొలం వద్ద ఎల్లో స్టిక్కి(ట్రాప్స్),బ్లూ స్టిక్కి ట్రాప్స్,ఫెరోమాన్ ట్రాప్స్,బార్స్,సోలార్ లైట్స్ ను ఏర్పాటు చేసి రైతులకు వాటి ఉపయోగాల గురించి వివరించారు.ఎల్లో అట్టల ద్వారా తెల్లదోమల రసం పీల్చే కీటకాలను నియంత్రించవచ్చన్నారు.ఫెరొమోన్ ట్రాప్స్ ద్వారా హానికర మగపురుగులను బంధించి విత్తనోత్పత్తిని తగ్గించవచ్చన్నారు.బ్లూ జిగురు అట్టల ద్వారా సీతాకోకచిలుకలు,పాకే పురుగులను నియంత్రించవచ్చన్నారు.ఈ విధంగా పంట పొలాల్లో ఏర్పాటు చేయటం వలన పురుగుల ఉద్పతి తగ్గించటంతో పాటు మందుల పిచికారీ తగ్గించవచ్చన్నారు.ఎకరానికి 2 సోలార్ లైట్(ట్రాప్స్ ఏర్పాటు చేయటంతో దోమలు..పురుగులను నియంత్రించవచ్చని పేర్కొన్నారు.



## రైతులు పంట భీమా పథకాలను వినియోగించుకోవాలి -మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి

కొల్లిపర,జూలై 22 ప్రభాతవార్త: రైతులు పంట భీమా పథకాలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి అన్నారు.బుధవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం,కొల్లిపర గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంట దిగుబడి వాతావరణం ఆధారంగా ఖరీఫ్ 2026 సంవత్సరానికి పంట భీమా చేయించుకోవటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలసి ఇన్సూరెన్స్ మార్గదర్శకాలు జారీ చేసారని తెలియజేసారు.ఇందులో భాగంగా వరి పంటకు ఎకరాకు రైతు వాటా క్రింద రూ.800 లు వాతావరణ ఆధారిత పంట భీమా పథకం క్రింద అరటి పంటకు గాను ఎకరాకు రూ.2700 రైతు వాటా చొప్పున చెల్లించేందుకు నిర్ణయించటం జరిగిందన్నారు కార్యక్రమంలో ఎఈవో గోపీనాథ్,వీఏఏ శ్రీలక్ష్మీ,ప్రత్యూష,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## జూలై 31లోగా పంట బీమా నమోదు చేసుకోవాలి: మండల వ్యవసాయ అధికారి

మాచర్ల టౌన్, జూలై 22 ప్రభాతవార్త: ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన మరియు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల కింద పల్నాడు జిల్లా రైతులు గడువులోపు పంట బీమా నమోదు చేసుకోవాలని మాచర్ల మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద మిరప,కంది,వరి పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.మిరప పంటకు రూ.360 ప్రీమియం చెల్లిస్తే రూ.90 వేల వరకు,కంది పంటకు రూ.40 చెల్లిస్తే రూ.20 వేల వరకు,వరి పంటకు రూ.80 చెల్లిస్తే రూ.40 వేల వరకు బీమా రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు.మిరప,కంది పంటలకు భీమా నమోదు చేసుకునేందుకు జూలై 31 వరకు,వరి పంటకు ఆగస్టు 15 వరకు గడువు ఉందన్నారు.అలాగే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద పత్తి పంటకు బీమా అమలులో ఉందని, రూ.1,900 ప్రీమియం చెల్లిస్తే రూ.38 వేల వరకు బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. పత్తి పంటకు కూడా జూలై 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.పంట బీమా కోసం పట్టాదారు పాస్‌బుక్,ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్,పంట నమోదు ధ్రువీకరణ పత్రం,కౌలు రైతులు అయితే కౌలు రైతు కార్డు సమర్పించాలని సూచించారు. రైతులు సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో, క్రాప్ లోన్ పొందిన రైతులు సంబంధిత బ్యాంకుల్లో లేదా నేరుగా శిలీసీత్రీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా కూడా బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.అర్హులైన రైతులందరూ గడువులోపు పంట బీమా నమోదు చేసుకొని ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.



## రుతుపవనాలకు ముందు పొడి విత్తనాలు, పద్ధతులపై రైతులకు అవగాహన

దుర్గి, జూలై 22 , ప్రభాతవార్త: రైతు సంక్షేమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించిన "పొలం పిలుస్తోంది"కార్యక్రమం లో బుధవారం దుర్గి మండలంలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వై.అమిర్ రెడ్డి, ఆర్‌వైఎస్ఎస్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు శిలీదీశీ (పొడి విత్తన సాగు) విధానం రైతులకు వరం లాంటిదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆముదం, కంది, సజ్జలు, అలసంద, గోరుచిక్కుడు తదితర 25 రకాల బయోడైవర్సిటీ విత్తనాలతో విత్తన గుళికల తయారీపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. పిఎండిఎస్ వల్ల భూసారం పెరుగుతుందని, రసాయన ఎరువుల వాడకం 50 తగ్గుతుందని వివరించారు. బీజామృతం, ఘనజీవామృతంతో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు ఖరీఫ్ ఈపంట నమోదు ,పిఎండిఎసష్ కిట్ల పంపిణీని కూడా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. 2026 ఖరీఫ్ సీజన్ కు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (శిజూతీదిశీ )పంటల బీమా నమోదుకు పత్తికి ..1900, మిరపకు ..360, కందికి ..40 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.



## గొట్టిపాళ్ళలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

### 7 గొడ్డళ్లు, 21 వాహనాలు సీజ్

వెల్దుర్తి, జూలై 22, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ళ గ్రామంలో పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ (తనిఖీలు) నిర్వహించారు. మాచర్ల రూరల్ సీఐ వేణు నేతృత్వంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో గ్రామాన్ని క్షుణ్ణంగా శోధించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాలీ ఆటోతో పాటు 7 గొడ్డళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన మాచర్ల రూరల్ సీఐ వేణు కీలక సూచనలు చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి గొడవలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యువతపై నిఘా యువత, పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణ నష్టాలను నివారించాలని అవగాహన కల్పించారు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో మాచర్ల టౌన్ సీఐ షేక్ నజీర్ బేగ్, మాచర్ల రూరల్ ఇంచార్జ్ ఎస్సై వెంకట్రావు, వెల్దుర్తి ఎస్ఐ సత్యనారాయణ, దుర్గి ఎస్ఐ గోపాల్, విజయపురిసౌత్ (సాగర్) ఎస్సై అశోక్‌లతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లింపులో నిర్లక్ష్యం

### ఉన్నతాధికారుల ఆదేశాలు తుంగలో తొక్కిన అధికారులు:తక్షణమే జీతాలు చెల్లించాలి

కారంపూడి, జూలై22, ప్రభాతవార్త: మేజర్ పంచాయతీ కారంపూడి పారిశుధ్య సిబ్బంది జీతల కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న వారి కళ్ళ నుండి కన్నీళ్లు వస్తున్నాయి కాని వారికి జీతాలు ఇద్దాం అన్నా ఆలోచన ఇక్కడ పంచాయతీ అధికారులకు తట్టడం లేదు సుమారు నెల రోజుల క్రితం జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ కారంపూడి పారిశుధ్య కార్మికులు సిఐటియు తో కలిసి జీతాల కోసం రోడ్డెక్కి అన్నామో రామచంద్ర అంటూ నిరసన వ్యక్తం చేసారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన జీతాల కోసం నిరసన కార్యక్రమం గురించి తెలుసుకున్న పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి కారంపూడి వచ్చి పారిశుధ్య కార్మికులతో చర్చించి రెండు మూడు రోజుల్లో పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వాలని పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ను పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్వయంగా జిల్లా పంచాయతీ అధికారే పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించమని ఆదేశాలు జారీ చేసి సుమారు నెల రోజులు అవుతున్న ఇక్కడ పంచాయతీ అధికారులు జిల్లా అధికారి ఆదేశాలను పక్కన పెట్టి పారిశుధ్య కార్మికులకు సంబంధించి జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పవచ్చు. ఇటీవల సర్ కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు కారంపూడి పంచాయతీ కార్యదర్శి, బి.ఎల్. ఓ కాసిన్య నాయక్ ను ఎన్నికల కమిషన్ అధికారులు సస్పెండ్ చేసారు. కార్యదర్శి సస్పెండ్ అయి ఉన్నప్పటికీ జీతాల విషయంలో పంచాయతి స్పెషల్ ఆఫీసర్ ఎంపీడిఓ కూడా పంచాయతీ సిబ్బంది జీతాల విషయం పట్టించుకోవడం లేదని జీతాల కొరకు గత సోమవారం పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ని కలిసిన మా బాధ అలకించే నాథులు కారువయ్యారని సిబ్బంది వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి 14 నెలలుగా జీతాలు అందక ఇబ్బంది పడుతున్న కారంపూడి పారిశుధ్య కార్మికులకు వెంటనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.





## రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం....

వేమూరు జులై 22 (ప్రభాతవార్త) : విద్యార్థుల పక్షంగా వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయటం అప్రజాస్వామ్యకమని కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు యార్లగడ్డ గోపి విమర్శించార. బుధవారం వేమూరులో విలేఖర్లతో మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వేల మంది విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ గత రెండు రోజులుగా ఆందోళన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులపై లాఠీ చార్జి చేయడం అత్యంత హేయమైన చర్య అని విద్యార్థులకు మద్దతు తెలుపుతున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేశారని అదే విధంగా పోలీస్ స్టేషన్లో ఉన్న ప్రియాంక గాంధీని పరామర్శించేందుకు సోనియా గాంధీని అనుమతించకపోవడం దారుణమన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజాసామ్య వ్యవస్థలను కూని చేస్తుందని ప్రజల గోడు వినేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం సుముఖత చూపటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు, అప్రజాస్వామ్యకంగా పరిపాలన చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని యార్లగడ్డ గోపి హెచ్చరించారు.



## గ్రామసభలకు హాజరు కండి..సమస్యలు పరిష్కరించుకోండి -తహశీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర,జూలై 22 ప్రభాతవార్త: రెవిన్యూ పరంగా సమస్యలున్న రైతులు గ్రామసభలకు హాజరు అయితే..సమస్యలు పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ అన్నారు.మండల పరిధిలోని చక్రాయపాలెం సచివాలయంలో రెవిన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు.గ్రామసపభలో సమస్యలున్న రైతులు తెలియజేయాలని అధికారులు అడగటంతో రైతులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించటమే గ్రామసభ ముఖ్య ఉద్దేమన్నారు.రైతులు కూడా సహకరించాలన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో భూసర్వే కూడా జరుగుతుందన్నారు.భూసర్వే చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా తమ పొలాల వద్ద ఉండాలన్నారు.కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ,మండల సర్వేయర్ హరికృష్ణ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 117 మంది ఎన్.ఈ.సి విద్యార్థులకు ఉద్యోగాలు

రొంపిచర్ల,జూలై 22 ప్రభాతవార్త : నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 117 మంది విద్యార్థులకు బహుళ జాతి సంస్థలో బుధవారం ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ మి ట్టపల్లి కోటేశ్వరరావు, డైరెక్టర్ మిట్టపల్లి చక్రవర్తి,కార్యదర్శి మిట్టపల్లి రమేష్ లు అభినందించారు. బుధవా రం కళాశాలలో జరిగిన విద్యా ర్థుల అభినందన కార్యక్రమం లో వివరాలను వారు తెలియజేశారు. సెవినటస్ సొల్యూషన్స్ సంస్థ నిర్వహి ంచిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాల బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు వారికి వ్రాత పరీక్ష, బృంద చర్చ ద్వారా ఉద్యోగాలకు విద్యార్థులను ఎంపిక చేశారు. చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 202526 విద్యా సంవత్సరానికి ఇప్పటివరకు తమ విద్యార్థులు 225 మందికి పైగా సాధించారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన 117 మంది విద్యార్థులకు మూడు లక్షల నుండి నాలుగున్నర లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుందని ఈ సందర్భంగా వారు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.వెంకటేశ్వర్లు, ఉపాధి కల్పనాధికారి ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## అరవిందబాబును అభినందించిన సీఎం చంద్రబాబు

### రుణ వితరణ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారని ప్రశంస

రొంపిచర్ల, జూలై 22 ప్రభాతవార్త : ఈనెల 17న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అవుట్ రీచ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అద్భుతంగా నిర్వహించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. అవుట్ రీచ్ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేసినందుకు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును అభినందించారు. మంగళ వారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే అరవింద బాబు సచివాలయంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ లో ఉన్న పనులపై ముఖ్య మంత్రితో చర్చించారు. నరసరావుపేట పాత ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసిహెచ్ బ్లాక్) నిర్మాణం అత్యవసరమని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి అవసరమైన నాబార్డ్ నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. రొంపిచర్ల మండలంలోని తుంగపాడు, కర్లకుంట గ్రామాల రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రెండు గ్రామాల రహదారుల నిర్మాణానికి సుమారు రూ. 5 కోట్ల మేర నిధులు అవసరమని, ఆ నిధులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రవికుమార్, టీడీపీ నాయకులు గాడిపర్తి సురేష్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.



## నిజాయితీగా పన్నులు చెల్లించే ప్రతి పౌరుడు దేశ నిర్మాణంలో భాగస్వామి అవుతారు

### ఆదాయపన్ను అధికారి జెజిఎస్. కిషోర్ కుమార్

నకరికల్లు,జూలై 22 ప్రభాతవార్త : నిజాయితీగా పన్నులు చెల్లించే ప్రతి పౌరుడు దేశ నిర్మాణంలో భాగస్వామి అవుతారని ఆదాయ పన్ను అధికారి జెజిఎస్. కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం ఆదాయ పన్ను దినోత్సవం సందర్భంగా కేశానుపల్లి గ్రామంలోని ఎంఏఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ఆదాయ పన్ను ప్రాముఖ్యత, పన్నుల ద్వారా దేశ నిర్మాణంలో ప్రజల పాత్ర పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెజిఎస్. కిషోర్ కుమార్ హాజరై ప్రసంగించారు. దేశంలో రహదారులు, విద్య, వైద్య సేవలు, రక్షణ, మౌలిక వసతులు, వ్యవసాయాభివృద్ధి, సంక్షేమ పథకాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే అమలవుతున్నాయని వివరించారు. కళాశాల చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు సామాజిక బాధ్యత, దేశభక్తి, నైతిక విలువలు, బాధ్యతాయుత జీవన విధానాన్ని కూడా బోధించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రసాదరావు, లా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల వీర బ్రహ్మం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## మోటార్ సైకిల్ అదుపుతప్పి మృతి

పెదకూరపాడు,జూలై 22 ప్రభాతవార్త : కనగండ్ల గ్రామానికి చెందిన వీధులపురపు ఆనందు మోటార్ సైకిల్ పై పెదకూరపాడు నుంచి కన్నెగండ్ల గ్రామం వెళ్తూ మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడిపోవడం వల్ల తలకు గాయాలయాయని కుమారుడు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. మరి కొంతసేపటికి చనిపోయినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని పీఎం నిమిత్తం అమరావతి తరలించారు. ఎస్సై గిరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి: ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు జులై 22 (ప్రభాతవార్త) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్ర అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ పురవేదిక వద్ద తెలుగుదేశం పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమయాతం కావాలని, అదే విధంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పట్ల ప్రజలు మొగ్గుచూపే విధంగా పని చేయాలన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రభుత్వ రెండేళ్ళ పాలనపై ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, గ్రామాల్లో పార్టీ నాయకులు ముందుగా ప్రణాళికలు రూపొందించుకొని ఇంటింటా ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ ముఖ్య నాయకులు బూత్ ఇన్‌చార్జిలు షెడ్యూలు రూపొందించుకుని తగు విధంగా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచార నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని గురించి పార్టీ నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వెంకటేశ్వరరాజు, మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పార్టీ నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకట సుబ్బయ్య, మైనేని మురళీకృష్ణ, వాక శేషుబాబు, శివారెడ్డి, సురేష్‌బాబు, దాది లక్ష్మణరావు, షేక్ హనీఫ్, మొవ్వ శరత్చంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 396 జీవోను రద్దు చేయాలని ప్రజాసంఘాల నిరసన

అమరావతి,జులై 22 (ప్రభాతవార్త) శీతీ, శీతీ, జీవో నెంబర్ 396ను వ్యతిరేకిస్తూ మూడో రోజు అమరావతి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దస్తావేజులేకరుల నిరసన తెలిపారు. అమరావతి సీపీఎం, సీపీఐ నాయకులు సూరిబాబు రామకృష్ణ మద్దతు తెలిపారు. దస్తావేజులేఖర్లకు న్యాయం జరగాలని ప్రభుత్వం పొందుపరచిన 396 జీవో రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. జీవో రద్దుకు ప్రభుత్వం పునరాలోచన చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, డీటీపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## మంగళగిరి ప్రజలే నా కుటుంబం... వారి ఆశీస్సులే కొండంత బలం

### ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నా

### మన ఇల్లు - మన లోకేష్ రెండోరోజు కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్..

మంగళగిరి, జూలై 22, ప్రభాతవార్త: రాష్ట్రమంతా మంగళగిరి వైపు చూసేవిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా, మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నాకు ప్రజల ఆశీస్సులు కావాలి, మంగళగిరి నియోజకవర్గం నా సొంత కుటుంబం, ఇక్కడి ప్రజల దీవెనలే తనకు కొండంత బలాన్నిస్తాయని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సికె కన్వెన్షన్ సెంటర్ లో రెండోరోజు మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి



మాట్లాడుతూ తాను మంగళగిరిలో పుట్టిపెరగలేదు. నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేరు, మంగళగిరి ప్రజలను చూస్తుంటే సొంతవారిని చూస్తున్నట్లుగా ఉంటుందన్నారు.2019లో మంగళగిరిలో పోటీ చేసినప్పుడు, ఇంటిపట్టాలు రెగ్యులరైజ్ చేస్తామని మాట ఇమ్మని అడిగారు. అవగాహన లేకుండా లేనిపోని హామీలు ఇవ్వకూడదని చెప్పా. ఫలితంగా 5300 ఓట్ల తేడాతో ఓడిపోయా అన్నారు.ఓటమి నాలో కసి పెంచింది. అయిదేళ్లు అహర్నిశలు కష్టపడి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా అన్నారు.ప్రజలకు ఆరోగ్యం బాగోలేకపోతే ఎన్టీఆర్ సంజీవని క్లినిక్ ద్వారా మందులు అందించా, నిరుపేదలకు తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, స్త్రీశక్తి పేరిట మహిళలకు ట్రైనింగ్ ఇచ్చి కుట్టు మిషన్లు ఇచ్చా, పేదల ఇంట్లో పెళ్లి జరిగితే బట్టలు పెట్టా, కుటుంబంలో దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు ఖర్చులు అందించా, చెట్ల కింద సేదదీరడానికి సిమెంటు బల్లలు ఏర్పాటుచేశా, సుమారు 29 సంక్షేమ కార్యక్రమాలను ప్రతిపక్షంలో ఉండగా సొంత నిధులతో చేపట్టానని వివరించారు.

**హామీలు నెరవేర్చేందుకు రేయింబవళ్లు పనిచేస్తున్నా:** గతఎన్నికల్లో ఘన విజయం సాధించాక ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకునేందుకు రేయింబవళ్లు కష్టపడుతున్నా. తొలివిడతలో 3వేలమందికి,రెండోవిడతలో మరో 3వేలమందికి శాశ్వత పట్టాలు పారదర్శకంగా అందిస్తున్నాం.

**మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు కృషి:** మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నా. వంద పడకల ఆసుపత్రి, గ్రామాల్లో పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానాలు అభివృద్ధి చేస్తున్నా. రాష్ట్రానికి బడ్జెట్ కొరత ఉన్నా మిత్రుల సహకారంతో, సిఎస్ఆర్ నిధుల ద్వారా మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నా అన్నారు. భారతదేశం మొత్తం నిడమర్రు స్కూలు గురించి మాట్లాడుతుందన్నారు. మంగళగిరి నియోజకవర్గ భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నియోజకవర్గం అంతటా చేయాలంటే 1800 కోట్లు ఖర్చు అవుతుందని, కేంద్రంతో సంప్రదించి చాలెంజ్ ఫండ్ నుంచి నిధులు తెచ్చి, రాష్ట్రప్రభుత్వ మ్యాచింగ్ నిధులు కలిపి భూగర్భ డ్రైనేజి పనులు ప్రారంభించామని చెప్పారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నాం, మూసేసిన అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం, తాగునీటి వాటర్ ప్లాంట్ లు ఏర్పాటుచేశాం. గుడులు, చర్చిలు, మసీదులు పనులను కూడా విడతల వారీగా చేస్తాం. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు శక్తి వంచనలేకుండా ప్రయత్నిస్తున్నా అన్నారు. తల్లికి వందనం కింద ప్రభుత్వం 10వేలకోట్లు ఖర్చుచేస్తోంది. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి పథకం అమలు చేస్తున్నామన్నారు. నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను 12నెలల్లో పూర్తిచేసేలా పనులు వేగవంతం చేశామన్నారు. ఎంపీ పెమ్మసాని తాను ఇద్దరం కలసికట్టుగా పనిచేయడం వల్లే పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేయగలుగుతున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేతలు నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు, వల్లభనేని వెంకట్రావు, జవ్వాది కిరణ్ చంద్ తదితరులు పాల్గొన్నారు

## పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

కాకుమాను జూలై 22(ప్రభాత వార్త): మండల పరిధి బి కె పాలెం,కాకుమాను గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి వి .సుధాకర్ బుధవారం తెలిపారు .వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు ప్రస్తుత వర్షభావ పరిస్థితి ని దృష్టిలో పెట్టుకొని ఆరుతడి



పంటలు వేసుకోవాలి అన్నారు. వరి పంట కుఎకరాకురూ.800 ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్సు చేయించుకోవటానికి ఆగష్టు 14 వరకు ఉంది కనుక రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి అని తెలియజేసినారు. యూరియా మరియు డి ఏ పి కొనుగోలు ఏ పి ఏ ఐ ఎం ఎస్ ద్వారా జరుగుతుంది కనుక రైతులు అందరూ తప్పనిసరిగా సమీప రైతు సేవ కేంద్రం లో పొలం సాగు విస్తీర్ణం వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులు లాగిన్ లో సరిచూసుకోవాల్సిందిగా తెలియజేస్తున్నాము. ప్రతి రైతు సేవ కేంద్రం లో యూరియా అందుబాటులో ఉంచటం జరిగినది.కౌలు రైతులు అందరూ తప్పనిసరిగా వీఆర్వో దగ్గర కౌలు రైతు గుర్తింపు కార్డులను తీసుకోవాల్సిందిగా తెలియజేసినారు . ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వి వి ఏ లు, రైతులు పాల్గొన్నారు.

## బ్రహ్మం చౌదరిని పరామర్శించిన నారా లోకేష్

తాడేపల్లి, జూలై 22, (ప్రభాతవార్త): కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరిని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. మణిపాల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి బ్రహ్మం చౌదరిని కలిశారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. బ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుతం అంతా బాగానే ఉందని తెలిపారు. మణిపాల్ వైద్యులతో లోకేష్ మాట్లాడారు బ్రహ్మం చౌదరి పూర్తిగా కోలుకున్నారని, త్వరలో డిశ్చార్జ్ చేస్తామని వారు తెలిపారు. బ్రహ్మం చౌదరి సతీమణి గౌతమి శ్వేతతో మాట్లాడి ధైర్యం చెప్పారు.



## అభివృద్ధి కోసం అంతా కలిసి పనిచేయాలి

నిజాంపట్నం, జూలై 22, (ప్రభాతవార్త): మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని ఎంపిపి మోపిదేవి విజయనిర్మల కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే మాత్రమే రాజకీయం చేయాలని, తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సమావేశంలో పలు సమస్యలను ప్రస్తావించిన సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు తోటకూర సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




## మలివిడతలో 2,634మందికి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి లోకేష్

మంగళగిరి, జూలై 22, ప్రభాతవార్త: మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా వరుసగా రెండోరోజు కూడా మంత్రి నారా లోకేష్, 6 గంటలపాటు నిలబడి పట్టాలు పంపిణీ చేశారు. రెండోరోజున ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటలవరకు 6గంటలపాటు నిలబడి సికె కన్వెన్షన్ వేదికపై నుంచి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. తొలిరోజున 1331మందికి, రెండోరోజున 1303మందికి మొత్తంగా 2,634మందికి నూతన వస్త్రాలు పెట్టి పట్టాలు అందించారు. మలివిడతలో మంత్రి లోకేష్ అందజేసిన పట్టాల మార్కెట్ విలువ సుమారు రూ.1000 కోట్లుగా ఉంది. రెండోరోజు కూడా ఓపికగా నిలబడి పట్టాలు అందించిన లోకేష్... పలువురు దివ్యాంగ లబ్ధిదారులకు వేదిక కిందకు దిగి వెళ్లి పట్టాలను అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి లబ్ధిదారు, వారి కుటుంబసభ్యులతో ఫోటోలు దిగారు. తొలివిడత గత ఏడాది ఏప్రిల్ నెలలో 3,003 మందికి పట్టాలు అందజేశారు. 2029లోగా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూముల్లో దీర్ఘకాలంగా నివాసముంటున్న ప్రతి లబ్ధిదారుడికి పట్టాలు అందజేస్తానని గత ఎన్నికల సమయంలో యువనేత లోకేష్ హామీ ఇచ్చారు. ఇరిగేషన్, రెవిన్యూ, అటవీ, దేవాదాయ, ఆర్ అండ్ బి, పంచాయితీరాజ్, రైల్వే తదితర శాఖలకు చెందిన భూముల్లో పేదలు దాదాపు మూడు దశాబ్దాలకు పైబడి ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నారు. నాడు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు వివిధ శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ పలుమార్లు సంప్రదింపులు జరిపి, శాఖలవారీగా స్థలాల సమస్యను పరిష్కరించారు. కేంద్రప్రభుత్వంతో ముడిపడివున్న మరికొన్ని భూముల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. వాటిపై కూడా కేంద్ర పెద్దలతో మంత్రి లోకేష్ సంప్రదింపులు జరుపుతున్నారు.

## స్కానింగ్ సెంటర్స్‌కి రిజిస్ట్రేషన్ ఉండాలి

### జిల్లా ఉప వైద్య ఆరోగ్యాధికారిణి అన్నపూర్ణ

తెనాలి జులై22(ప్రభాతవార్త): పిసిపిఎన్డిటి చట్టం ఉప జిల్లా స్థాయి సమీక్ష సమావేశం, తెనాలి జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖధికారి కార్యాలయం లో బుధవారం డా. ఈరుగుల అన్నపూర్ణ, చైర్ పర్సన్ ఆధ్వర్యములో జరిగినది. ఈ సమావేశం లో ఈ క్రింది తీర్మానా లు తీసుకోవటం అయినది.



గర్భస్త లింగ నిర్ధారణ నేరమని ఇది చట్ట రీత్యా శిక్ష అర్హమైన నేరమని, లింగ వివక్షను నిర్మూలించటానికి పిసిపిఎన్డిటి చట్టాన్ని కఠినముగా అమలు చేయవలెను. స్కానింగ్ సెంటర్స్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందాలని, అవసరమైన రికార్డ్స్ నిర్వహించా లని, చట్టానికి విరుద్ధముగా వ్యహరించితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. స్కానింగ్ చార్జ్ ధర పట్టిక హాస్పిటల్ లో తప్పనిసరిగా ఉండాలి. ఎవరైనా స్కానింగ్ చేసి పుట్టబోయే బిడ్డ లింగం గురించి చెపుతున్నారా అని డెకొయ్ ఆపరేషన్ ప్రతి నెల చేయు చున్నాము. రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ ఆదేశాలు మేరకు ప్రతి స్కానింగ్ సెంటర్ లో టోల్ ఫ్రీ నంబర్ 18002332447 ను స్పష్టం గా కనిపించే విధముగా ప్రదర్శించాలని తెలియజేయడమైనది. ఈ సమావేశం లో కమిటీ సభ్యులు బోళ్ళసాంబిరెడ్డి , తెనాలి జిల్లా ఆసుపత్రి నుండి డా. సంపూర్ణ , డా. కె. సురేష్ , డా. వినీల్ , మరియు రెడ్ క్రాస్ నుండి పెనుగొండ వెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణమూర్తి , ముమ్మనేని భానుమతి , డాక్టర్ నక్కా సుశాన్ గ్రేస్, డాక్టర్ చందోలు విజేత,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆళ్లగడ్డ వెంకటేశ్వరరావు,ఆరోగ్య విస్తరణాదికారి అందె బాలచంద్రమోళి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: రహదారుల వెంబడి, వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు: తహసీల్దార్ గోపాలకృష్ణ.

తెనాలి జులై22(ప్రభాతవార్త): తెనాలి మండల పరిధిలోని కటేవరం గ్రామం వంతెన సమీపంలో, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడవేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడ తాయని హెచ్చరిస్తూ, గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఉన్న ప్రదేశంలోనే నాగేశ్వరరావు అనే వ్యక్తి ఆటోలో వినియోగించిన కొబ్బరి బొండాలను పడవేసిన విషయాన్ని విధుల్లో ఉన్న సిబ్బంది గుర్తించి నా దృష్టికి తీసుకువచ్చారు.సమాచారం అందుకున్న వెంటనే నేను సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించాను. అనంతరం సదరు వ్యక్తిని, సంబంధిత ఆటో డ్రైవర్‌ను వెంట తీసుకొని మున్సిపాలిటీ డంపింగ్ యార్డుకు వెళ్లి, అక్కడ కొబ్బరి బొండాల నుంచి సేంద్రీయ ఎరువు తయారుచేసే ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ప్రత్యక్షంగా చూపించాను. నిరుపయోగంగా భావించి రహదారుల వెంబడి



పడవేసే కొబ్బరి బొండాలు శాస్త్రీయ విధానంలో రైతులకు ఉపయోగపడే సేంద్రీయ ఎరువుగా మారుతాయని వివరించి, ఇకపై కొబ్బరి బొండాలను తప్పనిసరిగా ప్రాసెసింగ్ కేంద్రానికే తరలించాలని సూచించాను.అదేవిధంగా, ఈ విషయాన్ని తెనాలి పరిధిలోని ఆటో డ్రైవర్లకు తెలియజేసి, కొబ్బరి బొండాలను రహదారుల వెంబడి, కాలువ గట్లపై లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా నేరుగా ప్రాసెసింగ్ కేంద్రానికే తరలించేలా అవగాహన కల్పించాలని సంబంధిత ఆటో డ్రైవర్‌ను ఆదేశించాను.ఇటీవలి కాలంలో వి.ఎస్.ఆర్. కళాశాల నుండి నందివెలుగు వరకు ప్రధాన రహదారి వెంబడి, రహదారి మార్జిన్లలో (రోడ్ల ప్రక్కన), కాలువ గట్లపై కొబ్బరి బొండాలు మరియు ఇతర వ్యర్థాలను అక్రమంగా పడవేస్తున్న ఘటనలు గమనిస్తున్నాము. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాము. నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాము. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడు, ప్రతి వ్యాపారి, ప్రతి రవాణాదారుడి సామాజిక బాధ్యత. కొబ్బరి బొండాల వ్యాపారులు తమ వ్యాపార నిర్వహణతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల కూడా బాధ్యతతో వ్యవహరించి, వ్యర్థాలను నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే పారవేయాలి. రహదారుల వెంబడి, కాలువ గట్లపై, ప్రభుత్వ స్థలాలు లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో కొబ్బరి బొండాలు, ఇతర వ్యర్థాలను పడవేసే వారిపై కేవలం జరిమానాలు విధించడం మాత్రమే కాకుండా, భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 152తో పాటు ఇతర వర్తించే చట్టాల ప్రకారం కూడా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

## పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించిన మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్:

తెనాలి మున్సిపాలిటీ జులై22(ప్రభాతవార్త): మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు బుధవారం పట్టణం లోని 24 వార్డు లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ యేసు బాబు తో కలిసి పరిశీలించారు.మారిస్ పేట, రెండు గట్ల మధ్య ,శాంతినగర్ తదితర ప్రాంతాల్లో కాలువలలో కార్మికుల చేత, పాప్ కార్ట్ తో పూడిక



తీయించారు. రోడ్లు వెంబడి మురునీటి కాలువలకు ఇరు ప్రక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగింప చేశారు. కాలువలలో చెత్తా ఇతర వ్యర్థాలు వేయకుండా చూడాలని నగర దీపికలను ఆదేశించారు. తడి చెత్త పొడి చెత్త సేకరణ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలువలలో తీసిన పూడిక మట్టిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డులలో ఎక్కడ చెత్త నిల్వలు లేకుండా చూడాలని శానిటరీ సెక్రటరీలకు సూచించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మురుగు నీటిపారుదులకు ఆటంకం లేకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాలువలలో పూడికలు తొలగించుట, కాలువలు వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలను శుభ్రం చేయించుట వంటి పనులను చేయిస్తున్నట్లు చెప్పారు. కాలువలలో చెత్త ఇతర వ్యర్థాలు వేయకుండా పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు. చెత్త కాలువలో వేయడం వల్ల కాలువల్లో మురుగు నీటిపారుదలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. వర్షాకాలంలో దోమల అభివృద్ధి పెరిగే అవకాశం ఉన్నది అన్న ఖాళీ స్థలాల యజమానులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో ఖాళీగా ఉన్న గాబులు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. సానిటరీ ఇన్స్పెక్టర్లు, సెక్రెటరీ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్ ,శానిటరీ సెక్రటరీలు,నగరదీపికలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అవగాహన కార్యక్రమం

గుంటూరు క్రైమ్, జులై22,ప్రభాతవార్త: మహిళలు,బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు,ఈవ్ టీజింగ్,సైబర్ వేధింపులు,స్టాకింగ్ వంటి నేరాల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "శక్తి టీమ్స్" విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. గుంటూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు,మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఏఎస్ఐ బేబీ రాణి నాయకత్వంలోని శక్తి టీమ్స్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు,కళాశాలలు,విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. విద్యార్థినులకు మంచి స్పర్శ,చెడు స్పర్శ గురించి వివరించడంతో పాటు,ఈవ్ టీజింగ్,లైంగిక వేధింపులు,స్టాకింగ్, సోషల్ మీడియా,మొబైల్ ఫోన్‌ల ద్వారా జరిగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అనుమానాస్పద వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని,ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.అదేవిధంగా మహిళలు,బాలికల రక్షణ కోసం అందుబాటులో ఉన్న డయల్112 అత్యవసర సేవ,మహిళల హెల్ప్‌లైన్181,చైల్డ్ హెల్ప్‌లైన్1098 సేవలను అవసరమైన సమయంలో వినియోగించుకోవాలని వివరించారు.మహిళలు,బాలికల భద్రతకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

## బృందావన్ గార్డెన్స్ రోడ్ విస్తరణ పనుల జాప్యం

గుంటూరు కార్పొరేషన్, జులై 22 ( ప్రభాత వార్త ) : బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణ పనుల్లో ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారుల పై నగర కమిషనర్ మయూర్ అశోక్ ఆగ్రహం



వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల సమన్వయ లోపం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రానున్న వారం రోజుల్లో పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్ విస్తరణ పనులను, ఉద్యోగ నగర్, కొరెటెపాడు పార్క్ లను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణ పనులను ప్రత్యక్షయంగా పరిశీలించి, పనుల్లో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయం లోపంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఈ పనులను ఇంకా ఎన్నాళ్ళు సాగదీస్తారని అధికారులను నిలదీశారు. ప్రణాళికాబద్ధంగా ఒక్కో పోర్షన్ ఆధారంగా నిర్దేశిత టార్గెట్‌తో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణలో అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను షిఫ్ట్ చేసేందుకు సంబంధిత ఎలక్ట్రికల్ విభాగానికి ఇప్పటికే కార్పొరేషన్ నుండి నగదు చెల్లించామని, కాబట్టి ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. రోడ్డు ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ సెక్షన్‌దేనని గుర్తు చేస్తూ, రైట్ ఆఫ్ వే పరిధిలోకి వచ్చే విస్తరణ మార్గంలో ఏ ఒక్క ఫ్లెక్సీ, సైన్ బోర్డు కానీ, ఇతర అక్రమ ఆక్రమణలు కానీ ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు.

## గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ

### ఎస్ఆర్ఎం సీఆర్డీఏ సంయుక్త నిర్వహణ... ఇప్పటికే 3316 మందికి శిక్షణ పూర్తి

మంగళగిరి, జూలై 22, ప్రభాతవార్త : గ్రామీణ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణను అందించి వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలన్న ప్రభుత్వ ఆశయానికి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సంపూర్ణ సహకారం అందిస్తోంది. రాజధాని పరిధిలోని 29 గ్రామాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధప్రాంతాలకు చెందిన మహిళలు, నిరుద్యోగ యువతీ యువకులకు వృత్తి పరమైన శిక్షణతో పాటు వారు ఆసక్తి చూపుతున్న



రంగాల్లో సమగ్రమైన శిక్షణను అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇదే తరహాలో సీఆర్డీఏ కూడా రాజధాని పరిధిలోని నిరుద్యోగ యువతతో పాటు గతంలో వ్యవసాయంపై ఆధార పడి ప్రస్తుతం ఖాళీగా ఉంటోన్న మహిళలకు తాజాగా ఉపాధి రంగాల్లో ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం



చేసింది. ఈ నేపథ్యంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సహకారం అందిపుచ్చుకున్న సీఆర్డీఏ ఆరు నెలల నుంచి యూనివర్సిటీ ప్రాంగణంలోనే నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభించింది. యువతకు డిజిటల్ మార్కెటింగ్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్, సైబర్ సెక్యూరిటీ వంటి కంప్యూటర్ కోర్సులతో పాటు జీఎస్టీ , టాలీ, ఎఫ్ఎన్ఎస్ వంటి ప్రోగ్రామ్లలో ప్రత్యేక కంప్యూటర్ శిక్షణ అందిస్తోంది. ఒక్కో కోర్సు శిక్షణకు నిర్ణీత కాలపరిమితిని విధించి ప్రత్యేక శిక్షకుల ద్వారా తరగతులు నిర్వహిస్తోంది.

**అనుభవం ఉన్న శిక్షకులు:** ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అనుభవం ఉన్న శిక్షకులను (ట్రైనర్లు) నియమించింది. మొదటి రెండు బ్యాచ్లో 3316 మంది యువతీ యువకులు శిక్షణ తీసుకున్నారు. వీరి ఆసక్తికి అనుగుణంగా, అర్థమయ్యే రీతిలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ శిక్షణ అందిస్తున్నారు. మరో వైపు సీఆర్డీఏ అధికారులు సైతం వివిధ రంగాల్లో అనుభవం ఉన్న నిపుణులను పంపి నైపుణ్య శిక్షణకు సహకారం అందిస్తున్నారు. రాజధాని గ్రామాల్లోని యువత వీలేజ్ ఫెలిసిటేటర్ల ద్వారా సీఆర్డీఏ వెబ్సైట్లో తమ పేర్లను నమోదు చేసుకుని శిక్షణకు ఎంపికై తరగతులకు హాజరవుతున్నారు. ఇందు కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిన వర్సిటీ యాజమాన్యం ఆయా రంగాల్లో అనుభవం ఉన్న నిపుణులను, ప్రత్యేక శిక్షకులను ఏర్పాటు చేసింది. జనవరి నెలలో ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమం ఇప్పటికే రెండు బ్యాచ్లను పూర్తి చేసింది. జులై 12 నాటికి మొత్తం 3316 మంది యువతీయువకులు శిక్షణ పూర్తి చేసుకుని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. వీరిలో పలువురు ఉద్యోగాల్లోచేరి విధులకు హాజరవుతున్నారు.

**వరల్డ్ బ్యాంక్ బృందం పరిశీలన:** ఇక్కడ జరుగుతున్న వైపుణ్య శిక్షణా తరగతులకు ఇటీవల వరల్డ్ బ్యాంక్ బృందం పరిశీలించింది. వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు శిక్షణ తీసుకుంటున్న మహిళల అభిప్రాయాలను, వారు నేర్చుకుంటున్న అంశాలను నమోదు వేసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.

**గ్రామాలకు వర్శిటీ బస్సులు:** ప్రతి రోజూ నైపుణ్య అభివృద్ధి తరగతులకు హాజరయ్యే వారి కోసం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసింది. రాజధాని లోని కృష్ణాయపాలెం, పెనుమాక, ఉండవల్లి, నులకపేట, నిడమర్రు, కుర గల్లు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి, రాయపూడి, తుళ్లూరు, పరిమి. నీరుకొండ, నవులూరు, యర్రవారం, మంగళగిరిలకు ఉదయమే చేరుకునే అన్నులు వందల మంది యువతీయువకులను 10 గంటలకల్లా యూని వర్సిటీకి తీసుకొస్తున్నాయి. సాయంత్రం గంటలకు గ్రామాలకు చేరుకుం టున్నాయి. ఈ బస్సులన్నీ ఏసీ బస్సులే, బస్సుకో సూపర్వైజర్ను ఏర్పాటు చేసి యువతను శిక్షణ తరగతులకు చేరుస్తున్నారు.

**శిక్షణ చాలా బాగుంది: జీ స్రవంతి. యర్రబాలెం, మంగిరిగిరి మండలం**

రెండు నెలలుగా ఇక్కడ బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నా. శిక్షణ ఎంతో ఆసక్తిగా కొనసాగుతుంది. మహిళల సౌందర్యాన్ని పెంచుకునే వివిధ రకాల కోర్సులను క్షుణ్ణంగా వివరిస్తున్నారు. ఈ తరహా శిక్షణ ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి, అందుకు సహకరిస్తున్న ఎస్ఎల్ఎం యూనివర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు...

**ప్రభుత్వ నిర్ణయానికి పూర్తి సహకారం: ప్రొఫెసర్ సతీష్ కుమార్, వైస్ ఛాన్సలర్, ఎస్ఆర్ఎం వర్సిటీ**

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించి వారి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలన్న ప్రభుత్వ నిర్ణయానికి పూర్తిగా సహకారం అందిస్తున్నాం. వృత్తిపరమైన నైపుణ్య శిక్షణతో కంప్యూటర్, టీవీ మెకానిజం కోర్సుల్లో యువకులకు అనుభజ్ఞులైన డ్రైవర్లతో శిక్షణ అందిస్తున్నాం. తరగతులు సజావుగా సాగుతున్నాయి. వీరికి అవసరమైన రవాణా, భోజన సదుపాయాలను కూడా కల్పించాము.

**ఆటంకాలు లేకుండా శిక్షణ : డాక్టర్ వినాయక్ కల్లూరి, రిజిస్ట్రార్, ఎస్ఆర్ఎం వర్సిటీ.**

ప్రభుత్వం సూచించిన విధంగా గ్రామీణ యువతీయువకులకు, ప్రభుత్వ రంగాల్లో పనిచేసే వివిధ కేటగిరీల ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించే విషయంలో ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిత్యం పర్యవేక్షణ కొనసాగుతుంది. శిక్షణ కోసం వివిధ జిల్లాల నుంచి వచ్చే మహిళల కోసం సురక్షితమైన వసతి సదుపాయాలను కల్పించాం.

**ప్రస్తుతం 3వ బ్యాచ్: చాల మురుగన్, స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ హెడ్ ఎస్ఆర్ఎం వర్సిటీ**

జనవరిలో ప్రారంభమైన నైపుణ్య శిక్షణ తరగతులు సజావుగా సాగుతున్నాయి. ఇప్పటి వరకూ 3316 మందికి శిక్షణ అందించాం. మరో 1116 మంది శిక్షణలో ఉన్నాను. తరగతులు నిర్వహణ కోసం మంది ట్రైనర్లను ఏర్పాటు చేశాం. గ్రామీణ మహిళలు ఎక్కువ మంది బ్యూటీషియన్ కోర్సులకు హాజరవు తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయంగా సెంటర్లు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధిని పొందుతున్నారు.

**డిజిటల్ మార్కెటింగ్లో శిక్షణ తీసుకున్నా: సాయి స్నిగ్ధ, మంగళగిరి**

నా పేరు సాయి స్నిగ్ధ. మాచి మంగళగిరి. రెండు వారాలుగా నైపుణ్య శిక్షణకు హాజరవుతున్నాను. డిజిటల్ మార్కెటింగ్లో చాలా మెళకువలు నేర్చుకున్నాను. ప్రాక్టికల్ ప్రజెంటేషన్ చేసే విధానంతో పాటు స్పీకింగ్ స్కిల్స్ ను డెవలప్ చేసుకున్నాను. థాంక్స్ టు సీఆర్డీఏ అండ్ ఎస్ఐ ఆర్ ఎం.

**ఇక్కడ శిక్షణ బాగుంది.: ఫణీంద్ర, తుర్గారు.**

నెల రోజులుగా వైపుణ్య శిక్షణకు హాజరవుతున్నాను. ఇక్కడ సైబర్ సెక్యూరిటీ అంశంలో కీలక సూత్రాలు నేర్చుకుంటున్నా ప్రైవర్లు సమగ్రంగా నేర్పుతున్నారు. టూల్స్, ఫైల్బల్స్ ఎలా ఉపయోగించాలో చెబుతున్నారు. మరో రెండు వారాల్లో నా శిక్షణ ముగు స్తుంది. ఆపైన ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభిస్తాను.

**ఆసక్తికి అనుగుణంగా శిక్షణ: వాసవి. కాస్మోటాలజిస్ట్**

బ్యూటీషియన్ కోర్సులు నేర్చుకోవడానికి ఎక్కువ మంది మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం 3వ బ్యాచ్లో 50 మందికి పైగా మహిళలు శిక్షణ పొందుతున్నారు. ఫేషియల్ మేకప్, డీ టాన్, నెయిల్ షేపింగ్, హెయిర్ స్టయిల్, త్రెడ్డింగ్ వంటి సౌందర్యాన్ని మెరుగు పర్చుకునే విషయాలను నేర్పుతున్నాము. ఇది మూడు నెలల ప్రోగ్రామ్, శిక్షణ పూర్తి చేసుకున్న వారు సర్టిఫికెట్ తీసుకుని సొంతంగా బ్యూటీ పార్లర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

## త్వరలో ముగియనున్న వాతావరణ ఆధారిత పంటల బీమా

ప్రత్తిపాడు, జూలై 22, ప్రభాతవార్త : ప్రత్తి మరియు అరటి పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకం ఈనెల 24వ తేదీతో ముగియనుందని గుంటూరు వ్యవసాయ శాఖ ఏడిఏ మోహన్రావు తెలిపారు. ఫిరంగిపురం మండలంలోని 113 తాళ్లూరు, ఫిరంగిపురం 2 రైతుసేవ కేంద్రాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ పాల్గొని మాట్లాడుతూ.. ప్రత్తి మరియు అరటి పంటలకు వాతావరణ ఆధారిత పంటల భీమా ఈనెల




24తో ముగుస్తుందన్నారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావంతో వర్షపాతం, అధిక టెంపరేచర్ వలన పంటలకు పంటల భీమా వర్తిస్తుందని వివరించారు. మండలంలోని రైతులందరు సిఎస్సి సెంటర్ల ద్వారా పంటల భీమా ప్రీమియంను చెల్లించాలని తెలిపారు. ప్రత్తి పంటకు రూ.1900లు,అరటి పంటకు రూ. 2750లు ప్రీమియం చెల్లించాలన్నారు. అలాగే మిరప పైరుకు ఈ నెల 31 వరకు రూ.2700లు,వరి పైరుకు వచ్చే నెల 15వ తేదీ వరకు రూ.800లు, మినుము పైరుకు రూ.200ల ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రత్తి పంట వేసిన రైతులు ఈ నెల 24వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి జె.వాసంతి మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే అపరాలు మరియు చిరుధాన్యాల పంటలు పండించటం ఎంతో శ్రేయస్కరమన్నారు. ప్రత్తి పంటలో కూడా మొక్కల మధ్య దూరాన్ని బాగా తగ్గించాలని దీనివల్ల అధిక మొక్కల వలన వర్షపాతం తక్కువైనప్పుడు కొంతవరకు దిగుబడి ఆశాజనకంగా వస్తుందని వెల్లడించారు. నీరు అధికముగా కావాల్సిన వరి, మొక్కజొన్న పైరులు సాగు చేయవద్దని సూచించారు. ఈ ఏడాది నుండి ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా మరియు డిఏపి ఎరువులను రైతులకు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్ లో ఎటువంటి ఎరువుల కొరత లేదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ సుభాని, కిరణ్ కుమార్ హకీమ్, ఇరు గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

23-7Pg5_23-7Pg5.qxd 22/Jul/26 10:51 PM Page 1



# దేశంలో ముగిసిన ప్రజాస్వామ్యం



## పార్లమెంటులో, వీధుల్లో అన్నీ అప్రజాస్వామిక పరిస్థితులే

## విపక్ష ఎంపీలు నల్లజెండాలతో పార్లమెంటు వద్ద ఆందోళన

**న్యూఢిల్లీ:** విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా నల్ల దుస్తులు ధరించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ముగిసిపోయిందని, పార్లమెంట్‌లోనూ, బయట వీధుల్లోనూ అప్రజాస్వామిక పరిస్థితులు నెలకొన్నాయని ఆమె ఆరోపించారు. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, యువత, విద్యార్థులకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశాలపై చర్చ జరగకుండా ప్రభుత్వం పదేపదే అడ్డుకుంటోందని విమర్శించారు. ప్రతిపక్ష నేతలకు సభలో మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారిక నివాసం లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద మంగళవారం కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ప్రస్తావిస్తూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైనవని ప్రియాంక అన్నారు. శాంతియుత నిరసనలో ఎలాంటి అప్రజాస్వామికత లేదని, కానీ పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలు, వీధుల్లో నిరసనకారులపై వ్యవహరిస్తున్న తీరు మాత్రం పూర్తిగా అప్రజాస్వామికమని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇతర ప్రతిపక్ష సభ్యులు లేచి మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ వారిని అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. సభాపతికూడా చర్చ జరగాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పడం ఆశ్చర్యకరమని, "ఇదేనా ప్రజాస్వామ్యం? ప్రజాస్వామ్యం ముగిసిపోయింది" అని ప్రియాంక వ్యాఖ్యానించారు.ఇదిలా ఉండగా, విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు ప్రదర్శించిన దౌర్జన్యాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్ వెలుపల ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు పాల్గొన్నారు.ప్రధానమంత్రి నివాసం వద్ద జరిగిన కాంగ్రెస్ నిరసన సందర్భంగా రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయంపై స్పందించిన ప్రియాంక, తమను అరెస్ట్ చేయడం పెద్ద విషయం కాదని అన్నారు. "మేము విద్యార్థులకు అండగా నిలబడి వారి గొంతుకను వినిపిస్తున్నాం. అసలు ప్రశ్న ఏమిటంటే విద్యార్థులపై జరిగినది సరైందా కాదా అని ప్రశ్నించారు.

దేశంలోని ప్రతి తల్లిదండ్రి, ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడు ఈ సమస్య ఎంత తీవ్రమైందో తెలుసునని ఆమె అన్నారు. విద్యార్థులు తమ హక్కులను మాత్రమే కోరుతున్నారని, ఎంతో కష్టపడి చదువుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే యువత భవిష్యత్తును ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆరోపించారు.ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై కూడా ప్రియాంక విమర్శలు చేశారు. దేశ యువత విద్య కోసం కేవలం రూ.1.4 లక్షల కోట్లు మాత్రమే కేటాయిస్తున్న ప్రభుత్వం, అదానీ, అంబానీ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తోందని ఆరోపించారు. రైతులకు, పేదలకు, విద్యార్థులకు ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయడం లేదని విమర్శించారు. మంగళవారం జరిగిన ఘటనలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తదితరులు ప్రధానమంత్రి నివాసం వద్ద ఆకస్మిక ధర్నా చేపట్టి మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అత్యంత భద్రత కలిగిన ప్రాంతంలో ఈ నిరసన జరగడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసనకారులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరినా వారు వెనక్కి తగ్గలేదు.దీంతో సాయంత్రం పోలీసులు బలవంతంగా రాహుల్ గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలను అదుపులోకి తీసుకున్నారు.

రాహుల్ గాంధీని మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి తరలించగా, ప్రియాంక గాంధీతో పాటు మరికొందరు ఎంపీలను మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ వారిని పోలీస్ స్టేషన్‌లో కలిశారు. విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, తమపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ అంశం ప్రస్తుతం దేశంలో అత్యంత కీలకమైన సమస్యగా ప్రతిపక్షం భావిస్తోందని, అందుకే లోక్‌సభ, రాజ్యసభల్లో దీనిపై సమగ్ర చర్చ జరిపి తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన శరద్ పవార్, సుప్రియా సూలే

# ప్రధాని మోడీతో పవార్, సుప్రియ భేటీ

## శరద్ ఎన్సీపి ఎన్డీయేలో చేరేందుకు రంగం సిద్ధం?

**న్యూఢిల్లీ,జులై 22:** ఒకవైపు నీట్ లీకేజీతో పాటు పలు అంశాలపై పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు తీవ్ర స్థాయిలో నిరసనలు, నినాదాలతో హోరెత్తిస్తుంటే మరోవైపు ప్రధాని కార్యాలయంలో జరిగిన ఒక కీలక భేటీ దేశ రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలేలు ప్రధాని నరేంద్ర మోడీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోల్లో ప్రధాని మోడీ స్వయంగా శరద్ పవార్‌ను చిరునవ్వుతో చేతిని పట్టుకుని ఆహ్వానించడం, ఇద్దరు నాయకులు ఎంతోసంతోషంగా నవ్వుకుంటూ చర్చించుకోవడం కనిపించింది. రైతుల సమస్యలు, నీటిపారుదల రంగానికి సంబంధించిన పలు అంశాలపై పవార్ ప్రధానికి వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ సమయంలో 8 మంది ఎంపీలు ఉన్న శరద్ పవార్ పార్టీ మద్దతు ప్రభుత్వానికి చాలా కీలకంగా మారింది. దేశవ్యాప్తంగా 50 శాతం సీట్ల పెంపుపై ప్రభుత్వం లిఖిత పూర్వక హామీ ఇస్తే ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఇటీవలే సుప్రియా సూలే సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాల మధ్య శరద్ పవార్ పార్టీ ఎన్‌డిఎ కూటమిలో చేరుతుందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. మహారాష్ట్రలోని రెండు ఎన్సీపీ వర్గాలు (అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు) మళ్లీ విలీనమైతేనే ఎన్డీఎలో అధికారికంగా భాగస్వామ్యం కల్పిస్తామని, వ్యక్తిగతంగా లేదా విడివిడిగా చేర్చుకునే ఉద్దేశం లేదని బిజెపి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. విపక్ష ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడిని తీవ్రతరం చేసిన సమయంలోనే, ఆ కూటమిలోని కీలక నేత శరద్ పవార్ ప్రధానితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది.

# నిరాహార దీక్ష విరమించండి

## వాంగ్‌చుక్‌కు సిజెపి విజ్ఞప్తి

## ఆస్పత్రిలో విపక్ష ఎంపిల పరామర్శ

**న్యూఢిల్లీ, జులై 22:** పరీక్షల గందరగోళానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిజెపిచేస్తున్న నిరసనకు బలాన్నిచ్చిన సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను విరమించాలని బొద్దింక జనతా పార్టీ విజ్ఞప్తి చేసింది. "సోనమ్‌సార్‌కు సిజెపి విజ్ఞప్తి" అని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో సిజెపి పేర్కొంది. "అత్యంతగౌరవంతో, కృతజ్ఞతతో, దయచేసి మీ నిరాహార దీక్షను విరమించాలని తాము మిమ్మల్ని కోరుతున్నాము. మీ త్యాగం దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చింది. జులై 20న, యువత మీకు, ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రయాణించి వచ్చారు. ఈ పోరాటం ఏ ఒక్క వ్యక్తి కన్నా గొప్పదని, విద్యార్థులు న్యాయానికి అర్హులని మీరు నిరూపించారు. కానీ ప్రస్తుతం, మీరు మీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. మీ నిరాహార దీక్షతో ఈ పోరాటం ముగిసిపోదని మేము వాగ్దానం చేస్తున్నాము. పరీక్షల న్యాయం కోసం మాడిమాండ్లు నెరవేరే వరకు తాము నిరసనలను కొనసాగిస్తాము, ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్తాము. దీనిని కొనసాగించడానికి తాము చేయగలిగినదంతా చేస్తాము. తాము ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తాము" అని సిజెపి శపథం చేసింది.

**విపక్ష ఎంపిలు పరామర్శ**

గురుగ్రామ్‌లోని మెదాంత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్‌ను విపక్ష ఎంపిలు పరామర్శించారు. వాంగ్‌చుక్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి వివేక్ తంఖా, టిఎంసి రాజ్యసభ ఎంపి సాగరిక ఘోష్, సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ ఉన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో విద్యా రంగంలో జవాబుదారీతనం అంశాన్ని చేపడతామని ఎంపిలు ఈ సందర్భంగా వాంగ్‌చుక్‌కు హామీనిచ్చాయి.

# జడ్జిల రిటైర్మెంట్ వయసు 61యేళ్లకు పెంపు

## ఈ విషయాన్ని పరిశీలించండి: రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, జులై 22:** న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 61 యేళ్లకు పెంచే విషయాన్ని పరిశీలించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు కోరింది. దేశవ్యాప్తంగా జిల్లా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 యేళ్లకు ఏకరీతిగా పెంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ జరుపుతూ, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాన్ని జారీ చేసింది. "అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు (యుటిలు), తమ తమ అధికార పరిధిలోని హైకోర్టులతో సంప్రదించి ఈ విషయంపై ఒకనిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తున్నాము. ఒకవేళ వారు అంగీకరిస్తే, ఆ రాష్ట్రాల్లోని న్యాయాధికారులు 61 యేళ్ల వయస్సు వరకు సర్వీసులో కొనసాగడానికి అనుమతించబడతారు. అటువంటి కొనసాగింపు ఈ విచారణల తుది ఫలితానికి లోబడి ఉంటుంది" అని ధర్మాసనం ఆదేశించింది.

ఈ నిబంధన ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు 65యేళ్లు కాగా, హైకోర్టు న్యాయమూర్తులు 62 యేళ్ల వయస్సులో పదవీ విరమణ చేస్తారు. దేశవ్యాప్తంగా జిల్లా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 యేళ్లకు ఏకరీతిగా పెంచాలా వద్దా అనే ప్రధాన న్యాయపరమైన ప్రశ్నపై తుది తీర్పునకు ఈ మధ్యంతర ఏర్పాటు ఆటంకం కలిగించదని కూడా అది పేర్కొంది. "రాష్ట్రాలు లేదా హైకోర్టులు ఏ వైఖరి తీసుకున్నప్పటికీ, ప్రారంభంలోనే రూపొందించిన ఈ న్యాయపరమైన ప్రశ్నను ఈ కోర్టు స్వతంత్రంగా నిర్ణయిస్తుందని తాము స్పష్టం చేస్తున్నాము" అని ధర్మాసనం తెలిపింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తమ హైకోర్టులను సంప్రదించిన అనంతరం, రెండు వారాల్లోగా తమ వాదనను రికార్డు చేయాలని ఆదేశించింది.

## దేశానికి మీరు ఎంతో అవసరం..

# దీక్ష విరమించండి




## వాంగ్‌ఛుక్‌ను కలిసిన అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ,జులై 22:** ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను దీక్ష విరమించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే. ఈ మేరకు బుధవారం తన సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. దేశానికి సోనమ్ వాంగ్‌చుక్ అవసమరమని, అందువల్ల ఆయన దీక్ష విరమించాలని కోరారు. ఆయన ఆరోగ్యం ఇంకా క్షీణిస్తుండటంపై అభిజీత్ ఆందోళన వ్యక్తంచేశారు. సోనమ్ వాంగ్‌చుక్ తన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, దీక్ష విరమించాలని కోరారు. దేశానికి ఆయన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన కొనసాగిస్తామన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత ఆయన దీక్ష విరమించాలని అభిజీత్ దీప్కే కోరడం ఇదే మొదటిసారి. సోనమ్ ఆరోగ్యాన్ని ఇంకా ప్రమాదంలోకి నెట్టడం తమకు ఇష్టం లేదన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ దాదాపు 24 రోజులుగా వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

ఆయనను ఆస్పత్రికి తరలించినప్పటికీ అక్కడ కూడా దీక్ష చేస్తున్నారు. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు నీట్ పేపర్ లీకేజ్, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి అంశాల్లో సిజెపితో చర్చలకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా తెలిపారు. ఈ విషయంలో సిజెపి నేతలకు మద్దతు లభిస్తోంది. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఉద్యమకారులు కూడా చర్చలకు సిద్ధంగానే ఉన్నారు.

# ఆడబిడ్డల బట్టలు చించేస్తారా!

## లోక్‌సభలో ఎంపి అఖిలేష్ యాదవ్ ఫైర్



**న్యూఢిల్లీ,జులై 22:** నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల అంశం కాంగ్రెస్, బిజెపి లేదా సమాజ్ వాదీ పార్టీ ఇళ్లకు పరిమితమైనది కాదని, దేశంలోని కోట్లమంది విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన స్పష్టం చేశారు. పేపర్ లీకేజీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అఖిలేష్ డిమాండ్ చేశారు. సభలో ప్రతిపక్షాల గొంతుకను సరిగ్గా వినకపోతే, రోడ్లపైకి వచ్చి పోరాడటంతప్ప మరోమార్గం ఉండదని హెచ్చరించారు. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, మహిళా విద్యార్థినులను ఈడ్చుకెళ్లడం వంటి అమానవీయ చర్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థుల కోసం తామందరం పోరాడుతున్నామని, వాళ్ల సమస్యలు వినకపోతే ఇలాంటి పరిణామాలే సంభవిస్తాయని అఖిలేష్ పేర్కొన్నారు. లాఠీఛార్జీ చేయడాన్ని తప్పుపట్టారాయాన. తమ గొంతుకను వినిపించడానికి రోడ్డెక్కిన విద్యార్థుల కాళ్లు చేతులు విరగ్గొట్టారని, తలలు పగులగొట్టారని గుర్తు చేశారు. ఆడపిల్లల బట్టలు చింపారని ఆవేదన వ్యక్తం చేశారు. అలా మీరు చేస్తారా అని స్పీకర్ ను ఉద్దేశించి నిలదీశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే తాము లోక్‌కల్యాణ్ మార్గ్ వద్ద బైఠాయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ సభ్యుడు కెసి వేణుగోపాల్‌కు ఎక్కువ సమయం పాటు మాట్లాడే అవకాశం ఇవ్వడం పట్ల అఖిలేష్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూర్చున్న వైపు వేలెత్తి చూపుతూ వారితో ఏవైనా లోపాయకారి ఒప్పందాలు కుదుర్చుకున్నారా అని స్పీకర్‌ను ప్రశ్నించారు. తమకు అవకాశం ఇవ్వాలంటూ పదే పదే అడుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా కాంగ్రెస్ ఎంపిలతో మాట్లాడించడం సమంజసం కాదని చెప్పారు.

# ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా రూ.3.6 లక్షలకోట్లు వ్యయం

## ప్రతినిధుల సభలో రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ నివేదిక



**వాషింగ్టన్, జులై 22:** ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక చర్యల కోసం అమెరికాకు అక్షరాలా 37.5 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 3.6 లక్షల కోట్లు ఖర్చయిందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్ వెల్లడించారు. యుద్ధాన్ని కొనసాగించేందుకు, క్షీణిస్తున్న వనరులను తిరిగి సమకూర్చుకునేందుకు మరిన్ని అత్యవసర నిధులు కావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో ఆయన ఈ వివరాలను చట్టసభ సభ్యులకు అందించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ ఎదుట జరిగిన విచారణలో హెగ్‌సెత్ ఈ నూతన అంచనాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఆలోపు అయ్యే ఖర్చులనుకూడా కలుపుకుని ఈ అంచనాను రూపొందించారు. గతంలో మే, జూన్ నెలల్లో ఈ వ్యయం సుమారు 29 నుంచి 30 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యుద్ధ కార్యకలాపాల కోసం సుమారు 67బిలియన్ డాలర్ల అదనపురక్షణ నిధులను కేటాయించాలని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌తో కలిసి హెగ్‌సెత్ సెనేట్‌ను అభ్యర్థించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈఘర్షణ, ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ విఫలం కావడంతో మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఇరుపక్షాల మధ్య ప్రతిరోజూ దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును బలహీనపరిచే లక్ష్యంగా అమెరికా దాడులు సాగుతున్నాయి. ఈ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు అమెరికాలో గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ ఘర్షణలో ఇప్పటివరకు 17 నుంచి 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని, వంద మందికి పైగా గాయపడ్డారని పెంటగాన్ వెల్లడించింది.గాయపడినవారిలో చాలామంది తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. యుద్ధ వ్యూహం, కాలపరిమితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఇరు పార్టీల చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ యుద్ధం వల్ల కలుగుతున్న ఆర్థిక, మానవ నష్టాన్ని డెమొక్రాట్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. అత్యవసర నిధులు వెంటనే మంజూరు చేయకపోతే, సైనిక శిక్షణను తగ్గించాల్సి వస్తుందని, పరికరాల నిర్వహణ దెబ్బతిని దేశ రక్షణ సంసిద్ధతపై ప్రభావం పడుతుందని హెగ్‌సెత్ హెచ్చరించారు.

## నల్లదుస్తులతో పార్లమెంటుకు

# ఇండియా కూటమి ఎంపిలు

**న్యూఢిల్లీ,జులై 22:** ప్రధాని అధికారిక నివాసం వద్ద మంగళవారం జరిగిన హైడ్రామా తర్వాత రెండోరోజు బుధవారం కూడా ఇండియా కూటమి ఎంపీలు తమ నిరసనను తీవ్రతరం చేశారు. పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ఎంపీలందరూ నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు చేరుకున్నారు. పార్లమెంట్ వెలుపల గుమిగూడిన విపక్ష నేతలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన చలో సంసద్ మార్చ్‌కు మద్దతుగా నిన్న విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ క్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సహా పలువురు ఇండియా కూటమి నేతలు ప్రధాని నివాసం వద్ద నిరసనకు యత్నించారు. పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని వ్యాన్లు, బస్సుల్లో తరలించారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది.

ఈ అరెస్టులు, పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తూ విపక్ష ఎంపీలు నేడు నల్ల దుస్తుల్లో పార్లమెంట్‌కు వచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ సహా పలు పార్టీల ఎంపీలు మకర ద్వార్ వద్ద నిలబడి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ నిన్న ప్రతిపక్ష నేతను సిగ్గులేకుండా అరెస్ట్ చేసి, గాయపరిచిన తీరు దారుణం. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనం. రాజ్యాంగం ఉనికిలో లేదు. ఈ ప్రభుత్వంతో శాంతియుతంగా పోరాడటమే మా ముందున్న ఏకైక మార్గమని తీవ్రంగా విమర్శించారు.

# సంక్షిప్త వార్తలు

## టిఎంసి ఎంపి కల్యాణ్‌బెనర్జీ లోక్‌సభనుంచి సస్పెన్షన్



**న్యూఢిల్లీ,జులై 22:** లోక్‌సభ సమావేశాల సందర్భంగా మహిళా ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో టిఎంసి పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై సస్పెన్షన్ వేటుపడింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి కల్యాణ్ బెనర్జీని సస్పెండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ వాయిదా పడిన తర్వాత టిఎంసి ఎంపీ కల్యాణ్ బెనర్జీకి.. మాజీ టిఎంసి సభ్యులు కకోలి ఘోష్ దస్తీదార్, శతాబ్ది రాయ్, మితాలి బాగ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కల్యాణ్ బెనర్జీ తమను ఉద్దేశించి అసభ్యకరమైన భాష వాడారని, దూషించారని ఆరోపిస్తూ సదరు మహిళా ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## సాయుధబలగాల్లో అగ్నివీర్‌లకు 50% రిజర్వేషన్

**న్యూఢిల్లీ,జులై 22:** కేంద్ర సాయుధ బలగాల్లోకి మాజీ అగ్నివీరులను పరీక్ష లేకుండానే తీసుకోవాలని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. సాధారణంగా బలగాల్లోకి ఎంపిక కోసం నిర్వహించే ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ వంటి పరీక్షలు వీరు రాయాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు ఉన్న 10 శాతం ఉన్న రిజర్వేషన్ 50 శాతానికి పెంచడం విశేషం. నాలుగేండ్ల పదవీకాలం పూర్తయ్యాక అగ్నిపథ్ పథకం నుంచి బయటకు వచ్చే సైనికులకు మరొకసారి సాయుధ బలగాల్లో ఉపాధి లభించనుంది.

## నెతన్యాహు అరెస్టుపై వెనక్కి తగ్గిన మమ్‌దానీ

**న్యూయార్కు, జులై 22:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు న్యూయార్క్ వస్తే అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) వారెంట్ ఆధారంగా అరెస్ట్ చేస్తానన్న ఎన్నికల హామీ నుంచి న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మామ్దానీ వెనక్కి తగ్గారు. నగర పరిపాలనా రంగానికి అటువంటి అరెస్టులు చేసే స్వతంత్ర చట్టపరమైన అధికారం లేదని న్యాయ సమీక్షలో తేలడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

## సౌదీ అణు ఒప్పందానికి ట్రంప్ ఆమోదం



**వాషింగ్టన్, జులై 22:** పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సౌదీ అరేబియాతో అత్యంత ప్రాధాన్యమున్న 30 యేళ్ల పౌర అణు ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ఆమోదంతెలిపారు. ఈచారిత్రక ఒప్పందం ద్వారా సౌదీ అరేబియా భూభాగంలోనే యూరేనియం శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశం లభిస్తుంది. వాషింగ్టన్, రియాద్ సంయుక్తంగా నిర్వహించే అధ్యయనంలో సాధ్యమేనని తేలితే, అమెరికన్ కంపెనీలు ఈ శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తాయి. తద్వారా విదేశీ పోటీదారులను పక్కనపెట్టి, సౌదీ అణు మౌలిక సదుపాయాల నిర్మాణంలో అమెరికా సంస్థలు పదిలమైన స్థానాన్ని దక్కించుకోవడమే కాకుండా వేల కోట్ల డాలర్ల వ్యాపార ఒప్పందాలను పొందుతాయి.

## ఉగ్రకాల్పుల్లో జవాను మృతి, మరొకరికి తీవ్రగాయాలు



**శ్రీనగర్,జులై 22:** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక జవాన్ మరణించగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్–కోకెర్‌నాగ్ రోడ్డు మార్గంలో జరిగింది. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఒజి)కి చెందిన ఇద్దరు జవాన్లు బుధవారం ఉదయం అనంత్‌నాగ్–కోకెర్‌నాగ్ రోడ్డులో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన తీవ్రవాదులు ఈ జవాన్లపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన ఇతర భద్రతా సిబ్బంది వెంటనే వారిని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆ ఇద్దరిలో తీవ్ర గాయాల కారణంగా ఒక జవాన్ అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

# అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో ఆణిముత్యం నల్లపురెడ్డి శ్రీచరణి

## ఏపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి



టీమిండియా మహిళా క్రికెటర్ నల్లపురెడ్డి శ్రీచరణిని సత్కరిస్తున్న జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి

**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి భారత క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించిన ప్రతిభావంతులైన క్రీడాకారులు రావడం మొత్తం విద్యుత్ కుటుంబానికే గర్వకారణమని ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (ఏపి జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు (ఏపి ఎస్ఈబి)లో ఉద్యోగిగా పనిచేసిన మొహమ్మద్ అజీజుద్దీన్ కుమారుడిగా భారత పురుషుల క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించిన మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజారుద్దీన్ దేశానికి విశిష్ట సేవలు అందించారన్నారు. నేడు రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపిపి) ఉద్యోగి చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె నల్లపురెడ్డి శ్రీచరణి భారత మహిళల క్రికెట్ జట్టులో స్థానం సంపాదించి దేశం తరఫున రాణించడం విద్యుత్ రంగ చరిత్రలో మరో గర్వించదగ్గ విషయం అని ఆమె అన్నారు. బుధవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో ఏపి జెన్‌కో ఆధ్వర్యంలో భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు నల్లపు రెడ్డి శ్రీచరణి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ, భారత పురుషుల జట్టులో మొహమ్మద్ అజారుద్దీన్, మహిళల జట్టులో నల్లపురెడ్డి శ్రీచరణి వంటి క్రీడాకారులు విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి దేశానికి ప్రాతినిధ్యం వహించడం ప్రతి విద్యుత్ ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాల నుంచి భారత క్రికెట్‌కు ఇద్దరు అంతర్జాతీయ క్రీడాకారులు రావడం విద్యుత్ శాఖకు విశేష గౌరవాన్ని తీసుకువచ్చిందని ఆమె పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా నుంచి భారత మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికైన తొలి మహిళా క్రికెటర్లలో ఒకరిగా నిలిచిన శ్రీచరణి, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా కృషి, పట్టుదల, ప్రతిభ ఉంటే అంతర్జాతీయ స్థాయికి చేరుకోవచ్చని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ రంగ ఉద్యోగుల కుటుంబాలలోని పిల్లలు విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో మరెన్నో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, నల్లపురెడ్డి శ్రీచరణి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి, ఆంధ్ర ప్రదేశ్, విద్యుత్ కుటుంబానికి మరింత కీర్తి తీసుకురావాలని జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మాట్లాడుతూ, తనతండ్రి పని చేస్తున్న సంస్థలో తనకు జరిగిన ఈ సన్మానం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరుగబోయే క్రికెట్ పోటీల్లో మరింత మెరుగైన ప్రతిభను కనబరుస్తానని ఆమె ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచరణి కుటుంబ సభ్యులతో పాటు ఏపి జెన్‌కో డైరెక్టర్లు ఉషా, సుజయ్ కుమార్, అశోక్ కుమార్ రెడ్డి, ఏపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపి ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఎవికె భాస్కర్, జెవి రావు,




# కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుపతిలో నిరసన

**తిరుపతి, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** నీట్ పరీక్షల్లో అక్రమార్కులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపి, లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రియాంక గాంధీతో బాటు ఆ పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగితే వారిని బలవంతంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తిరుపతిలో నిరసన వ్యక్తం చేశారు. అణచివేయాలని చూస్తే మరింతగా ఉద్యమాలు విస్తరిస్తాయన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రధాని ఇంటి ముందు బైఠాయించడం ఇదే తొలిసారి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఉద్యమాలు తీవ్రతరం అవుతాయని కాంగ్రెస్ తిరుపతి అధక్షుడు గౌడపేర చిట్టిబాబు హెచ్చరించారు. రాహుల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ఎంపిల అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ నేతలు తిరుపతిలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ముందు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చిత్రపటం దగ్ధం చేశారు. ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురవం బాబు, తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకట నరసింహులు, కంభంపాటి మురళీకృష్ణ, తలప దామోదర్ రెడ్డి, రమేష్ రెడ్డి, దాసరి రత్నం, చిరంజీవి, కరీముల్లా, శ్రీనివాస్ గౌడ్, ఇళయరాజా, చిత్తూరు శివశంకర్, తవన్ కళ్యాణ్, శివకుమార్, గొడుగు చింత గోపి జ్యోతీశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల నిధులతో అంగన్‌వాడి భవనాలు



అంగన్‌వాడి భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్, జులై 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో పరిశ్రమల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వివరించారు. బుధవారం శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం బిసి కాలనీలో అంగన్‌వాడి భవనాన్ని, అలాగే తిరుమంజనం వారి కండ్రిగలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. వీటికి నిధులు హిందూస్తాన్ బెవరేజస్(కోకా కోలా) సియస్‌ఆర్ ప్రాజెక్టు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ పిల్లల అభివృద్ధి కోసం కోకా కోలా యాజమాన్యం ముందుకు రావటం అభినందనీయం అన్నారు.

ఈ కార్యక్రమాల్లో కోకా కోలాకు చెందిన హిమాన్సు, జడ్‌పిటిసి వెంకట సుబ్బారెడ్డి, మార్కెటింగ్ కమిటి చైర్మన్ చెంచయ్య నాయుడు, మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, బత్తిరెడ్డి, తాటపర్తి రవీంద్రనాధ్ రెడ్డి, జగదీశ్వర రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కామేష్ యాదవ్, సుదర్శనం రెడ్డి, సిడిపిఓ శాంతి దుర్గ, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమలలో వేడుకగా మలయప్ప పల్లవోత్సవం



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో బుధవారం సాయంత్రం పల్లవోత్సవం వేడుకగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని ఈ పల్లవోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేసి మైసూర్ సంస్థానం తరపున మహారాణి, యువరాజు ఆతిథ్యాన్ని స్వీకరించారు. అనంతరం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు నరేష్, దర్శన్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా ద్రౌపదీ సమేత అర్జునుడు ఊరేగింపు



**శ్రీకాళహస్తి, జులై 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ద్రౌపదీ సమేత అర్జునుడు వధూవరులుగా పట్టణంలో బుధవారం దర్శనమిచ్చారు. ఆలయం వద్ద కన్నుల పండువగా అర్జునుడు ద్రౌపదీ వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఇఓ బికె వెంకటేశులు, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి, ఎంఎస్‌రెడ్డి, దేవస్థానం అధికారులు, ఉద్యోగస్తులు హాజరయ్యారు. బుధవారం ఉదయం స్వామి అమ్మవార్లు సప ్పర వాహనంలో దర్శనమిచ్చారు.

కళ్యాణ ముస్తాబుతోనే అర్జునసమేత ద్రౌపదీ అమ్మవారిని చక్కగా సప్పరంలో ప్రతిష్టించారు. ఆలయ సంప్రదాయంతో పూజారి పురుషోత్తంలు స్వామి అమ్మవార్లకు హారతులిచ్చి ఊరేగింపును ప్రారంభించారు.

మేళ తాళాలు పంబజోళ్ల మోతతో ఊరేగింపు జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా సాగింది. మధ్యాహ్నం ఆలయంలో రాజసూయ యాగం ఘట్టాన్ని భారతంలో చదివి భక్తులకు వినిపించారు. రాత్రి రాజసూయ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి వర్షం కురుస్తున్నా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవంను కన్నుల పండువగా నిర్వహించారు.

# పిల్లలే మన సంపద

- వారి చదువులే మనకు తరగని ఆస్తి
- విద్యా శాఖ మంత్రి నారా లోకేష్



**విజయవాడ, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పిల్లలే మన సంపద. వారి చదువులే మనకు తరగని ఆస్తి అని ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. 'తల్లికి వందనం' కార్యక్రమంలో లబ్దిదారులకు నిధులు జమ బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ 'ఎక్స్'లో తల్లివందనం లబ్దిదారులను అభినందిస్తూ పోస్టు చేసారు. "విద్యే మన రాష్ట్ర వెలకట్టలేని పెట్టుబడి. ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకూడదనేది మా కూటమి ప్రభుత్వం లక్ష్యం. అందుకే ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇచ్చే పథకం తల్లికి వందనం రూపొందించారు. వరుసగా రెండో ఏడాది తల్లికి వందనం నిధులు విద్యా సంవత్సరం ఆరంభంలోనే విడుదల చేసాం. తల్లికి వందనం ద్వారా ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థుల తల్లులు 42.70 లక్షల మంది బ్యాంకు ఖాతాల్లో రూ.10,120.78 కోట్లు జమ చేస్తున్నాం. ఈ ప్రక్రియ 24 వరకు కొనసాగుతుంది. పిల్లలను చదివించే ప్రతి తల్లికీ నా వందనం" అని మంత్రి

# తిరుమల సమాచారం



## శ్రీవారి సేవలో వ్యాసాశ్రమం పరిపూర్ణానందస్వామి

**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసం సందర్భంగా తిరుపతి జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి శిష్యులతో కలసి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ ఆలయ సాంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి ఆశీస్సులతో మంచి వర్షాలు కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.


## గోవిందరాజస్వామి ఆలయంలో 26న తులసి మహత్యం ఉత్సవం



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 26న పవిత్రమైన తులసి మహత్యం ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 4.30 గంటల నుండి 6.30 గంటల వరకు గోవిందరాజస్వామి గరుడవాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనభాగ్యం కల్పించనున్నారు. అనంతరం ఉదయం 6.30 గంటల నుండి 7.30 గంటల వరకు స్వామివారి ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అర్చకులు తులసి మహత్యం గురించి పురాణ పఠనం చేసి తులసీదేవి వైభవాన్ని భక్తులకు వివరిస్తారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఈ దివ్య ఉత్సవంలో పాల్గొని గోవిందరాజ స్వామి అనుగ్రహం పొందాలని టిటిడి భక్తులను ఆహ్వానిస్తోంది.


## మేఘావృతంతో ఆలయ ప్రాంగణం కనువిందు

**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** మారిన వాతావరణంతో శేషాచలంలోని తిరుమల ఆలయం పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. బుధవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు పావురాలు సందడి చేస్తూ భక్తులను ఆకట్టుకున్నాయి. గుంపుగా వచ్చిన పావురాలు ఆలయం ముందు విహరించడం ఆధ్యాత్మిక వాతావరణానికి మరింత అందాన్ని తీసుకువచ్చింది. భక్తులు తమ సెల్‌ఫోన్లలో ఈ అనుభూతిని చిత్రీకరించారు.



# తిరుమల ఘాట్‌లో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ

- రాతి విగ్రహం మాయంపై దిగ్భ్రాంతి



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లోని 7వ మైలువద్ద ఉన్న ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం క్రింది భాగంలోని ఒక అడుగు రాతివిగ్రహం చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన ఈ చోరీ సంఘటన అటు భక్తుల్లో ఇటు టిటిడిలో పెద్ద దుమారం రేపుతోంది. దేవుని విగ్రహాన్ని చోరీ చేసుకెళ్ళడం వెనుక ఉన్న పెద్ద తతంగం ఏమిటనేది ఇప్పుడు హిందూ వర్గాల్లో కలకలంగా మారింది. బుధవారం వేకువజామున 2గంటల ప్రాంతంలో 7వ మైలువద్ద ఒక అడుగు ఆంజనేయస్వామి రాతివిగ్రహం ఎలా చోరీ జరిగిందనేది ఇప్పుడు భక్తులను తీవ్రంగా కలచివేస్తోంది. ఆ సమయంలో భద్రత సిబ్బంది కూడా కునుకుతీస్తుంటారు. అలాంటిది మొదటి ఘాట్ రోడ్‌లో 7వమైలు వద్ద ఉన్న క్రింద అమర్చిన ఆంజనేయస్వామి రాతి విగ్రహాన్ని ఓ వ్యక్తి టవల్‌లో దాచి ఎత్తుకెళ్ళాడు. ఈ చోరీలో ఇద్దరు ముగ్గురు పాల్గొని ఉంటారనేది అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాతికేళ్ళుగా కొలువై ఉన్న స్వామివారి రాతి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోవడం తిరుమల చరిత్రలోనే ఒక పవిత్రతకు కళంకంగా భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి యాత్రికుల కదలికలుగానీ, భద్రత సిబ్బంది గానీ ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని విగ్రహాన్ని ఎత్తుకెళ్ళినట్లు ప్రాథమిక సమాచారం బట్టి తెలుస్తోంది. ఉదయం 5గంటల ప్రాంతంలో పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు, ఆలయ సిబ్బంది విగ్రహం ఉండాల్సిన స్థానంలో లేకపోవడాన్ని గమనించి తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ విభాగానికి, తిరుమల 2టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, టిటిడి సెక్యూరిటీ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తిరుమల పోలీసు యంత్రాంగం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి క్షేత్రస్థాయి ఆధారాలను సేకరించారు.

ఘాట్ రోడ్లలోని చెక్‌పోస్టులు, ఏడో మైలు పరిసర ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాల పుటేజీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఓ వ్యక్తి ఆలయంలోకి వెళ్లి విగ్రహంతో పరుగులు పెడుతున్న దృశ్యాలు వీడియోల్లో రికార్డు అయ్యాయి. అర్ధరాత్రి సమయంలో ఆ మార్గంలో వెళ్లిన వాహనాల వివరాలను, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించారు. పోలీసులు 10 బృందాలతో దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుని, ఆంజనేయస్వామి విగ్రహాన్ని యథాస్థానంలో పునఃప్రతిష్ఠిస్తామని టిటిడి అధికారులు తేల్చారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై పూర్తి స్థాయి నిజాలను వెలికితీస్తామని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుమల పోలీసులు తెలిపారు.

# నడకదారిలో భద్రతా లోపం

- 'పెద్ది' పోస్టర్‌తో తిరుమలకు అభిమాని



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చే అలిపిరి నడకమార్గంలో భద్రతా వైఫల్యం మరోసారి ప్రస్ఫుటమైంది. నడక మార్గాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేసే భద్రత సిబ్బంది కొన్ని సమయాల్లో భక్తుల వద్ద ఉంటున్న నిషేధిత పదార్థాలు, వస్తువులను గుర్తించడంలో విఫలమవుతున్నారు. తాజాగా బుధవారం ఏకంగా అలిపిరి నడక మార్గంలో మోకాళ్ళపర్వతం వద్ద 'పెద్ది' చిత్రం పోస్టర్‌ను ఓ మహిళ భక్తురాలు ప్రదర్శించడం దుమారం రేపింది.

కడప జిల్లాకు చెందిన యువతిగా టిటిడి విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. ఏకంగా యువతి పెద్ది పోస్టర్‌తో తిరుమలకు రావడం, మోకాళ్ళ పర్వతం వద్ద మెట్లపై ప్రదర్శించడం విమర్శలకు తావిచ్చింది.

కడప జిల్లాకు చెందిన సితార 'పెద్ది' చిత్రం విజయవంతం కావడంతో శ్రీవారికి మొక్కుతీర్చుకునేందుకు కాలినడకన బుధవారం మధ్యాహ్నం తిరుమలకు వస్తుంది. ఆమె కాలిబాట మార్గంలో 'పెద్ది' చిత్రం పోస్టర్‌ను పట్టుకుని రావడంతో కలకలం రేపింది. ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఆలయానికి సినిమా పోస్టర్ తేవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. టిటిడి భద్రత సిబ్బంది దీనిపై చర్యలు తీసుకోనున్నారు.

# నడకమార్గాల్లో 'కంచె' అసంభవమేనా!?

- హైకోర్టు ఆదేశించినా నిపుణుల కమిటీ విముఖత



**తిరుమల, జులై 22 ప్రభాతవార్త ప్రతినిధి:** 'గోవిందా... గోవింద' నామస్మరణతో దేశం నలుమూలల నుండి ఎంతో భక్తిభావంతో తిరుమలకు అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో నడచివచ్చే భక్తుల భద్రతకు టిటిడి చర్యలు తీసుకుంటున్నా వన్యప్రాణుల కట్టడి చేయలేక పోతుండటం చర్చనీయాంశంగా మారింది. నాలుగేళ్ళ క్రిందట అలిపిరి కాలినడక మార్గంలో చిరుతపులి ఓ బాలుడ్ని ఎత్తుకెళ్ళి తీవ్రంగా గాయపరచగా మరో బాలికపై దాడిచేసి చంపితిన్న విషాద ఘటన తెలిసిందే. ఇంకా పలు సందర్భాల్లో చిరుతపులులు ఘాట్‌రోడ్లలో వాహనదారులపై దాడిచేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలినడక మార్గంలో మెట్లకు ఇరువైపులా ఇనుపకంచే ఏర్పాటు చేస్తే భక్తులకు భద్రత కల్పించవచ్చనే సూచనలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఆ దిశగా కొందరు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ధర్మాసనం కూడా కంచె ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించింది. తిరుపతి అలిపిరి నుండి తిరుమలకు కాలినడక మార్గం సుమారు 10కిలోమీటర్లు దూరం అటవీ ప్రాంతంలోనే ఉంది. 3,550 మెట్లు మార్గంలో భక్తులు ప్రయాణానికి ఐదుగంటల సమయం పడుతుంది. ఈ మధ్యదూరం పూర్తిగా అటవీ ప్రాంతానికి ఆనుకునే ఉంది. అడపాదడపా చిరుత పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు ఆహారం కోసం, వన్యప్రాణి సంతతి ఉత్పత్తి కోసం అడవిని వదలి దారితప్పి ఇలా నడకమార్గాల్లోకి. ఘాట్‌రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. ఎక్కడైనా ఒంటరిగా కనిపిస్తే దాడి చేస్తుండటంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అలిపిరి నడక మార్గంలో వన్యప్రాణుల నుంచి రక్షణ కోసం ఇనుప కంచె (ఫెన్సింగ్) ఏర్పాటుపై 2022లోనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. నడక మార్గంలో వన్యప్రాణుల దాడులను అరికట్టడానికి అలిపిరి నుండి తిరుమల వరకు దారికి ఇరువైపులా ఇనుప కంచె ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

**అత్యాధునిక సాంకేతికతతో గుర్తింపు:** కాలినడక మార్గాల్లో భక్తుల రక్షణ చర్యలపై టిటిడి, అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించాయి. క్రూరమృగాల బారినుండి కాపాడటానికి అడవిలో అధునాతన ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసి వాటి కదలికలను గమనిస్తున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో తిరుమలకు వచ్చే కాలినడక భక్తుల రక్షణకు టిటిడి అధికారులు మరింతగా ఫోకస్ చేస్తున్నారు. నడకదారి భక్తులకు రక్షణ కల్పించేందుకు మెట్లమార్గాల్లో ఇరువైపులా ఇనుపకంచే ఏర్పాటు ప్రతిపాదనలు టిటిడి తయారుచేసి కేంద్రానికి, రాష్ట్రానికి పంపారు. క్రూరమృగాల కదలికలు నియంత్రించడానికి, మెట్లమార్గాల్లో రాకుండా చూసేందుకు కంచే ఏర్పాటు శరణ్యమని భావించారు. అయితే నడక మార్గంలో కంచె వేయటం మరింత ప్రమాదకరమనే సూచనలను కమిటీ సూచించింది. చిరుతలు చెట్టుపైకి ఎక్కి కొమ్మలపై చిరుత హాయిగా నిద్రపోతుందని, అలాంటిది ఐదు, పది అడుగుల ఎత్తైన కంచెలు చిరుతలను ఏ మాత్రం ఆపలేవనే వాదన వినిపించారు. మెట్లకు ఇరువైపులా కంచె వేసినా చిరుతలు దూకి కంచె లోపలికి పొరపాటున వస్తే, అప్పుడు ఇంకా పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంటుందనేది కూడా కమిటీ తేల్చింది. ప్రాణభయంతో జనాల మధ్య తొక్కిసలాట, అదే ప్రాణభయంతో చిరుతలు కూడా మనుషులపై దాడిచేస్తే పరిస్థితి ఏంటనేది ఆందోళనకరమని స్పష్టం చేసింది. కంచే ప్రమాదకరమని కూడా తేల్చింది. దీనికంటే భక్తులకు చేతికర్రలు ఇచ్చి పంపడం వల్ల భద్రతకు ఢోకా ఉండదని 2023లో టిటిడి ధర్మకర్తల మండలి చేతికి కర్రలు ఇచ్చి పంపింది. ఆ తరువాత చిరుతల సంచారం తగ్గడంతో చేతికర్రలకు స్వస్తిచెప్పారు. అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో అత్యవసర సమయాల్లో క్షణాల్లో స్పందించేందుకు శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక రక్షణ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల భద్రత కోసం నడక మార్గంలో రాత్రి 9.30గంటల వరకే సమయం కేటాయించారు. గుంపులుగుంపులుగా భక్తులను 50మంది నుండి వందమంది వరకు అనుమతినిస్తున్నారు. ఒక్కరే కాకుండా గుంపులుగా వెళ్లటం వలన క్రూరమృగాలు దగ్గరికి రావని టిటిడి అధికారులకు అటవీశాఖ సూచనలు చేసింది. అటవీమార్గంలో వన్యప్రాణుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షి ంచేందుకు టిటిడి అటవీ శాఖ, విజిలెన్స్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖలతో బాటు సంబంధిత అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపర చుకుని, సమర్థవంతమైన పర్యవేక్షణతో సమాచార మార్పిడి, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నడకమార్గంలో లక్ష్మీ ్మనరసింహస్వామి ఆలయం వద్ద ప్రత్యేక అత్యవసర ప్రతిస్పందన బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందానికి అవసరమైన సిబ్బంది, ఆధునిక పరికరాలు, వాహనాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచి, వన్యప్రాణుల ఘటనలు చోటుచేసుకున్న వెంటనే తక్షణమే స్పందించేలా శాశ్వత

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కోట రవిశంకర్

పొన్నూరు, జులై 22,ప్రభాతవార్త: పొన్నూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కోట రవిశంకర్ను నియమిస్తూ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చుండూరు ఉమామహేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు యిల్లూరు



లక్ష్మయ్య, రాష్ట్ర సాంకేతిక, పరిశ్రమల శాఖామంత్రి టిజి భరత్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, చేతుల మీదుగా కోట రవిశంకర్ అందుకున్నారు. నూతనంగా ఎన్నికైన కోట రవిశంకర్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి, సంఘం బలోపేతానికి అందరినీ కలుపుకొని, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సహాయ సహకారాలతో కృషి చేస్తానని చెప్పారు. కోట రవి శంకర్ నియామకం పట్ల సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి డైరెక్టర్ శిఖాకొల్లి గుర్నాధరావు, వ్యవసాయ మార్కెట్యార్డు డైరెక్టర్ తవ్వా విజయ్, ఆలపాటి సుబ్బారాయ ధర్మసత్రం ధర్మకర్తల మండలి డైరెక్టర్ లింగమల్లు మోహనకృష్ణ, తాటికొండ సుధీర్బాబు, సహస్రలింగేశ్వరస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్ జిఎంఎస్ గుప్తా తదితరులు అభినందించారు.

## మధుమేహంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

### -ప్రముఖ న్యూట్రీషన్ నిపుణులు డి.సాయిబాబా

పొన్నూరు, జులై 22,ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ మధుమేహం వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యూట్రీషన్ నిపుణులు డి.సాయిబాబా సూచించారు. మండల కేంద్రమైన చేబ్రోలు ఆర్వీఐటీ కళాశాలలో మంగళవారం ఎండోలైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు జరిగింది. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిబాబా మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన శైలిలో చాలా మంది మధుమేహం వ్యాధితో బాధపడుతున్నారన్నారు. దీనికి కారణం ఆహారపు అలవాట్లేనని చెప్పారు. మధుమేహం వ్యాధి ఉన్నటువంటి వారు ఎలాంటి ఆహార నియమాలు పాటిస్తే మంచిదో వివరించారు. కళాశాల ఛైర్మన్ ఆర్ వంశీకృష్ణ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతోపాటు సామాజిక అంశాలపై కూడా విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కళాశాల పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను పారదర్శకంగా అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అతిథి సాయిబాబాను దుశ్శాలువాతో, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.కృష్ణయ్య, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## కార్మికుల సంక్షేమం-ప్రయాణీకుల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

### -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు

పొన్నూరు, జులై 22,ప్రభాతవార్త: కార్మికుల సంక్షేమం-ప్రయాణీకుల భద్రత, మెరుగైన సేవలే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ చెప్పారు. స్థానిక ఆర్టీసి డిపోలో రూ.40.55లక్షలతో పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం 500సీఎన్జీ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తోందన్నారు. ఆర్టీసి బలోపేతానికి అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో తనకు ప్రత్యేక అనుబంధముందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ డిపో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ



హయాంలో డిపోను మూసివేయాలనే ప్రయత్నాలు జరిగినప్పుడు ప్రజలతో కలిసి పోరాడి డిపోను కాపాడుకున్నామన్నారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో డిపోను పునరుద్ధరించామన్నారు.డిపో అభివృద్ధి చెందితేనే స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. పొన్నూరు డిపోకు మరిన్ని బస్సులు, కొత్త సర్వీసులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డిపో కోసం గతంలో పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకొంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ డిపో అభివృద్ధి, పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్లమాని మార్కండేయబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసి ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం అనేక గ్రామాల ప్రజలు తమ ప్రాంతాలకు కొత్త బస్సు సర్వీసులు కోరుతున్నారన్నారు. కొత్త బస్సులు వచ్చినప్పుడు పొన్నూరు డిపోకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావును కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్బాబు, పార్టీ నాయకులు బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, యస్సాం నాయుడు, గోవాద వెంకటకృష్ణారావు, బండారుపల్లి శ్రీనివాసరావు, పఠాన్ ఫిరోజ్ఖాన్, షేక్ బాజిసాహెబ్, దొప్పలపూడి రాజా, తోట ప్రసాద్, యరవాని శ్రీరామమూర్తి, కత్తుల రవికిరణ్ తదితరులున్నారు.

## భక్తులు తొలి ఏకాదశి మహోత్సవంలో పాల్గొనండి

### -అసిస్టెంట్ కమిషనర్ మంతెన అనుపమ

పొన్నూరు, జులై 22,ప్రభాతవార్త: పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారి దేవాలయంలో ఈ నెల 25వ తేదీన తొలి ఏకాదశి మహోత్సవం జరుగుతుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని దేవాలయ



అసిస్టెంట్ కమిషనర్ మంతెన అనుపమ(పూర్తి అదనపు బాధ్యతలు) కోరారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి ఉదయం 5.30గంటలకు పంచామృతాలతో అభిషేకం, 9.30గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతుందన్నారు. 10.30గంటలకు గోష్ఠి కార్యక్రమం, అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. సాయంత్రం 6గంటలకు తిరుప్పావై పారాయణ నేర్పడం జరుగుతుందన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు దేవాలయంలోని టిక్కెట్ కౌంటర్ వద్ద సంప్రదించి తమ గోత్రనామాలతో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. దేవాలయం అభివృద్ధికి దాతలు, భక్తులు ముందుకు రావాలని అనుపమ కోరారు.

## ప్రధానమంత్రి ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

### -వ్యవసాయ సహాయ సంచాలకులు రామకోటేశ్వర

పొన్నూరు, జులై 22,ప్రభాతవార్త: అర్హులైన రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలని పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.రామకోటేశ్వర కోరారు. మండల పరిధిలోని ఆరెమండ, దండమూడి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకోటేశ్వరరావు మాట్లాడుతూ వరి పంటకు ఎకరాకు రూ.800 ప్రీమియం చెల్లించాలన్నారు. తద్వారా రూ.40వేల వరకు పంటకు రక్షణ




పొందవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అసాధారణ వాతావరణ పరిస్థితులు, పురుగు, తెగుళ్ళ వల్ల నష్టపోయినప్పుడు గ్రామానికి యూనిట్గా తీసుకొని నష్టపరిహారం ఇచ్చే వెసులుబాటు ఉంటుందన్నారు.ఆగస్టు 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారా మాత్రమే ఎరువులు అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు పూర్తి వివరాలకు, యాప్లో నమోదు చేసుకోనేందుకు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఏ.శ్రీకాంత్, వియలు ఎప్పిటా, సిహెచ్ రూప, ఎంపీఈవో సింహాద్రి రమేష్బాబు, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్ అదేశాలతో తొలగిన గేట్లు..

## హర్షం వ్యక్త పరుస్తున్న విద్యార్ధులు

యడ్లపాడు, జులై 22, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు వెళ్ళే రహదారిలో స్థిరాస్తి వేంచర్ నిర్వాహకులు గేటు



ఏర్పాటుచేసిన విషయం విదితమే. దీనిపై పలుమార్లు వార్తా ప్రసారాలు మరియు పాఠశాల అధ్వర్యంలో కలెక్టర్కు విన్నవించుకున్న తదుపరి జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా స్పందించి వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులకు అదేశాలను ఇవ్వటంతో స్థానిక తహశీల్దార్ జెట్టి విజయశ్రీ తన సిబ్బందితో వెళ్లి స్థలాన్ని పరిశీలించి అడ్డుగా ఉన్న గేట్లును తొలగించటం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ వివరిస్తూ జిల్లా కలెక్టర్ అదేశాలను సారంగా గేట్లు తొలగింపు కార్యక్రమం నిర్వహించా మన్నారు. ఈ సందర్భంగా విద్యార్ధులు హర్షంవ్యక్త పరిచారు. రోడ్డు అంతా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## అమెరికాతో ఎఫ్టీఏ వద్దు.. యడ్లపాడులో రైతుల ర్యాలీ

యడ్లపాడు, జులై 22, ప్రభాతవార్త : అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ)పై కేంద్ర ప్రభుత్వం సంతకం చేయవద్దని సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు యడ్లపాడు మండల కేంద్రంలో రైతులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పిఆర్ విజ్ఞాన కేంద్రం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి వై రాధాకృష్ణ మాట్లాడుతూ అమెరికాతో ఎఫ్టీఏ అమల్లోకి వస్తే భారత వ్యవసాయ మార్కెట్ విదేశీ కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటల దిగుమతులు పెరగడం వల్ల దేశంలోని కోట్లాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. పాల ఉత్పత్తుల దిగుమతులతో పాడి



పరిశ్రమపై ఆధారపడిన రైతుల జీవనోపాధి కూడా దెబ్బతింటుందన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో దిగుమతులపై సుంకాలు ఎత్తివేయడం వల్ల అమెరికా కంపెనీలకు లాభాలు చేకూరగా, భారత రైతాంగం నష్టాల పాలవుతుందని విమర్శించారు. రైతులు కోరుతున్న విధంగా అన్ని పంటలకు చట్టబద్ధమైన గ్యారంటీ మద్దతు ధర కల్పించాలని, దేశవ్యాప్తంగా రైతుల రుణాలను ఒకేసారి మాఫీ చేసి రుణ విమోచన కమిషన్ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కల్లూరి రామారావు, వణుకూరి శ్రీనివాసరెడ్డి, పోపూరి వీరాంజనేయులు, వావిలాల వీరారెడ్డి, ముత్తవరపు పద్మారావు, బొల్లినేని సత్యం, మిరియాల అంకమ్మరావు, మల్లికార్జునరావు, తోట వెంకటేశ్వర్లు, రంగిశెట్టి జయరావు, గుండ్లకుంట కృష్ణారెడ్డి, కొమ్మినేని నాగేశ్వరరావు, పోపూరి ప్రసాద్, తులసి జగన్, ఉప్పుటూరి వెంకటేశ్వర్లు, గోగడ హరిబాబు, నూతలపాటి సుబ్బరామమూర్తి, బత్తుల అప్పారావు, కల్లూరి రామస్వామి, జరుగుల శంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కారుచోల రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంటలో అంతర పంటగా కంది సాగుచేయాలి : శాస్త్రవేత్త నగేష్

యడ్లపాడు, జులై 22, ప్రభాతవార్త : మండల పరిధిలోని తుర్లపాడు గ్రామం లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా ప్రధాన శాస్త్రవేత్త నగేష్ మాట్లాడుతూ ప్రత్తి పంటలో అంతర పంటగా




కందిని సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. నాలుగు వరుసల పత్తికి ఒక వరుస కంది సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయంతో పాటు గులాబీ రంగు పురుగు మరియు రసం పిలిచే పురుగులు యొక్క ఉద్ధృతిని కొంతమేర తక్కువ చేయవచ్చు. తుర్లపాడు గ్రామంలో ఎక్కువ మంది ఖరీఫ్ సీజన్లో ఎటువంటి పంట సాగు చేయకుండా రబీ సీజన్లో శనగ పంట సాగు చేస్తూ ఉంటారు. శనగ పంట ముందు తక్కువ కాల పరిమితిలో వచ్చే పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ముఖ్యంగా సజ్జ, రాగులు, కొర్రలు వంటి పంటలను సాగు చేయవచ్చును. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి ఏ హరి ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలని అని తెలిపారు. సాగు చేసిన అన్ని పంటలను ఈపంట ద్వారా నమోదు చేసుకోవడం ద్వారా పంట అమ్ముకునేటప్పుడు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ కాంతారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు విజయలక్ష్మి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అర్తనాధం.

### ..20ఏళ్ల సేవ....ఇంకా పెరగని జీతాలు

యడ్లపాడు, జులై 22, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో గత రెండు దశాబ్దాలకు పైగా నిబద్ధతతో సేవలందిస్తున్న లక్షలాది మంది అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, తమ జీవన పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని అత్యంత వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నామని అంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ చైర్మన్ దూసి భానుజీ రావు కోరారు. ప్రభుత్వ సేవను కర్తవ్యంగా భావించి ఇరవై సంవత్సరాలకు పైగా విధులు



నిర్వర్తిస్తున్నప్పటికీ, ఇప్పటికీ నెలకు రూ.13,087 వేతనంతోనే జీవనం సాగించాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో ఈ వేతనం గౌరవప్రదమైన జీవనానికి సరిపోవడం లేదని వారు చెబుతున్నారు. “గౌరవ లోకేష్ మేము ప్రభుత్వానికి భారంగా ఉండాలని ఎప్పుడూ కోరుకోలేదు. మా జీవితమంతా ప్రభుత్వ సేవకే అంకితం చేశాము. ప్రజలకు సేవ చేయడంలో ఎన్నడూ వెనుకడుగు వేయలేదు. కానీ నేడు మా జీవితాలు మాత్రం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాయి. ఇరవై సంవత్సరాలకు పైగా విధులు నిర్వహిస్తున్న మేము, ఇప్పటికీ నెలకు రెగ్యులర్ ఉద్యోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న వేతనాలు, సౌకర్యాలు వారి హక్కులు. వాటిని మేము గౌరవిస్తున్నాము. మంత్రి లోకేష్ కి మేము మీ ముందుకు నిరసనతో రాలేదు... విశ్వాసంతో వచ్చాము. మేము ఆగ్రహంతో రాలేదు... ఆశతో వచ్చాము. మా కన్నీళ్లను చూసి జాలి పడాలని కాదు, మా పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నాము.“ ఉద్యోగులు చివరగా ప్రభుత్వాన్ని ఉద్దేశించి, “మా వినతిని సానుభూతితో మాత్రమే కాకుండా, మానవీయ దృక్పథంతో పరిశీలించి, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, ఉద్యోగ భద్రతపై తక్షణ చర్యలు చేపట్టాలని వినయపూర్వకంగా ఆశిస్తున్నాము. ప్రభుత్వ నిర్ణయం లక్షలాది కుటుంబాల జీవితాల్లో ఆశాకిరణం నింపుతుందని మేము విశ్వసిస్తున్నాము.“ అని పేర్కొన్నారు.

## సైకిల్ పై తిరుమలకు యాత్ర



యడ్లపాడు, జులై 22, ప్రభాతవార్త : గుంటూరు నుండి తిరుమల కు పాదయాత్రగా వేమూరి సుబ్బారావు మరో 16 మంది మిత్రులు కలసి తిరుమలకు సైకిల్ యాత్రగా ప్రారంభించారు బుధవారం ఉదయం ఎడ్లపాడు చేరుకున్నారు. ఈ సందర్భంగా వివరిస్తూ సకాలంలో వర్షాలు పడాలని రైతులు పంటలు బాగా పండాలని సుభిక్షంగా ఉండాలని యాత్ర చేపట్టామన్నారు గతంలో 15 సంవత్సరాలు నడక మార్గంగా వెళ్లే వారమని ఈ ట్రిప్పు సైకిల్ ద్వారా ప్రయాణం సాగించడం జరిగిందన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

రేపల్లె, జూలై 22, ప్రభాతవార్త:ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహనతో ఉండాలని రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ పారాలీగల్ వాలంటీర్ సిహెచ్.నాగమల్లేశ్వరరావు అన్నారు.బుధవారం పట్టణంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద చిరు వ్యాపారులు,మోటార్ మెకానిక్స్,వెల్డింగ్




వర్కర్స్,పండ్ల వ్యాపారులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం,హైకోర్టులు అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని,డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు.సివిల్,క్రిమినల్ కేసులలో న్యాయం పొందే విధానాన్ని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు రాచాబత్తుని శ్రీనివాసరావు,వాగోలు బాబూరావు,సయ్యద్ తాహిర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లెలో దస్తావేజు లేఖర్ల ర్యాలీ

రేపల్లె, జూలై 22, ప్రభాతవార్త:సబ్ రిజిస్ట్రార్ కార్యకలాపాలలో ప్రైవేటు ఏజన్సీలను భాగస్వామ్యం చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన 396 ఉత్తర్వును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రేపల్లె పట్టణంలోని రింగు రోడ్ సెంటరు నుండి నెహ్రూ విగ్రహం సెంటరు వరకు దస్తావేజు లేఖర్లు,స్టాంప్ వెండర్లు,డిటిపి ఆపరేటర్లు ర్యాలీ నిర్వహించారు.ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.బాలమురళీకృష్ణ



రాజు,ఉపాధ్యక్షుడు పసుపులేటి గోపాల్,కార్యదర్శి బెల్లంకొండ మురళి,కోశాధికారి కాలేషా,దస్తావేజు లేఖర్లు మొగసాటి రవీంద్ర, అడిగొప్పుల ప్రసాద్,చాట్రగడ్డ వెంకట రమణ, యల్లాప్రగడ భాస్కరరావు,కొండవీటి వీరబాబు,ఆంజనేయులు, వలీ,పడమట సుబ్బారావు, యుగంధర్, శ్రీధర్,ఒల్లు శ్రీనివాస రావు,అమ్ముల నాగేంద్రకుమార్, కుంచాల చంద్ర, ఉల్లంగుంట వెంకటేశ్వరరావు,బత్తుల రంగారావు,తూనుగుంట్ల శ్రీరామమూర్తి,కె.వి.గోపాలరావు,డి.ఆంజనేయులు, వి.శ్రీనివాసరావు, కె.వీరబాబు, జి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి-మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్బాబు

పొన్నూరు, జూలై 22,ప్రభాతవార్త: యువత క్రీడల్లో రాణించాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్బాబు కోరారు. స్థానిక డివిసి ఇండోర్ స్టేడియంలో అమరావతి ఛాంపియన్ షిప్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. నియోజకవర్గంలోని పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరై చురుగ్గా క్రీడల్లో పాల్గొన ఆనరు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన మునిసిపల్ కమిషనర్ రమేష్బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే



ఉద్యోగాలలో వారికి అవకాశాలుంటాయన్నారు. ఇటీవల జరిగిన డిఎస్సీ పరీక్షల్లో కూడా చాలా మంది క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగాలు పొందగలిగారని గుర్తు చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో ఉన్నతులుగా తీర్చిదిద్దేవిధంగా ఆలోచన చేయాలన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్,రన్నింగ్, వెయిట్లిఫ్టింగ్, హాకీ, బాస్కెటల్బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వ్యాయామ ఉపాధ్యాయులు మంద్రు జాన్ విల్సన్, లక్ష్మీపతి, చంటిబాబు, వెంకటేశ్వరరావు, సరళాదేవి, ఉమ తదితరులున్నారు.

## 25 నుంచి మహిళా త్రోబాల్ టోర్నమెంట్

### -కళాశాల ఛైర్మన్ వంశీకృష్ణ

పొన్నూరు, జూలై 22,ప్రభాతవార్త: ఈషా గ్రామోత్సవం-2026లో భాగంగా మహిళల కోసం ప్రత్యేకంగా త్రోబాల్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ ఆర్ వంశీకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన చేబ్రోలు ఆర్వీఐటీలో ఈ నెల 25,26తేదీలలో జరిగే పోటీలకు పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. ఈ టోర్నమెంట్కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు రానున్నట్లు చెప్పారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతయ, నాలుగో బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించడం లక్ష్యంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం.8074565490, 6302589153 సంప్రదించాలని కోరారు.

## లింగ నిర్ధారణ పరీక్షల నిర్వహణ చట్టవిరుద్ధం: ఆర్డీవో శ్రీదేవి



రేపల్లె, జూలై 22, ప్రభాతవార్త:గర్భిణీలకు స్కానింగ్ నిర్వహించే సమయంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమని రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి స్పష్టం చేశారు.బుధవారం ఆర్డీవో కార్యాలయంలో పిసిపిఎన్డిటి చట్టానికి సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైతే లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారో అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.టీనేజ్ బాలికలకు సరైన నడవడికపై అవగాహన కల్పించేందుకు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు.రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో నాలుగు ప్రభుత్వ వైద్యశాలలు,24 ప్రైవేటు వైద్యశాలలు ఉన్నాయని చెప్పారు.ఇకపై ప్రతి రెండు నెలలకు ఒకసారి,నెలలో 3వ శనివారం సమావేశం నిర్వహించి సమీక్షిస్తామని శ్రీదేవి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎన్సిడిసిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.లలిత రాజేశ్వరి,డిఎస్పి అబ్దుల్ అజీద్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శ్రీనివాస్ మూర్తి,ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ ప్రతినిధి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య,రోటరీ క్లబ్ ప్రతినిధి ఎం.ఎం.సక్సేనా,రేపల్లె ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.పృధ్వీగణేష్,డాక్టర్ శ్వేత,డిప్యూటీ డెమోగ్రాఫర్ మాధవి,సీనియర్ మెడికల్ ఆఫీసర్ సముద్రాల రమేష్,డాక్టర్లు రెబ్బా జాన్ప్రసాద్,షేక్ షాహిన్,వి.ఎస్.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి



రేపల్లె, జూలై 22, ప్రభాతవార్త:ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డు పొందేలా చర్యలు తీసుకుంటామని రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి చెప్పారు.బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలంటే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అవసరమని తెలిపారు.కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందించాలనే లక్ష్యంతో ప్రతి రెవెన్యూ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కౌలుదారీ చట్టంపై భూ యజమానులకు ఉన్న అపోహలను తొలగిస్తూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రూపొందించిన కరపత్రంలో విలువైన సమాచారం ఉందని ఆమె పేర్కొన్నారు.ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడే పరిస్థితి ఉన్నందున తక్కువ నీటితో సాగు చేసే పంటలను పండించేందుకు రైతులు సిద్ధం కావాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ వేము భగవాన్దాస్ తదితరులు పాల్గొన్నారు.

## భట్టిప్రోలులో దస్తావేజు లేఖర్ల నిరవధిక నిరాహార దీక్ష

రేపల్లె, జూలై 22, ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 396ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం భట్టి ప్రోలులో దస్తావేజు లేఖర్లు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు.రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం సరికాదని నినాదాలు చేశారు.దస్తావేజు లేఖర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని




ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కారుమూరు పాండురంగారావు,తమ్మన లక్ష్మీనారాయణ,వీరాస్వామి,దాసు, సునీల్,బోడపాటి సుబ్బారావు,శివుడు,స్టాంప్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల భద్రత అందరి బాధ్యత:కమీషనర్ సాంబశివరావు

రేపల్లె, జూలై 22, ప్రభాతవార్త:పరిశుభ్రమైన సమాజం కోసం ప్రతి రోజూ కష్టపడే పారిశుధ్య కార్మికుల భద్రత అందరి బాధ్యత అని రేపల్లె మున్సిపల్ కమీషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు.బుధవారం పురపాలక సంఘ కారా ్యలయంలో వేస్ట్ పిక్కర్స్,రోడ్డు పారిశుధ్య పనులు చేసే




కార్మికులు,మ్యాన్ హోల్స్ నిర్వహించే పారిశుధ్య కార్మికులకు “నమస్తే” ప్రోగ్రామ్ ద్వారా కలిగే ప్రయోజనాలు,భద్రతా ప్రమాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.అర్హులైన పారిశుధ్య కార్మికులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రమాదకర పారిశుధ్య పనుల కోసం యంత్రాలను ప్రోత్సహించాల్సి ఉంటుందన్నారు.అపాయకర మానవ వ్యర్థాల తొలగింపు,నివారణకు సంబంధించి అవగాహన కలిగి ఉండాలన్నారు.వ్యక్తిగత రక్షణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పిపిఇ కిట్ల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ టి.అనిల్కుమార్,డిబిఆర్సి కో ఆర్డినేటర్ వి.భగవాన్దాస్,నమస్తే ప్రోగ్రామ్ టీమ్ సభ్యులు,వార్డు,శానిటేషన్,ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు,పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే...ఆరోగ్యానికి భద్రత-ఎంపీడీవో విజయలక్ష్మీ

కొల్లిపర,జూలై 22 ప్రభాతవార్త: పరిసరాల పరిశుభ్రంగా ఉండటం వలన మన ఆరోగ్యానికి భద్రత కలుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మీ పేర్కొన్నారు.బుధవారం మండల పరిధిలోని మున్నంగిలో స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.పంచాయతీ కార్మికులు రోడ్లను శుభ్రపర్చి తడి చెత్త..పొడిచెత్తను వేరు చేసి వాహనాల ద్వారా సంపద కేంద్రాలకు తరలించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ పారిశుద్ధ్యం పట్ల గ్రామీణ ప్రజలు సహకరించాలన్నారు.తహశీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రతిక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు.అనంతరం మండల కేంద్రం కొల్లిపర మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో



అంగన్వాడీ కార్యకర్తలతో ఎంపీడీవో సమీక్షా సపమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయటమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.అంగన్వాడీ కార్యకర్తలు..గర్భిణీలు..బాలింతల ఫోన్ నెంబర్లను నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23-07pg10exHMNWJQE_23-07pg10exHMNWJQE.qxd 22/Jul/26 10:56 PM Page 1







## చైనా ఓపెన్‌లో ఉన్నతి, శెట్టిలను
# ఓడించిన సింధు
### పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ సంచలనం

**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్-2026 టోర్నమెంట్‌లో, పీవీ సింధు తన స్వదేశీ క్రీడాకారిణి ఉన్నతి హుడాపై మూడు గేమ్‌ల విజయంతో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. జపాన్ ఓపెన్‌లో విజయం సాధించి మంచి ఫామ్‌లో ఉన్న ప్రపంచ 15వ ర్యాంకర్ చాంగ్‌జౌలో బుధవారం జరిగిన చైనా ఓపెన్‌లో హుడాను 21-14, 9-21, 21-10 తేడాతో ఓడించింది. అలాగే పురుషుల సింగిల్స్‌లో, ఆయుష్ శెట్టి మొదటి రౌండ్‌లో ఇండోనేషియాకు చెందిన ప్రపంచ నంబర్ 11 అల్వి ఫర్హాన్‌ను మూడు గేమ్‌లలో ఓడించి సంచలనం సృష్టించాడు. యువ భారత షట్లర్ మాజీ జూనియర్ ఛాంపియన్‌ను 21-17, 5-21, 21-17 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. చైనా జట్టుతో జరిగిన పోరులో భారత డబుల్స్ జట్టుకు చాలా కష్టంగా గడిచింది. రోహన్ కపూర్-రుత్విక శివాని గద్దె, టాప్ సీడెడ్ జోడీ అయిన యాన్ జె ఫెంగ్-డాంగ్ పింగ్ హువాంగ్ చేతిలో 21-9, 21-16 తేడాతో ఓడిపోయారు. ఇక ధ్రువ్ కపిల-తనిషా క్రాస్టో కూడా జిన్ వా గువో-ఫాంగ్ హుయ్ చెన్‌ల చేతిలో వరుస గేమ్‌లలో 21-18, 21-18తో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ జోడీ ఎంఆర్ అర్జున్-హరిహరన్ అమ్సకరుణన్ నాలుగో సీడ్ జోడీ వీ కెంగ్ లియాంగ్-చాంగ్ వాంగ్‌ల చేతిలో ఓటమి పాలయ్యారు.

## ఐసిసి వన్డే ర్యాంకింగ్ టాప్ 4లో
# గిల్, రోహిత్, కోహ్లీ



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌పై అద్భుత ప్రదర్శనతో శుభ్‌మన్ గిల్ ఐసీసీ పురుషుల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరువయ్యాడు. అదే సమయంలో, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా తాజా అప్‌డేట్‌లో అగ్రస్థానంలో భారత్ ఉనికిని మరింత బలోపేతం చేశారు. మిచెల్ 802 రేటింగ్ పాయింట్లతో నెం.1 స్థానంలో కొనసాగుతుండగా, ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 188 పరుగులు సాధించిన గిల్ ఇప్పుడు కేవలం ఒక పాయింట్ వెనుకబడ్డాడు. కోహ్లీ 767 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతుండగా, రోహిత్ 758 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. భారత్‌తో జరిగిన సిరీస్‌ను ఇంగ్లండ్ కైవసం చేసుకుంది. సిరీస్ అంతటా నాటౌట్‌గా నిలిచి 249 పరుగులు చేసిన కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ జో రూట్ వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 8వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ తరపున బెన్ డకెట్ 11 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 19వ స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. భారత్‌పై ఐదు 3 పడగొట్టిన ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఒక స్థానం ఎగబాకి మూడో స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్ ఎడమచేతి వాటం స్పిన్నర్ గుడకేష్ మోతీ ఏడు స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 9వ స్థానానికి చేరుకుని టాప్ 10లోకి ప్రవేశించాడు. భారత ఆటగాడు అక్షర్ పటేల్ కూడా 10 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 32వ స్థానానికి చేరుకుని గణనీయమైన పురోగతి సాధించాడు. బ్రేస్‌వెల్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన మూడవ స్థానానికి చేరుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అజ్మతుల్లా ఒమర్జాయ్ ఈ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ రెండవ స్థానంలో నిలిచాడు.



## ప్రణేష్ చేతిలో గుకేశ్ ఓటమి

**న్యూఢిల్లీ:** చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌లో ఎం. ప్రణేష్, ప్రపంచ ఛాంపియన్ డి. గుకేష్‌ను 39 ఎత్తులలో ఓడించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో గుకేష్ వరుసగా రెండవ ఓటమిని చవిచూశాడు. అనుకూలమైన స్థితిలో ఉండి ఎరిగైసి అర్జున్ చేతిలో ఓడిపోయిన మరుసటి రోజే, గుకేశ్ మళ్ళీ ప్రణేష్ చేతిలో తన ఆధిక్యాన్ని చేజార్చుకున్నాడు. కరోకాన్‌లో తెల్ల పావులతో ఆడుతున్న ప్రణేష్, మొదట్లో ఆ ఎత్తుగడ తనను ఒత్తిడికి గురిచేసినప్పటికీ, లాంగ్ కాస్లింగ్ చేసి సంక్లిష్టతలను కొనితెచ్చుకున్నాడు. గుకేష్ బలమైన క్యూసి7 మరియు ఎన్‌బి4 ఎత్తుగడలను ఎదుర్కొని, విజయం సాధించేందుకు దగ్గరగా కనిపించాడు. అయితే, డి3 వద్ద సరైన సమయంలో లభించిన పాన్ బ్రేక్ వంటి అవకాశాలను చేజార్చుకోవడంతో, అతను తన పొజిషన్‌ను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతను తన రూక్‌ను బి5కు కదిపిన తర్వాత ప్రణేష్ తిరిగి పోటీలోకి వచ్చాడు, కానీ బి5 ఎత్తు ఆ యువ ఆటగాడిని పూర్తి నియంత్రణలో ఉంచింది.

# నేటి నుండి జింబాబ్వేతో టి20 సిరీస్



### టీమిండియాకు హ్యాట్రిక్ క్లీన్ స్వీప్ ముప్పు
### అదే బలహీన స్కెచ్‌తో బరిలోకి జింబాబ్వే

**న్యూఢిల్లీ:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో భారత బ్యాటింగ్ విభాగాన్ని కోలుకోలేని దెబ్బతీసిన బౌన్సర్ల ముప్పు, ఇప్పుడు జింబాబ్వే సిరీస్‌లోనూ టీమిండియాను తీవ్రంగా కలవరపెడుతోంది. పరుగుల వేటలో షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోలేక పదే పదే వికెట్లు పారేసుకుంటున్న టీమిండియా యువ బ్యాటర్లపై ఈ నెల 23 నుండి హరారే వేదికగా ప్రారంభమవుతున్న టీ20 సిరీస్‌లో మరోసారి పేస్ దండయాత్రకు ప్రత్యర్థి వ్యూహాలు రచిస్తోంది. ఇటీవల ముగిసిన ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో టీమిండియా ఎదుర్కొన్న వరుస ఓటములకు ప్రధాన కారణం బ్యాటర్ల వైఫల్యమే. ప్రత్యర్థి ఫాస్ట్ బౌలర్లు సంధించిన పవర్ ఫుల్ షార్ట్ పిచ్ బంతులను అంచనా వేయడంలో టీమిండియా బ్యాటర్లు ఘోరంగా తడబడ్డారు. ఈ బలహీనతను పసిగట్టిన జింబాబ్వే బౌలర్లు కూడా అదే అస్త్రాన్ని ఉపయోగించేందుకు సిద్ధమయ్యారు. హరారే మైదానంలోని పిచ్‌లు ఎంతో వేగంతో పాటు అధిక ఉత్సాహపూరితమైన ఎత్తు (బౌన్స్) కలిగి ఉంటాయి. ఇది ప్రత్యర్థి ఫాస్ట్ బౌలర్లకు కొండంత బలాన్ని ఇవ్వనుంది. యూకే సిరీస్‌లో భారత ఆటగాళ్ల పరాభవాన్ని నిశితంగా గమనించిన జింబాబ్వే యాజమాన్యం, తమ జట్టులోని ధాటిగా బౌలింగ్ చేసే ఫాస్ట్ బౌలర్లను రంగంలోకి దింపుతోంది. ముఖ్యంగా ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ రిచర్డ్ ఎన్గారవా తన యార్కర్లతో పాటు షార్ట్ బంతులతో విరుచుకుపడటంలో దిట్ట. ఇటీవల బంగ్లాదేశ్‌పై హరారేలోనే జరిగిన టీ20 సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌ల్లోనే 8 వికెట్లు తీసి ప్రత్యర్థులను వణికించాడు. అతనితో పాటు, పొడవాటి బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ కూడా భారత బ్యాటర్లకు పెద్ద ముప్పుగా మారనున్నాడు. బంగ్లాదేశ్ సిరీస్‌లో కేవలం 5.75 ఎకానమీతో అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసి కీలక వికెట్లు పడగొట్టాడు. వీరిద్దరితో పాటు మరో ఫాస్ట్ బౌలర్ బ్రాడ్ ఈవాన్స్ కూడా తన వేగవంతమైన షార్ట్ బంతులతో భారత ఆటగాళ్లను ఇబ్బంది పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు.

ఈ పరిస్థితుల్లో భారత జట్టులోని పలువురు కీలక ఆటగాళ్లు ఇటీవల షార్ట్ బంతులకు వికెట్లు సమర్పించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. వైభవ్ సూర్యవంశీతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ రకమైన బంతులను ఎదుర్కొనే క్రమంలో ఒత్తిడికి లోనవుతున్నారు.

వీరితో పాటు విస్ఫోటక ఓపెనర్ అభిషేక్ శర్మ, ఆల్‌రౌండర్ శివమ్ దూబె కూడా షార్ట్ పిచ్ బంతులకు ఔట్ కావడం గమనార్హం. జింబాబ్వేతో జరిగే ఈ మ్యాచ్‌లలో మన ఆటగాళ్లు తమ లోపాలను ఎంత త్వరగా సరిదిద్దుకుని, సాంకేతికతను మెరుగుపరుచుకుంటారో అనే దానిపైనే సిరీస్ ఫలితం ఆధారపడి ఉంటుంది.

## ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో
## నిరాశతో ప్రారంభించిన భారత్ షూటర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల తొలి రోజున చైనా పతకాలను కైవసం చేసుకోగా, ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ ఆఖరి సన్నాహక మ్యాచ్‌లో భారత షూటర్లు తడబడ్డారు. ఈ ఈవెంట్‌లో భారత షూటర్లకు నిరాశాజనకమైన ఆరంభం లభించింది, దేశానికి చెందిన రెండు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ జట్లలో ఏదీ కూడా క్వాలిఫికేషన్ దశను దాటి ముందుకు సాగలేకపోయింది. బుధవారం జరిగిన ప్రపంచ కప్ తొలిరోజు ఆతిథ్య చైనా ఆధిపత్యం చెలాయించి, అందుబాటులో ఉన్న రెండు స్వర్ణ పతకాలనూ కైవసం చేసుకోగా, భారత్ పతకం లేకుండానే సరిపెట్టుకుంది. పలు ప్రపంచ కప్ స్వర్ణ పతక విజేతలైన సురుచి ఇందర్ సింగ్, కేదార్లింగ్ ఉచగన్వేల జోడి 577 మొత్తం స్కోరుతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఇందులో సురుచి 292, కేదార్లింగ్ 285 స్కోరు సాధించారు.

కేవలం మొదటి నాలుగు జట్లు మాత్రమే ముందుకు వెళ్లే క్రమంలో, చైనా రెండు ఫైనల్ స్థానాలను దక్కించుకోవడం ద్వారా తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వీరిలో ఒకరైన యావో కియాన్‌క్సున్ మరియు హు కై కలిసి 591 స్కోరు సాధించి క్వాలిఫికేషన్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టారు. భారత్‌కు చెందిన రెండవ జోడీ సైన్యం, కమల్‌జీత్ కూడా 577 పరుగులు చేసినప్పటికీ, వరుసగా 288, 289 స్కోర్లతో 11వ స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది.



### ముడిచమురు, టారిఫ్ ఎఫెక్ట్:
# ఇన్వెస్టర్ల సంపద 4.2 లక్షలకోట్లు ఆవిరి
### నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి,జులై 22:** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడం, ఇరాన్‌కు సంబంధించిన భౌగోళిక ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చడం, అమెరికా ప్రకటించిన కొత్త టారిఫ్ విధానం ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాలతో ముగిశాయి. గత 10 ట్రేడింగ్ సెషన్లలో ఇదే అతిపెద్ద పతనంగా నమోదైంది. మార్కెట్ పతనంతో పెట్టుబడిదారుల సంపదలో సుమారు రూ.4.2 లక్షల కోట్లు ఆవిరైనట్లు బీఎస్ఈ గణాంకాలు వెల్లడించాయి. నిఫ్టీ 50 సూచీ 191.45 పాయింట్లు కోల్పోయి 23,996.25 వద్ద ముగియగా, సెన్సెక్స్ 715.06 పాయింట్లు పడిపోయి 76,755.05 వద్ద స్థిరపడింది. వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ ప్రధాన సూచీలు నష్టాల్లోనే ముగిశాయి.అమెరికా మరోసారి ఇరాన్‌పై వైమానిక దాడులు జరపడంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతి చేసుకునే జనరిక్ ఔషధాలపై దశలవారీగా భారీ టారిఫ్‌లు విధించనున్నట్లు ప్రకటించడం కూడా పెట్టుబడిదారుల ఆందోళనను పెంచింది. ఇరాన్‌కు సంబంధించిన భౌగోళిక పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలు ఉండటంతో మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది.ముడి చమురు ధరలకు మళ్లీ జోష్అమెరికా వరుసగా 11వ రాత్రి కూడా ఇరాన్‌పై సైనిక దాడులు నిర్వహించడంతో బుధవారం అంతర్జాతీయ ముడి చమురు ధరలు దాదాపు 4 శాతం ఎగిశాయి.ప్రపంచ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 3.5 శాతం పెరిగి 94.20 డాలర్లకు చేరగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 3.8 శాతం పెరిగి 87.56 డాలర్ల వద్ద ట్రేడైంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతి చేసుకునే జనరిక్ ఔషధాలపై కొత్త టారిఫ్ విధానాన్ని ప్రకటించారు. దీనితో ఫార్మా రంగ షేర్లపై కూడా ఒత్తిడి పెరిగింది.ట్రంప్ ప్రకటించిన ప్రణాళిక ప్రకారం ంచ్చే ఆగస్టు 1 నుంచి వచ్చే రెండేళ్ల పాటు దిగుమతి జనరిక్ ఔషధాలపై సున్నా శాతం టారిఫ్ కొనసాగుతుంది. ఆ తరువాత ఒక సంవత్సరం పాటు 100 శాతం టారిఫ్ అమల్లోకి వస్తుంది.అనంతరం 200 శాతం టారిఫ్ విధించబడుతుంది.ఈ నిర్ణయం భారతీయ జనరిక్ ఔషధ ఎగుమతులపై భవిష్యత్తులో ప్రభావం చూపే అవకాశం ఉందనే ఆందోళనతో మార్కెట్లలో ప్రతికూల ప్రభావం కనిపించింది. మార్కెట్లకు ప్రధానంగా ఐసిఐసిఐబ్యాంకు 1.60శాతం, రిలయన్స్ 1.51శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.99శాతం నిఫ్టీపై ఒత్తిడి తెచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 1.05శాతం, స్మాలక్యాప్‌సూచీ 1.39శాతం క్షీణించింది. బిఎస్ఇలో 1458 కంపెనీలు పెరిగితే 2780 కంపెనీలు క్షీణించాయి. 193 స్థిరంగా కొనసాగాయి. బ్రెంట్‌ముడిచమురు సెప్టెంబరు ఫ్యూచర్‌ధరలు బ్యారెల్‌కు 94.77 డాలర్లుగా ఉన్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.59గా నడిచింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ల 1.22శాతంపెరిగి రూ.1,44,623కి చేరాయి.



### వార్ ఎఫెక్ట్:
# బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ 95.19 డాలర్లు


**ముంబయి,జులై 22:** అమెరికాఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బుధవారం భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఆరు వారాల తర్వాత తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును దాటి ట్రేడవుతూ ప్రపంచ ఇంధన మార్కెట్లలో ఆందోళనలను పెంచింది. మధ్యప్రాచ్య ప్రాంతం నుంచి చమురు సరఫరాలకు అంతరాయం ఏర్పడే అవకాశాలపై పెట్టుబడిదారులు ఆందోళన చెందడంతో ధరలు వేగంగా పెరిగాయి.రియల్‌టైమ్ మార్కెట్ డేటా ప్రకారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:15 గంటల సమయంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 95.19 డాలర్ల వద్ద ట్రేడవుతూ 4.23 శాతం లాభాన్ని నమోదు చేసింది. ఇదే సమయంలో అమెరికా ప్రమాణ ముడి చమురు వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా గణనీయంగా పెరిగింది. అమెరికాదాడులతో ముడి చమురు ధరల పెరుగుదల మరింత వేగం అందుకుంది.ఇక ఎర్ర సముద్రం ప్రాంతంలో కూడా ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్ హౌతీ తిరుగుబాటు దళాలు, సౌదీ అరేబియాతో సంబంధాలు ఉన్న నౌకలపై నౌకాదళ దిగ్బంధనం విధిస్తామని హెచ్చరించాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో కొన్ని చమురు ట్యాంకర్లు తమ ప్రయాణ మార్గాలను మార్చుకున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి ప్రాంతాల్లో ఒకటైన మధ్యప్రాచ్యం నుంచి ముడి చమురు ఎగుమతులకు అంతరాయం ఏర్పడే అవకాశాలపై ఆందోళనలు పెరిగాయి. ఇదిలా ఉండగా, ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ప్రయత్నించిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెండు చమురు ట్యాంకర్లను అడ్డుకుని నిలిపివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. దీంతో ప్రపంచ చమురు సరఫరాలపై కొత్త ఆందోళనలు నెలకొన్నాయి.తాజా పరిణామాల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధరలు జూన్ ప్రారంభం తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. అమెరికాఇరాన్ మధ్య ఘర్షణలు మరింత ముదిరితే ప్రపంచ చమురు సరఫరాలకు దీర్ఘకాలిక అంతరాయం ఏర్పడే ప్రమాదాన్ని మార్కెట్లు ముందుగానే అంచనా వేస్తూ ధరలను పెంచుతున్నాయని మార్కెట్ నిపుణులుఅంచనావేస్తున్నారు.

## పేస్ స్టాక్‌బ్రోకింగ్‌పై సెబీ రూ.4 లక్షల జరిమానా

**ముంబై:** యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ట్రేడింగ్ ఫ్రంట్‌రన్నింగ్ కేసు దర్యాప్తులో రికార్డుల నిర్వహణలో లోపాలు, అలాగే విచారణ సమయంలో తప్పుదారి పట్టించే సమాచారం అందించినందుకు పేస్ స్టాక్ బ్రోకింగ్ సర్వీసెస్ సంస్థపై సెబీ రూ.4 లక్షల జరిమానా విధించింది. ఈ ఉత్తర్వులో పేస్ స్టాక్ బ్రోకింగ్ సంస్థ ఫ్రంట్‌రన్నింగ్‌కు పాల్పడిందని సెబీ నిర్ధారించలేదు. సంస్థ నిబంధనలకు



అనుగుణంగా రికార్డులను నిర్వహించకపోవడం, దర్యాప్తుకు అవసరమైన కీలక సమాచారాన్ని సమర్పించడంలో విఫలమవడంపైనే చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. దర్యాప్తు సందర్భంగా మొత్తం 93 ట్రేడింగ్ లావాదేవీలకు సంబంధించిన ట్రేడర్‌ప్రత్యేక ఐపి అడ్రస్ వివరాలను పేస్ సమర్పించలేదని సెబీ తెలిపింది. ప్రతి ఆర్డర్‌ను ఏ డీలర్, ఏ ట్రేడింగ్ టెర్మినల్ ద్వారా అమలు చేశారో స్పష్టంగా గుర్తించగలిగే విధంగా రికార్డులు నిర్వహించడం స్టాక్ బ్రోకర్ల బాధ్యత అని నియంత్రణ సంస్థ గుర్తుచేసింది.ఈ విషయంలో పేస్ స్టాక్ బ్రోకింగ్ తన వాదనలో, సాంకేతిక పరిమితులు మరియు కోవిడ్ మహమ్మారి కాలంలో ఏర్పడిన ఇబ్బందుల కారణంగా నిర్దిష్ట ట్రేడర్లు ఉపయోగించిన ఐపిఅడ్రస్‌లను గుర్తించడం సాధ్యం కాలేదని తెలిపింది. ఆ వాదనలకు మద్దతుగా ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ సెబీ ఆ వివరణను తిరస్కరించింది.సెబీ ఉత్తర్వు ప్రకారం, ప్రతి వ్యక్తిగత ట్రేడర్‌కు సంబంధించిన మ్యాక్ ఐడి, ఐపి అడ్రస్లను ఖచ్చితంగా గుర్తించి అనుసంధానించలేకపోయామని పేస్ స్వయంగా అంగీకరించింది. దీంతో స్టాక్ బ్రోకర్లకు వర్తించే రికార్డు నిర్వహణ నిబంధనలను సంస్థ ఉల్లంఘించినట్లు సెబీ తేల్చింది. అదనంగా, ట్రేడింగ్ టెర్మినల్ రిజిస్ట్రేషన్ల నిర్వహణలో కూడా పేస్ నిర్లక్ష్యం వహించిందని సెబీ గుర్తించింది.



## నిరాశపరిచిన డాక్టర్ రెడ్డీస్
### నికర లాభం రూ.444 కోట్లు

**ముంబయి,జులై 22:** డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తొలి త్రైమాసికం ఫలితాల్లో బలహీన పనితీరును నమోదు చేసింది. ఆపరేటింగ్ మార్జిన్లు భారీగా క్షీణించడంతో కంపెనీ సమీకృత నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 68.7 పడిపోయి రూ.444 కోట్లకు పరిమితమైంది. మార్కెట్ అంచనాలప్రకారం కంపెనీ రూ.737 కోట్ల నికర లాభాన్ని నమోదు చేస్తుందని భావించినప్పటికీ, వాస్తవ ఫలితం రూ.444 కోట్లుగానే నమోదైంది.ఆదాయం కూడా తగ్గింది. గత ఏడాది తొలి త్రైమాసికంలో రూ.8,572 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి 5.5 తగ్గి రూ.8,100 కోట్లకు చేరింది. నికర లాభం: రూ.1,418 కోట్ల నుంచి రూ.444 కోట్లకు తగ్గితే ఆదాయం రూ.8,572 కోట్ల నుంచి రూ.8,100 కోట్లకు చేరింది. ఎబిడిటా రూ.2,173 కోట్ల నుంచి రూ.861 కోట్లకు చేరింది. విశ్లేషకులు రూ.1,398 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఎబిడిటా మార్జిన్ కూడా గత ఏడాది 25.3 నుంచి 10.6 కు పడిపోవడం ఆపరేటింగ్ పనితీరులో బలహీనతను స్పష్టంగా చూపించింది. మార్కెట్ అంచనా 17శాతం గా ఉండగా, వాస్తవ మార్జిన్ దానికంటే చాలా తక్కువగా నమోదైంది. ఇతర ఆదాయం మాత్రం పెరిగింది. గత ఏడాది రూ.290 కోట్లుగా ఉన్న ఇతర ఆదాయం ఈ త్రైమాసికంలో రూ.355 కోట్లకు చేరింది.

## ఇండస్ ఇండ్ బ్యాంక్ నికరలాభం రూ.1003 కోట్లు



**ముంబయి,జులై 22:** ప్రైవేట్ రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 46.5 శాతం పెరిగి రూ.684 కోట్ల నుంచి రూ.1,003 కోట్లకు చేరుకుంది.బ్యాంక్‌కు సంబంధించిన నికర వడ్డీ ఆదాయం కూడా స్వల్పంగా పెరిగి రూ.4,640 కోట్ల నుంచి రూ.4,685 కోట్లకు చేరింది. ఇదే సమయంలో ఆపరేటింగ్ లాభం 1.2 శాతం వృద్ధితో రూ.2,652 కోట్ల నుంచి రూ.2,683 కోట్లకు పెరిగింది.ఆస్తుల నాణ్యత లో కూడా మెరుగుదల కనిపించింది. గ్రాస్ ఎన్‌పీఏ 3.43 శాతం నుంచి 3.25 శాతానికి తగ్గగా, నెట్ ఎన్‌పీఏ 1 శాతం నుంచి 0.95 శాతానికి తగ్గింది. బ్యాంక్ నెట్ ఇంటరెస్ట్ మార్జిన్ 3.46 శాతం నుంచి 3.57 శాతానికి మెరుగుపడింది.ఇక రానిబాకీలకోసం కేటాయింపులు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ త్రైమాసికంలో బ్యాంక్ రూ.1,340 కోట్ల ప్రొవిజన్లు చేయగా, గత త్రైమాసికంలో ఇవి రూ.1,484 కోట్లు ఉన్నాయి.

## ఉద్యోగులకోసం ఎఎస్‌ఎంఎల్ రూ.22 లక్షల స్టాక్‌గ్రాంట్ బోనస్!

**న్యూఢిల్లీ,జులై 22:** సెమీకండక్టర్ రంగంలో చిప్ తయారీ కంపెనీ ఏఎస్‌ఎంఎల్ హోల్డింగ్ ఎన్వీ తమ ఉద్యోగులను కాపాడుకునేందుకు ఒక భారీ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. కంపెనీలో దీర్ఘకాలం పాటు కొనసాగే ఉద్యోగులకు 20,000 యూరోలు అంటే రూ. 22 లక్షలవరకూ షరతులతో కూడిన స్టాక్ గ్రాంట్‌ను అందించనున్నట్టు వెల్లడించింది. కృత్రిమ మేధ కారణంగా ఆధునాతన చిప్‌లకు డిమాండ్



విపరీతంగా పెరగడంతో ఈ రంగంలో ఏర్పడిన తీవ్రమైన నిపుణుల కొరతను అధిగమించేందుకే ఈ నిర్ణయం తీసుకుంది. నెదర్లాండ్స్‌కు చెందిన ఈ టెక్నాలజీ దిగ్గజం, ఈ రిటెన్షన్ బోనస్ పథకాన్ని 2027 జనవరి 1 నుంచి ప్రారంభించనుంది. ఈ పథకం కింద ప్రయోజనం పొందాలంటే ఉద్యోగులు 2030 చివరి వరకు కంపెనీలో కొనసాగాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఎస్‌ఎంఎల్‌లో సుమారు 44,500 మంది ఉద్యోగులు ఉండగా, అర్హులైన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని కంపెనీ స్పష్టం చేసింది. ఉద్యోగుల గత పనితీరుకు గుర్తింపుగా, భవిష్యత్తులో పెరగనున్న పనిభారానికి ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను అందిస్తున్నట్లు వివరించింది. ఈ స్టాక్ గ్రాంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ఖరారు చేయనున్నారు. ఏఎస్‌ఎంఎల్ ఉద్యోగుల్లో సగానికి పైగా నెదర్లాండ్స్‌లో పనిచేస్తుండగా, సుమారు 8,500 మంది అమెరికాలో ఉన్నారు. ఇటీవల ఏఎస్‌ఎంఎల్ బలమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. కంపెనీ 2.92 బిలియన్ యూరోల నికర లాభాన్ని ఆర్జించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14